ఆదివారం 11-2-2024

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16
సంచిక: 321

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



సాకేత్-రామ్ జోడీకి టైటిల్

16వ ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ గెలిచిన ఏపీ టెన్నిస్ స్టార్ -స్పోర్ట్స్‌లో



ఆరో ప్రపంచకప్ వేటలో...

నేడు అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఆసీస్‌తో భారత్ తుది పోరు -స్పోర్ట్స్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం ॥ 11-2-2024



బాలీవుడ్ లవ్‌స్టోరీ మూవీలపై 'ఆరెంజ్ పీల్ థియరీ' మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. పాత సీన్స్‌కు కొత్త క్యాప్షన్లు కనిపిస్తున్నాయి.

తల్లితో కమేడియన్ అంచల్ అగర్వాల్



వైరల్

తొక్కలో ప్రేమ
ఆరెంజ్ పీల్ థియరీ

'మీరు ప్రేమిస్తున్న వ్యక్తి మిమ్మల్ని నిజంగా ప్రేమిస్తుంది లేదా ప్రేమిస్తున్నాడు అనేది క్షణాల్లో తెలుసుకోవాలనుకుంటున్నారా? దీనికి ఒక మార్గం ఉంది. అదే ఆరెంజ్ పీల్ థియరీ' అంటూ ఇంటర్నెట్‌లో మొదలైన సందడి వైరల్ కావడానికి ఎంతో టైమ్ పట్టలేదు.

లవ్ లిట్మస్ టెస్ట్‌గా భావించే 'ఆరెంజ్-పీల్-థియరీ' సోషల్ మీడియా వైరల్ ట్రెండ్‌గా మారింది. ఈ ట్రెండ్‌లో భాగంగా ఎన్నో మీమ్స్ వస్తున్నాయి. తాజాగా కమేడియన్ అంచల్ అగర్వాల్ 'ఆరెంజ్ పీల్ థియరీ'పై తన తల్లితో కలిసి చేసిన వీడియో వైరల్ అయింది. 7 మిలియన్‌ల వ్యూస్ దక్కించుకుంది.

ఇంతకీ ఏమిటి ఆరెంజ్ పీల్ థియరీ?

సింపుల్‌గా చెప్పాలంటే ఒక ఆరెంజ్‌ను లవర్‌కు చూపిస్తూ....

'నా కోసం ఈ ఆరెంజ్ తొక్క తీయగలవా?' అని అడగాలి. లవర్ వెంటనే 'ఓకే' అంటే మనది నిజమైన ప్రేమ!

ఇది సిల్లీ టెస్ట్‌గా అనిపిస్తున్నప్పటికీ ఇంటర్‌నెట్ లోకవాసులలో చాలామంది దీన్ని స్ట్రిక్ట్‌గా ఫాలో అవుతున్నారు. ఈ వైరల్ ట్రెండ్ పుణ్యమా అని ఆరెంజ్ ఫలాలు తెగ అమ్ముడవుతున్నాయట!

శభాష్ శారీనా సింగ్



శారీ వర్కవుట్ వీడియోలతో ఇంటర్నెట్‌లో ఫేమ్ అయింది ఫిట్‌నెస్ కోచ్ రీనాసింగ్. చీరకట్టుతో పుష్-అప్స్, పుల్-అప్స్, స్క్వాట్స్, జంప్స్‌లాంటి ఎక్సర్‌సైజులు చేస్తూ నెటిజనులను ఆకట్టుకొంటుంది. పాత, కొత్తా అనే తేడా లేకుండా ఆమె వీడియోలు వైరల్ అవుతూనే ఉంటాయి. రీనాసింగ్ తాజా వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో 21.3 మిలియన్‌ల వ్యూస్‌ను సాధించింది.

'వర్కవుట్‌ల సమయంలో సౌకర్యవంతమైన దుస్తులు ధరించాలని సిఫారసు చేసినప్పటికీ సౌకర్యంగా అనిపిస్తే చీర ధరించి వ్యాయామాలు చేయడం పొరపాటేమీ కాదు. అయితే గ్రిప్ తప్పకుండా ఉండడానికి అవసరమైన ఫుట్‌వేర్ ధరించాలి' అంటుంది యోగా ట్రైనర్ అనూష రామ్.



అయ్ బాబోయ్ ఇదేంటండీ!
ఆపరేషన్ థియేటర్‌లో ప్రి-వెడ్డింగ్ ఫొటోషూట్

'వెర్రి వెయ్యి విధాలు' అంటారు. ఆ జాబితాలో అర్జంటుగా చేర్చదగ్గ వెర్రి ఇది. కర్నాటకలోని చిత్రదుర్గ ప్రభుత్వ ఆస్పత్రిలోని కాంట్రాక్ట్-బేస్డ్ ఫిజీషియన్ అభిషేక్ తన ప్రి-వెడ్డింగ్ షూట్ కోసం అందరిలాగా ఆహ్లాదకరమైన, అందమైన ప్రదేశాన్ని ఎంచుకోలేదు. ఏకంగా ఆపరేషన్ థియేటర్‌నే ఎంచుకున్నాడు. ఈ వీడియోలో బెడ్‌పై పడుకున్న పేషెంట్‌కు సర్జరీ చేస్తున్నట్లు డాక్టర్ నటిస్తుంటే, కాబోయే శ్రీమతి సర్జరీకి తనవంతుగా సహకరిస్తున్నట్లు నటించింది. (ఉత్తుత్తి) ఆపరేషన్ పూర్తికాగానే (ఉత్తుత్తి) పేషెంట్ లేచి 'ఇప్పుడు నాకు ఫరవాలేదు' అన్నట్లుగా కూర్చోవడం మరో వినోదం.

ఆపరేషన్ థియేటర్‌లో కెమెరాలు, లైట్‌లతో హడావిడి చేస్తున్న వ్యక్తులు కనిపిస్తారు.

ఈ వీడియో వీర లెవెల్లో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా సదరు డాక్టర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

ఈ వీడియో పుణ్యమా అని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని లోపాల నుంచి వెర్రితలలు వేస్తున్న ప్రి-వెడ్డింగ్ షూట్‌ల వరకు ఎన్నో విషయాలపై గరం గరంగా నెటిజనులు చర్చ చేస్తున్నారు.

చేవగల ఆట ఈ చేప ఆట

'గిల్లి దండ' 'దాగుడు మూతలు' 'గచ్చకాయల ఆట' ఈ డిజిటల్ తరానికి అపరిచితం. 'ఆరోజులే వేరు' అనుకునేవాళ్లకు ఆన్‌లైన్‌గేమ్ 'ఏక్ మచ్లీ పానీ మే గై' మళ్లీ పాతరోజులకు తీసుకువెళుతుంది. స్నేహితులు అందరినీ ఒక దగ్గరికి చేరుస్తుంది. ప్రస్తుతం ఇది ఇంటర్నెట్‌లో వైరల్ గేమ్‌గా మారింది. కంటెంట్ క్రియేటర్ మాన్ తోమర్ ఈ వీడియో గేమ్‌ను మొదట ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు.

వృత్తాకారంలో కూర్చొని వీలైనంత ఎక్కువమందితో ఈ గేమ్ ఆడవచ్చు. గ్రూప్‌లోని ఒక మెంబర్ 'ఏక్ మచిలీ' అని గేమ్‌ను స్టార్ట్ చేయాలి. మూడో మెంబర్ చప్పట్లు కొడుతూ 'చప్పక్' అనడంతో ఆట ఊపందుకుంటుంది. ఇది సరదా ఆట అయినా సరే గ్రౌండ్ రూల్స్ స్ట్రిక్ట్‌గా ఉంటాయి. కౌంటింగ్‌ను మరిచిపోయి తడబడే వారిని గేమ్ నుంచి తప్పిస్తారు.

తన స్నేహితులతో కలిసి ఈ గేమ్‌ను ఇంటర్‌నెట్‌కు పరిచయం చేసిన మాన్ తోమర్ 'గేమ్ ఆడే ముందు నియమాల గురించి తెలుసుకోండి. గేమ్‌ను వైరల్ చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు' అంటున్నాడు.







ఈ చిరుహాసం మంచుపూల కవిత్వం

ఆరు సంవత్సరాల వయసు ఉన్న కశ్మీరి ట్విన్ సిస్టర్స్ జైబా బింటీ తలిబ్, జైనబ్ బింటీ తలిబ్ వీడియో ఇంటర్‌నెట్‌లో వైరల్‌గా మారింది. కశ్మీర్‌లో ఫస్ట్ స్నోఫాల్‌ను సెలబ్రెట్ చేసుకోవడానికి సంబంధించిన వీడియో ఇది. ఒకేరకం దుస్తులు ధరించి, మంచుతో నిండిన వీధిలో నిలబడి 'హమ్ యహా పే బహుత్ జాదా ఎంజాయ్ కర్ రహే హై, మస్తీ కర్ రహే హై' అంటూ పిల్లలు ముద్దు ముద్దుగా మాట్లాడుతున్న మాటలు నెటిజనులను ఆకట్టుకుంటున్నాయి. పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర 'షాయరీ ఆన్ స్నో' కాప్షన్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఈ వీడియో పదకొండు మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది.



ఔరా ఐరన్ మ్యానుడా!

రష్యన్ ఇంజినీర్, యూట్యూబర్ అలెక్స్ బుర్కాన్ రియల్ ఐరన్ మ్యాన్ సూట్‌ను రూపొందించి ఆన్‌లైన్ కమ్యూనిటీని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. 'రియల్-లైఫ్ ఐరన్ మాన్ సూట్ విత్ ఏ రిపల్సర్ బ్లాస్ట్' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

'క్లిష్టమైన డిజైన్‌తో రూపొందించిన ఐరన్ మ్యాన్ సూట్‌కు సంబంధించి అలెక్స్ బుర్కాన్ ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని, సృజనాత్మకతను నెటిజనులు ప్రశంసిస్తున్నారు. తన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి అలెక్స్ ఎదుర్కొన్న సాంకేతిక సవాళ్లు, టెస్టింగ్ దశలను తెలియజేసేలా ఉంటాయి ఈ వైరల్ వీడియోలు.

'రియల్ లైఫ్ టోనీ స్టార్క్' అంటూ అలెక్స్‌ను ఆకాశానికెత్తాడు ఒక నెటిజెన్. నిజానికి సైన్స్-ఫిక్షన్ టెక్‌కు సంబంధించి అలెక్స్‌కు ఇది ఫస్ట్ ఎక్స్‌పరిమెంట్ ఏమీ కాదు. గతంలో కూడా ఆశ్చర్యం కలిగించే ఎన్నో పరికరాలను తయారు చేసి గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కాడు.

హెల్త్

కంటితో చూసేందుకు ఉపయోగపడే కీలకమైన భాగం కంటి వెనక ఉండే రెటీనా. రెటీనా మధ్య భాగం (మాక్యులా) అరుగుదలకు లోనుకావడమో లేదా క్రమంగా అక్కడి కణాలు దెబ్బతినడంతో కొంతమందికి నేరుగా ఎదుట చూసేది స్పష్టంగా కనిపించదు. ఇలా జరగడాన్ని సెంట్రల్ విజన్ లాస్ అంటారు. ఇలా సెంట్రల్ విజన్ మసకబడి పోవడాన్ని ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీజనరేషన్ (ఏఎమ్‌డీ)గా పేర్కొంటారు. అప్పుడు కేవలం పక్కభాగాల్లోని దృశ్యాలే స్పష్టంగా కనిపిస్తాయి. అంటే పెరిఫెరల్ విజన్ మాత్రమే బాగుంటుంది. ఏఎమ్‌డీ ఉన్నవారిలో వయసు పెరుగుతున్న కొద్దీ చూపు తగ్గడం ఎక్కువవుతుంది. దురదృష్టంలోని కొద్దిపాటి అదృష్టమేమిటంటే చూపు పూర్తిగా కోల్పోవడం జరగదు. గతంలో కంటే ఈ కేసులు ఇప్పుడు కాస్త ఎక్కువగా నమోదు కావడం ఆందోళనగొలిపే అంశం. ఈ సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం.



ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీజనరేషన్ అంటే...?

ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీజనరేషన్ (ఏఎమ్‌డీ) సాధారణంగా 50 ఏళ్ల తర్వాత మొదలవుతుంది. కొన్నిసార్లు ఇది కేవలం వయసు పైబడటం వల్లనే కాకపోవచ్చు. ఇందులో కోల్పోయిన దృష్టిని పూర్తిగా మళ్లీ రాబట్టలేకపోయినప్పటికీ... ఉన్న చూపును పదిలంగా కాపాడుకునే చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

ముప్పును తెచ్చే అంశాలు (రిస్క్ ఫ్యాక్టర్స్)...

'ఏజ్ రిలేటెడ్ మాక్యులార్ డీజనరేషన్' అనే పేరును బట్టి ఇది పెరిగే వయసుతో వచ్చే ముప్పు అనిపించినప్పటికీ, మరికొన్ని అంశాలూ ఏఎమ్‌డీకి కారణమయ్యే అవకాశముంది. అవి... • కుటుంబంలో మాక్యులార్ డీజనరేషన్ చరిత్ర ఉండటం (ఫ్యామిలీ హిస్టరీ). • ఊబకాయం • పొగతాగే అలవాటు • అదుపులోలేని హైబీపీ • ఆహారంలో కొవ్వు పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం.

కారణాలు...

• అల్ట్రా వయొలెట్ కిరణాలకు ఎక్కువగా ఎక్స్‌పోజ్ కావడం. • డయాబెటిస్ • ఇన్ఫెక్షన్లు • తీసుకునే ఆహారంలో కొన్ని రకాల పోషకాలు లోపించడం.

ఏఎమ్‌డీలో రకాలు...

ఇందులో రెండు రకాల ఏఎమ్‌డీలు ఉన్నాయి. అవి... డ్రై అండ్ వెట్.

డ్రై (అట్రోఫిక్) మాక్యులార్ డీజనరేషన్ ఏఎమ్‌డీలలో 90 శాతం ఈ రకానికి చెందినవే. రెటీనా మధ్యభాగంలో 'డ్రూసెన్' అని పిలిచే పసుపుపచ్చరంగు లైపోప్రొటీన్ కణాలు పేరుకుపోవడం వల్ల ఆ భాగం పలుచబారుతుంది. ఇది తక్షణం కాకుండా... క్రమక్రమంగా జరుగుతుంది. చాలామందిలో పూర్తిగా చూపు కోల్పోవడమన్నది జరగదు. కొందరిలో ఈ 'డ్రై' మాక్యులార్ డీజనరేషన్ 'వెట్'గా కూడా మారవచ్చు.

వెట్ (ఎగ్జుడేటివ్) మాక్యులార్ డీజనరేషన్

ఇందులో రెటీనా మధ్యనుండే మాక్యులార్ భాగంలో కొత్త రక్తనాళాలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తాయి. దాంతో అక్కడి రక్తనాళాల నుంచి రక్తంతోపాటు కొంత ద్రవమూ స్రవిస్తుంది. ఈ స్రావాలను 'ఎగ్జుడేట్' అంటారు. ఇలా స్రవించిన చిక్కటి ద్రవం... మాక్యులా భాగంలో ఒక ఉండలా గడ్డ కడుతుంది. ఇది సరిగ్గా రెటీనా మధ్యభాగంలో ఉండటంతో... చూపునిచ్చే ప్రక్రియకు అడ్డుగా వస్తుంది. ఇలాంటి వెట్ ఏఎమ్‌డీ కేసులు మొత్తం కేసుల్లో కేవలం 10 శాతం మందిలోనే కనిపిస్తుంటాయి. ఏఎమ్‌డీలలో ఇది కాస్త తీవ్రమైన కండిషన్. ఇది క్రమక్రమంగా కాకుండా... చాలా కేసుల్లో వెంటనే దృష్టిలోపానికి కారణమవుతుంది.

ఏఎమ్‌డీలో మూడు దశలు ఉంటాయి. మొదటి (అర్లీ) దశలో మాక్యులాలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ చూపు కోల్పోవడం ఇంకా జరగదు. మధ్య (ఇంటర్మీడియట్) దశలో చూపు కొద్దిగా మసకబారడం (బ్లర్ కావడం)తో పాటు, కనిపించే దృశ్యం అలలు అలలుగా కనబడవచ్చు. ఇక చివరిదైన లేట్ / అడ్వాన్స్‌డ్ దశలో చూపు పూర్తిగా మసకబారుతుంది. అయితే వెట్ ఏఎమ్‌డీలో సమస్య నేరుగా అడ్వాన్స్‌డ్ దశలోకి వెళ్తుంది.

లక్షణాలు...

మాక్యులా దెబ్బతింటే... మెదడుకు సరైన సమాచారం చేరక... ముందు కనిపిస్తున్న దృశ్యం ఏమిటో గ్రహించడంలో ఇబ్బంది కలుగుతుంది. ఫలితంగా ఏఎమ్‌డీ ఉన్నవారిలో ఈ కింది లక్షణాలు కనిపిస్తాయి. • వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు దృశ్యం స్పష్టంగా చూడలేకపోవడం. • చూపు మసకబారడం (బ్లర్‌డ్ విజన్) • రంగుల్ని స్పష్టంగా గ్రహించలేకపోవడం. • నేరుగా గీసినట్టుండే సరళరేఖలు... ఒంపు తిరిగినట్లుగా, అలాగే అలలు అలలుగా ఒంగినట్లుగా కనిపించడం. • చూసే దృశ్యం మధ్యన ఏదో నల్లటి అడ్డంకి (బ్లాక్ స్పాట్/డార్క్ స్పాట్) ఉన్నట్టు కనిపించడం... ఈ చివరి రెండు లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం తప్పనిసరి.

నివారణ... పొగతాగే అలవాటును పూర్తిగా మానేయడం; అన్ని పోషకాలు అందేలా మంచి ఆహారాన్ని తీసుకోవడం; బరువు పెరగకుండా నియంత్రించుకోవడం; ఎల్లప్పుడూ దేహానికి తగినంత వ్యాయామం అందించడం; అల్ట్రా వయొలెట్ కిరణాలనుంచి రక్షించుకోవడం కోసం ప్రొటెక్టివ్ గ్లాసెస్ / బ్రిమ్‌డ్ క్యాప్ ధరించడం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్స్‌ను అదుపులో ఉంచుకోవడం.

మేనేజ్‌మెంట్ / చికిత్స...

చికిత్సతో ఏఎమ్‌డీని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాకపోయినప్పటికీ... చూపు మరింతగా కోల్పోకుండా నివారించవచ్చు. కొన్నిసార్లు చికిత్స తర్వాత కూడా లక్షణాలు మళ్లీ మళ్లీ కనిపించే అవకాశాలూ లేకపోలేదు. పోషకాహారాలు ఇవ్వడం, కొన్ని మందుల ద్వారానూ అలాగే ఫొటో డైనమిక్ థెరపీ, లేజర్ థెరపీ అనే ప్రక్రియతో చికిత్స అందించవచ్చు.

పోషకాలతో: దేహంలో కొన్ని రకాల పోషకాల లోపాలు ఉన్నప్పుడు ఏఎమ్‌డీ వచ్చే అవకాశాలు ఎక్కువ. అప్పుడు విటమిన్-సి, విటమిన్-ఈ, ల్యూటిన్, జింక్, కాపర్, జీయాగ్జాంథిన్ వంటి పోషకాలు, బీటా-కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే పదార్థాలతో చికిత్స అందిస్తారు.

మందులతో: అఫ్లిబెర్సెప్ట్, రానిబిజుమాబ్, బెవాసిజుమాబ్, ఫ్యారిసిమాబ్, బ్రోల్యుసిజుమాబ్ వంటి కంటిలోకి ఇచ్చే ఇంజెక్షన్స్‌తో చికిత్స అందిస్తారు.

లేజర్ ఫొటో కోయాగ్యులేషన్ థెరపీ: దీన్ని వెట్ ఏఎమ్‌డీ రకం చికిత్సలో ఉపయోగిస్తారు. ఈ సమస్య చికిత్స కోసం మరిన్ని అధునాతన ప్రక్రియలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. వాటిలో కొన్ని... ఫొటో రిసెప్టార్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, జీన్ థెరపీ (జన్యుపరమైన సమస్యలను చక్కదిద్దడానికి), అలాగే సమస్య తీవ్రత వల్ల చూపు బాగా దెబ్బతిన్నవారికి చిప్స్‌లాంటి విజువల్ ఇంప్లాంట్స్‌ను రెటీనాలో అమర్చి చికిత్స చేసే అవకాశాలు సమీప భవిష్యత్తులో చాలా త్వరగానే అందుబాటులోకి రానున్నాయి.

నిర్ధారణ పరీక్షలు...

ఏఎమ్‌డీలో తొలిదశల్లో లక్షణాలు కనిపించడం చాలా అరుదు. కాబట్టి వీలైనంతవరకు ఒక వయసు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికోసారైనా కంటి పరీక్షలు, ముఖ్యంగా రెటీనాకు సంబంధించినవి చేయించుకుంటూ ఉంటే చూపు కోల్పోయే పరిస్థితి ఉండదు. నిర్ధారణ పరీక్షల్లో... 1) నిటారుగా ఉండే రేఖల గ్రిడ్‌ను చూపించడం ద్వారా నిర్వహించే ఏమ్‌స్లెర్ గ్రిడ్ టెస్ట్; 2) కంట్లో మందు వేసి కంటిపాప విశాలంగా అయ్యాక చేసే పరీక్ష (డయలేటెడ్ ఐ ఎగ్జామినేషన్); 3) పసుపు రంగు డై ఇంజెక్షన్ తర్వాత ఫ్లోరెసీన్ యాంజియోగ్రఫీ; 4) కంటి వెనకభాగంలోని రెటీనాను చూపే 'ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ' (ఓసీటీ) అనే ఇమేజింగ్ పరీక్ష; 5) లేజర్ లైట్ రిఫ్లెక్షన్‌తోనూ అలాగే ఓసీటీ స్కానింగ్‌తో నిర్వహించే 'ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ యాంజియోగ్రఫీ (ఓసీటీఏ-ఆక్టా) అనే పరీక్షలతో ఏఎమ్‌డీని నిర్ధారణ చేస్తారు. 6) ఇండోసయనిన్ గ్రీన్ అనే పరీక్షను అవసరమైతే చేస్తారు.



డాక్టర్ కె. రవి కుమార్ రెడ్డి,
సీనియర్ కంటి వైద్య నిపుణులు

మెడి టిప్
పిల్లల్లో యూరినరీ ఇన్ఫెక్షన్ల నివారణ కోసం...



పిల్లలో... అందునా మూడేళ్లలోపు పిల్లల్లో ఇవి చాలా సాధారణంగా కనిపిస్తుంటాయి. మగ పిల్లలతో పోలిస్తే అమ్మాయిల్లో ఎక్కువ. వీటిని యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లనీ, సంక్షిప్తంగా యూటీఐ అని చెబుతుంటారు. వీటి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలివి... • పిల్లలు తగినంతగా నీళ్లు తాగేలా జాగ్రత్త తీసుకోవాలి. • వదులుగా ఉండే దుస్తులు వేయాలి. • పిల్లల విసర్జక అవయవాలను వీలైనంత పరిశుభ్రంగా ఉంచాలి. ఇన్ఫెక్షన్స్ వస్తున్న సమయాల్లో మూత్రవిసర్జన తర్వాత ఆ ప్రాంతాన్ని గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేయాలి. (ఇందుకోసం సబ్బు నీళ్లు వాడకూడదు). • పిల్లలకు మంచి టాయిలెట్ అలవాట్లు నేర్పాలి. అంటే సరిగా మూత్రవిసర్జన చేయడం, (మొత్తం మూత్రం బయటకు వచ్చేవరకు మూత్రవిసర్జన చేయడం వంటివి, మూత్రవిసర్జన తర్వాత ప్రైవేట్ పార్ట్స్ కడుక్కోవడం వంటివి). • నీళ్ల తొట్టిలోని నీళ్లకు సబ్బు కలిపి నురగవచ్చేలా చేసి, తొట్టిలోనే స్నానం చేయించడం (బబుల్ బాత్) వల్ల యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ రావచ్చు. అందుకే తరచూ యూటీఐ వస్తున్న పిల్లలకు బబుల్‌బాత్ చేయించకూడదు. ఈ జాగ్రత్తల తర్వాత కూడా తగ్గకపోతే డాక్టర్‌ను కలవాలి. వారు తగిన యాంటీబయాటిక్ మందులతో త్వరగా తగ్గేలా చూస్తారు.

ఆరు నెలల లోపు చిన్నపిల్లలు కొందరిలో... వాళ్లు బాగా నవ్వుతున్నా, వేగంగా కాళ్లూచేతులు కదిలిస్తున్నా వెంటనే వాంతులు అవుతుంటాయి. అప్పటివరకూ వాళ్లు చురుగ్గా ఆడుతుండటం చూసిన తల్లిదండ్రులకు... అంతలోనే ఎదురైన ఆ సంఘటన ఎంతగానో ఆందోళన కలిగిస్తుంది. నిజానికి అది ఏమాత్రం అపాయకరం కాని ఒక కండిషన్. దాన్ని 'గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్' అంటారు. ఈ కండిషన్ కారణంగానే ఈ నెలల పిల్లలకు ఈ తరహాలో వాంతులవుతుంటాయి.

కొందరు నెలల పిల్లలు నవ్వితే వాంతులెందుకు?




చిన్నారుల పొట్ట కింది భాగంలో లోయర్ ఈసోఫేగస్ స్ఫింక్టర్ అనే కండరాలు పొట్ట లోపలికి వెళ్లిన ఆహారాన్ని మళ్లీ పైకి రాకుండా నొక్కిపెడతాయి. కొందరిలో ఈ స్ఫింక్టర్ కండరాలు ఉండవలసిన దాని కంటే వదులుగా (రిలాక్స్‌డ్‌గా) ఉండే అవకాశం ఉంది. అప్పుడు పాలు, ద్రవాలు (యాసిడ్ కంటెంట్స్) కడుపు లోంచి ఈసోఫేగస్ వైపునకు నెట్టినట్లుగా బయటకు వస్తాయి. అలా వెనక్కు రావడాన్ని 'రిఫ్లక్స్' అంటారు. చిన్నతనంలో చాలా మంది పిల్లల్లో సాధారణంగా కనిపించే ఈ సమస్య... వారికి మూడు నుంచి తొమ్మిది నెలలు వచ్చే నాటికి స్ఫింక్టర్ కండరం బలపడటంతో దానంతట అదే తగ్గిపోతుంది.

వాంతులు అనే లక్షణం అనేక ఇతర ఆరోగ్య సమస్యల్లోనూ కనిపిస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో కొద్దిమంది పిల్లల్లో వాంతులతో పాటు ఒకవేళ పసరుతో కూడుకున్న వాంతులు (బిలియస్ వామిటింగ్), వాంతుల్లో రక్తపు చారిక కనిపించడం, వాంతులతో పాటు విరేచనాలు కనిపిస్తుంటే మాత్రం మరికొన్ని ఇతర కారణాల గురించి ఆలోచించాల్సి ఉంటుంది. అలాగే కొన్ని సందర్భాల్లో వాంతులు అదేపనిగా అవుతున్నప్పుడు యాంట్రల్ వెబ్, ఇంటస్టినల్ మొబిలిటీ డిజార్డర్స్ (పేగు కదలికల్లో సమస్యలు), హెచ్. పైలోరీ ఇన్ఫెక్షన్, పెప్టిక్ అల్సర్, ఆహారం సరిపడకపోవడం (ఫుడ్ అలర్జీస్), హయటస్ హెర్నియా వంటి ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయేమోనని తప్పక అన్వేషించాలి. ఆర్నెల్లు దాటిన వారు మొదలుకొని, రెండేళ్ల వరకు పిల్లల్లో వాంతులవుతూ, పై లక్షణాలు కనిపిస్తుంటే అప్పుడు వారిలో ఇంకేమైనా ఆరోగ్య సమస్యలున్నాయేమోనని అదనపు పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.

నిర్ధారణ పరీక్షలు...


గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ సమస్యను బేరియం ఎక్స్-రే పరీక్ష, మిల్క్ స్కాన్, 24 గంటల పీహెచ్ మానిటరింగ్, ఎండోస్కోపీ వంటి పరీక్షలతో నిర్ధారణ చేస్తారు.

చికిత్స... చాలామంది పిల్లల్లో ఇది దానంతట అదే తగ్గిపోతుంది. ఒకవేళ వాంతులు కావడం మరీ ఎక్కువగా ఉంటే అలాంటి పిల్లలకు ద్రవపదార్థాలు తక్కువగా ఇవ్వడం, ప్రోకైనెటిక్ డ్రగ్స్ (ఉదాహరణకు సిసాప్రైడ్, మెటాక్లోప్రమైడ్ వంటి మందులు), ఎసిడిటీ తగ్గించే మందులు వాడటం చాలావరకు ఉపశమనాన్నిస్తుంది. అలాగే ఈ సమస్య ఉన్న పిల్లలను పాలుపట్టిన వెంటనే పడుకోబెట్టకపోవడం, తల కొద్దిగా ఎత్తున ఉంచి పడుకోబెట్టడం, తిన్న వెంటనే పొట్టపై ఒత్తిడి పెంచే (ఇంట్రా అబ్డామినల్ ప్రెషర్ కలిగించే) యాక్టివిటీస్ వంటి వాటికి దూరంగా ఉంచాలి. ఈ సమస్య ఉన్న పిల్లల్లో వ్యాధి తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే ఫండోప్లికేషన్ అనే ఆపరేషన్ అవసరం పడవచ్చు.



డాక్టర్ రమేశ్ బాబు దాసరి,
సీనియర్ పీడియాట్రీషియన్

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 16 సంచిక: 321
SUNDAY Special ఆదివారం 11-2-2024


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'



ఈపీఎఫ్ వడ్డీ 8.25%
2023–24కు ఈపీఎఫ్ ఖాతాల్లో ఉన్న డిపాజిట్లపై 8.25% వడ్డీ రేటు చెల్లించాలని ఈపీఎఫ్‌వో నిర్ణయించింది. ఈపీఎఫ్ చందాదార్లకు 2020–21 తర్వాత ఇదే అత్యధిక వడ్డీ రేటు కావడం గమనార్హం.
– వివరాలు 6లో



కోహ్లి ఆడటం లేదు!
ఇంగ్లండ్‌తో జరిగే 3 టెస్టుల కోసం భారత జట్టును సెలక్షన్ కమిటీ ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్‌పై వేటు పడగా.. విరాట్ కోహ్లి క్రికెటేతర కారణాలతో తొలిసారి పూర్తిగా ఒక టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు.
– వివరాలు 12లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



తరాల నిరీక్షణకు తెర
ఆర్టికల్ 370 రద్దు, మహిళా రిజర్వేషన్ తదితర కీలకాంశాలపై నిరీక్షణకు 17వ లోక్‌సభ తెర దించిందని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



ఎన్నికలకు ముందే సీఏఏ
పౌరసత్వ(సవరణ) చట్టాన్ని లోక్‌సభ ఎన్నికలకు ముందే అమల్లోకి తెస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.
వివరాలు 6లో ▸



త్వరలో పంజాబ్ ఎంపీ అభ్యర్థులు
పంజాబ్‌లో ఆప్ తరఫున బరిలో నిలిచే ఎంపీ అభ్యర్థుల పేర్లను 15 రోజుల్లో ప్రకటిస్తామని ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్ ప్రకటించారు.
వివరాలు 6లో ▸



పాక్‌లో సంకీర్ణం!
పాక్‌లో నవాజ్ షరీఫ్, బిలావల్ భుట్టోకు చెందిన పీఎంఎల్(ఎన్), పీపీపీ పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాయి.
వివరాలు 6లో ▸

'నారాయణ'లో వడ్డీ దుకాణం!
- టీడీపీ ఎన్నికల ఫండ్ కోసం నగదు వసూళ్లు
- రూ.5 వడ్డీకి ప్రకాశం, నెల్లూరు జిల్లాల వారితో వ్యాపారం
- నారాయణ కాలేజీల్లో కౌంటర్లు.. 4 రోజుల్లోనే రూ.650 కోట్లు వసూలు
- రహస్య ప్రాంతంలోకి నగదు.. అక్కడి నుంచి జిల్లాలకు..

3లో

తెల్లవారుజామున లారీ విధ్వంసం
- మరో లారీతో పాటు ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన వైనం
- ఏడుగురు దుర్మరణం.. 25 మందికి తీవ్ర గాయాలు
- నెల్లూరు జిల్లా కావలిలోని జాతీయ రహదారిపై ఘటన

– వివరాలు 5లో

మట్టిలో మాణిక్యాలకు మెరుగు



గ్రామీణ క్రీడాకారులను గుర్తించడంలో సర్కారు నూతన ఒరవడి
రాష్ట్రంలో 'ఆడుదాం ఆంధ్రా'తో వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

దేశంలోనే తొలిసారిగా విస్తృతంగా పోటీల నిర్వహణ
కనీవినీ ఎరుగని రీతిలో 1.23 కోట్ల మందికి భాగస్వామ్యం
37.35 లక్షల మంది క్రీడాకారులు.. 2.93 లక్షల మ్యాచ్‌లు
గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ముగిసిన పోటీలు
ప్రస్తుతం విశాఖ వేదికగా రాష్ట్ర స్థాయిలో తుది దశ పోటీలు
క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖోలో పోటీలు
26 జిల్లాల నుంచి 2,964 మంది పురుషులు, మహిళలు
12వ తేదీ నాటికి బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఫైనల్స్ పూర్తి
13న క్రికెట్ ఫైనల్స్.. సీఎం చేతుల మీదుగా బహుమతుల ప్రదానం
క్రీడా రంగానికి సరికొత్త జవసత్వాలంటూ క్రీడాకారుల ప్రశంసలు

2లో



ఆరంభం అదిరింది
రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం.. ఆడుదాం ఆంధ్రా ద్వారా ముందుకు రావడం అభినందనీయం. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని మెరుగు పరిచే ప్రయత్నానికి ఇది శ్రీకారం. ఈ అద్భుత ప్రయత్నం కొనసాగాలి. ఇన్నాళ్లూ మంచి టెన్నిస్ కోర్టులు, కోచ్‌లు లేరు. కానీ, ఇప్పుడు అన్నీ మెరుగవుతున్నాయి.
– అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని

సై అంటే సై
టీడీపీ, జనసేన నేతల మధ్య పొత్తు కుంపట్లు

నియోజకవర్గాల్లో గొడవలకు దిగుతున్న ఇరు వర్గాలు
- తెనాలిలో ఆలపాటి రాజా, నాదెండ్ల మనోహర్ మధ్య వార్
- రాజమండ్రిలో గోరంట్ల వర్సెస్ కందుల దుర్గేష్..
- ఇలా అనేకచోట్ల రెండు పార్టీల నేతల మధ్య కుదరని సయోధ్య
- బాబు, పవన్ వరుస చర్చలు జరుపుతున్నా కింది స్థాయిలో కలవని కేడర్
- ప్రశ్నార్థకంగా ఉమ్మడి మేనిఫెస్టో, ఉమ్మడి సభలు

3లో



జనసేనలో పొత్తు చిచ్చు
పార్టీలో రోజురోజుకు పెరుగుతున్న అసంతృప్తి.. అధినేత పవన్ తీరుపైనా శ్రేణుల్లో అసహనం
పొత్తులో జనసేన వాటా సీట్లను ఇంకా తేల్చకపోవడంపై ఆగ్రహం
మూడో వంతు సీట్లయినా కేటాయించకపోతే ఎలా అంటూ ప్రశ్న

3లో



'పునరుత్పాదక విద్యుత్'.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్



- ఆర్‌పీవోలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాన్ని రాష్ట్రం అధిగమించింది
- 9,008 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఏపీలో ఉత్పత్తవుతోంది
- పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల్లోనూ దేశంలో అగ్రగామిగా రాష్ట్రం
- దేశంలో ఉన్న 61లో ఆంధ్రప్రదేశ్‌లోనే 23 ప్రాజెక్టులు
- నెడ్‌క్యాప్ వైస్ చైర్మన్, ఎండీ రమణారెడ్డి వెల్లడి

14లో

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు చరిత్రాత్మకం



- ఇప్పటికే ఆరున్నర లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి.. రోజుకు లక్ష రిజిస్ట్రేషన్లు
- ఈ స్థాయిలో రిజిస్ట్రేషన్లు గతంలో ఎప్పుడూ జరగలేదు.. గ్రామ స్థాయికీ రిజిస్ట్రేషన్ల వ్యవస్థ
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ రామకృష్ణ

2లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మలి వయసులో నడి'పింఛెన్'

నా పేరు కుపిలి సూర్యారావు. మాది ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు. నాకు 74 సంవత్సరాలు. వ్యవసాయ కూలి పనులు చేసే నేను ఇప్పుడు ఏ పనులకూ వెళ్లలేకపోతున్నా. నా పిల్లల పెళ్లిళ్లు చేశాక ఎవరి దోవన వారు వెళ్లిపోయారు. మిగిలింది నేను, నా భార్య. ఇద్దరమూ ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నాం. నేను వైకల్యంతో కదల్లేని స్థితిలో ఉన్నా. ఈ తరుణంలో జగన్ ప్రభుత్వం రావడం మా అదృష్టమని చెప్పాలి. ప్రభుత్వం రావడంతోనే అమలు చేసిన నవరత్నాలు మాకు ఎంతో ఆసరా అయ్యాయి. నేను, నా భార్య ప్రభుత్వం అందించే పథకాలతోనే బతుకుతున్నాం. నాకు డీఎంహెచ్‌ఓ పింఛన్ నెలకు రూ.5 వేలు వస్తోంది. నా భార్యకు వృద్ధాప్య పింఛను రూ.3 వేలు, అభయహస్తం పింఛను రూ.500



కలిపి మొత్తం ప్రతి నెలా రూ.8500 వస్తున్నాయి. వలంటీరు ఇంటికి తీసుకువచ్చి ఆ డబ్బు ఇస్తున్నారు. ఈ డబ్బుతోనే మేము జీవిస్తున్నాం. సీఎం జగన్‌కు ధన్యవాదాలు. మళ్లీ ఆయనే సీఎంగా రావాలి.

– కుపిలి సూర్యారావు, యర్రమిల్లిపాడు
(పాండ్రాకుల వెంకట పెద్దిరాజు, విలేకరి, ఉంగుటూరు)

ఆరోగ్యశ్రీ బతికించింది

ఒకరోజు ఒంట్లో బాగో లేదని ఆసుపత్రుల చుట్టూ తిరిగా. వైద్యులు క్యాన్సర్ అని చెప్పారు. నేను చదువుకోలేదు. వయస్సు మీదపడటం, నిరక్షరాస్యతతో ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. నా కుమారుడు ఏసుబాబు కూడా చదువుకోలేదు. స్థానిక ఏఎన్ఎం కౌసల్య ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందవచ్చని చెప్పారు. నా పేరు వాసిరెడ్డి సుబ్బాయమ్మ. మా ఊరు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలోని చినకాపవరం. నేను, నా కొడుకు విజయవాడలోని క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లాం. ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా వైద్యం చేస్తామని చెప్పారు. వైద్యం ప్రారంభించి ఇప్పటికి ఆరుసార్లు కీమో థెరపీ



చేశారు. ఏడోసారి ఫిబ్రవరి 15న రమ్మన్నారు. నేను పౌష్టికాహారం తినేందుకు రోజుకు రూ.250 చొప్పున నా బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం రూ.5 వేలు జమ చేసింది. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. నా భర్త చనిపోయాడు. కొడుకు కూలి పనికి వెళ్లి నన్ను పోషిస్తున్నాడు. మన వరాలికి అమ్మఒడి వస్తోంది. కోడలికి ఆసరా ద్వారా లబ్ధి కలిగింది. నాకు వితంతు పింఛన్ నెలకు రూ.3 వేలు వస్తోంది. ప్రస్తుతం ఆరోగ్యం కుదుట పడుతోంది. ఆరోగ్యశ్రీ నన్ను బతికించింది. పెద్ద కొడుకులా ఆదుకున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాను.

– వాసిరెడ్డి సుబ్బాయమ్మ, చినకాపవరం
(బీఆర్ కోటేశ్వరరావు, విలేకరి, ఆకివీడు)

మా ఆనందం చెప్పలేనిది

మేము కృష్ణా జిల్లా పెడన పట్టణంలోని ఏడో వార్డు వీరభద్రపురంలో ఉంటున్నాం. నా పేరు వాసా నాగలక్ష్మి. నేత కార్మికురాలిని. నా భర్త పేరు శ్రీనివాసరావు. 30 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే జీవిస్తున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చాక నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేల చొప్పున ఐదేళ్ల రూ.1.20 లక్షలు నేరుగా నా బ్యాంకు ఖాతాలో జమ య్యాయి. మా అమ్మాయి పావన సాయి నాగ మల్లేశ్వరికి ఇంటర్మీడియట్‌లో అమ్మఒడి ద్వారా రూ.15 వేలు చొప్పున, డిగ్రీలో విద్యాదీవెన కింద రూ.35 వేల వరకు వచ్చాయి. నాకు ఆసరా కింద ఏటా రూ.16,300 చొప్పున వచ్చింది. పట్టణంలోని పల్లోటి లే అవుట్–1లో ఇంటి పట్టా ఇచ్చారు. రూ.1.80 లక్షలతో ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేసుకున్నాం. త్వరలో గృహ ప్రవేశం చేసి ఆ ఇంట్లోకి వెళ్లడానికి ముహూర్తం చూస్తున్నాం. నాకు ప్రమాదం జరిగి చేయి విరిగితే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స



చేయించుకున్నా. ఆ సమయంలో రూ.35 వేలు ఖర్చయింది. దానిని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఆస్పత్రికి చెల్లించింది. విశ్రాంతి సమయంలో కూడా ఆరోగ్య ఆసరా కింద రెండు నెలలకు రూ.10 వేలు ఇచ్చారు. మా ఆర్థిక పరిస్థితులు చాలా మెరుగుపడ్డాయి. చాలా సంతోషంగా ఉన్నాం. జగనన్నకు కృతజ్ఞతలు. మళ్లీ ఆయనే రావాలి.

– వాసా నాగలక్ష్మి, పెడన
(ఎస్.గంగాధరరావు, విలేకరి, పెడన)

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు చరిత్రాత్మకం

ఇప్పటికి ఆరున్నర లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి

- ఈ స్థాయిలో రిజిస్ట్రేషన్లు గతంలో ఎప్పుడూ జరగలేదు
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ



సాక్షి, అమరావతి: పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని, ఇది చరిత్రాత్మకమని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వి.రామకృష్ణ చెప్పారు. ఒకేసారి లక్షల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేయడం ఏ రాష్ట్రంలోనూ జరగలేదని, ఏపీలోనే తొలిసారి జరుగుతోందని తెలిపారు. ఆయన శనివారం 'సాక్షి'తో మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ఇళ్లపై వారికి పూర్తి హక్కు కల్పిస్తూ, వారికి ఒక ఆస్తిగా దాన్ని సమకూర్చి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని, అందులో భాగంగానే రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. ఇంత పెద్దఎత్తున రిజిస్ట్రేషన్లు చేయడం తమ శాఖకు చాలెంజింగ్ వంటిదని, అత్యంత క్లిష్టమైన ఈ పనిని అందరి సహకారంతో సజావుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేయడానికి లక్షలాది మంది లబ్ధిదారుల ఆధార్ కార్డులు, వారి ఆస్తి వివరాలు, సర్వే నంబర్లు, హద్దులు, రెవెన్యూ గ్రామాల సమాచారాన్ని అప్‌లోడ్ చేశామని చెప్పారు. ఆ తర్వాత 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తించడంతో వారికి లాగిన్లు ఇవ్వడం, ప్రభుత్వం తరఫున రిజిస్ట్రేషన్లు చేసే 15 వేల మంది వీఆర్‌వోలకు లాగిన్లు ఇవ్వడం పూర్తి చేసినట్టు చెప్పారు. వివిధ శాఖల నుంచి వచ్చిన ఈ డేటా మొత్తాన్ని మ్యాపింగ్ చేశామన్నారు. ఈ పని చేయడమే అత్యంత క్లిష్టమని, దాన్ని పూర్తి చేయడంతో రిజిస్ట్రేషన్లు ఇబ్బంది లేకుండా జరుగుతున్నట్లు వెల్లడించారు. వీరందరి ఆధార్ ఈ–సిగ్నేచర్లతో రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల నకిలీ రిజిస్ట్రేషన్‌లకు అవకాశం లేదని చెప్పారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

ఇప్పటివరకు 6.5 లక్షల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశామని తెలిపారు. సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అనుమతిచ్చిందని రామకృష్ణ తెలిపారు. సాధారణంగా సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.5 వేల ఫీజు కట్టాల్సి ఉంటుందని, దానికి ప్రభుత్వం మినహాయింపునిచ్చినట్టు తెలిపారు. రోజుకు లక్షకుపైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, త్వరలో ప్రభుత్వం లక్ష్యానికనుగుణంగా అన్ని రిజిస్ట్రేషన్లను పూర్తి చేస్తామని వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ కార్యక్రమంతో సాకారమైందని తెలిపారు. మొన్నటివరకు భూముల రీ సర్వే పూర్తయిన 4 వేల గ్రామాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్లు చేసేవారని, ఇప్పుడు 15 వేల గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి పూర్తి అవగాహన వచ్చిందని తెలిపారు. పేదల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్ల వ్యవస్థ గ్రామ స్థాయికి పూర్తిస్థాయిలో చేరిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అత్యధికంగా ఈ–సిగ్నేచర్ యూజర్లు ఉన్న రాష్ట్రంగా ఏపీ నిలిచిందని తెలిపారు. 6.5 లక్షల రిజిస్ట్రేషన్ల కోసం 20 లక్షల ఈ–సిగ్నేచర్‌లు తీసుకున్నట్టు తెలిపారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల వల్ల వారు పొందిన స్థలాలపై పేదలకు హక్కులు ఏర్పడతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ తర్వాత ఇచ్చే కన్వేయన్స్ డీడ్లు పదేళ్ల తర్వాత సేల్ డీడ్‌లుగా మారడం వల్ల వారికి ఇబ్బందులుండవన్నారు. రెవెన్యూ ఎన్‌వోసీ లేకుండానే పదేళ్ల గడువు ముగిశాక ఆ స్థలాలపై పేదలకు సర్వ హక్కులు లభిస్తాయని, ఇది వారికి ఎంతో ఉపయోగకరమని రామకృష్ణ వివరించారు.

మట్టిలో మాణిక్యాలకు మెరుగు

గ్రామీణ క్రీడాకారులను గుర్తించడంలో సర్కారు నూతన ఒరవడి

రాష్ట్రంలో 'ఆడుదాం ఆంధ్రా'తో వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి/విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్రంలో గ్రామీణ క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించడానికి ఇదివరకెన్నడూ లేని విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం నూతన ఒరవడికి నాంది పలికింది. 'ఆడుదాం ఆంధ్రా'తో వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి, మెరుగు పెడుతోంది. చరిత్రలో తొలిసారిగా అట్టడుగు స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికితీసే మహాయజ్ఞానికి నాంది పలికింది. యువత ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకునేందుకు, క్రీడల ప్రాముఖ్యతను తెలుసుకునే ఉద్దేశంతో గ్రామ స్థాయి నుంచే పోటీతత్వాన్ని పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా 'ఆడుదాం ఆంధ్రా' అంటూ పిలుపునిచ్చింది. దానికి తగ్గట్టు పకడ్బందీగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రణాళికా బద్ధంగా పోటీల నిర్వహణకు దాదాపు 14 శాఖల సిబ్బంది సహకారంతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గత డిసెంబర్ 26వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలు ఈనెల 13వ తేదీతో ముగియనున్నాయి. క్రీడా మాణిక్యాలను ఒడిసిపట్టి, ప్రపంచ వేదికలపై నిలబెట్టేలా తలపెట్టిన ఈ క్రీడా సంబరంలో యావత్తు యువత ఉత్సాహంతో ఉరకలేస్తోంది. కనీవినీ ఎరుగని రీతిలో క్రీడాకారులతో పాటు ప్రేక్షకులుగా వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు 1.23 కోట్ల రిజిస్ట్రేషన్లతో అతిపెద్ద క్రీడా మహోత్సవంలో భాగస్వాములవ్వడం ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగం సామర్థ్యానికి అద్దం పడుతోంది.



ఏయూ జిమ్నాజియం మైదానంలో కబడ్డీ పోటీలు

క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో మెన్, వుమెన్ విభాగాల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా దాటి.. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నాలుగో దశ పోటీలు విశాఖ వేదికగా ఆనందోత్సాహాల మధ్య సాగుతున్నాయి. ముగింపు రోజున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విజేతగా నిలిచిన జట్లు ట్రోఫీతో పాటు భారీ నగదు ప్రోత్సాహకాల్ని అందుకోనున్నాయి.

ఇదో భారీ టాలెంట్ హంట్..

15004 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో గతేడాది డిసెంబర్ 26న అట్టహాసంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్ర' సువిశాల విశాఖ సాగర తీరంలో తుది పోరుకు (ఫైనల్స్‌కు) ఎగిసిపడుతోంది. దాదాపు నెలన్నర కాలంలో 4.60 లక్షల జట్లను పోటీలకు ఎంపిక చేయగా.. 2.93 లక్షల మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన అట్టహాసంగా ప్రారంభమైన ఫైనల్స్ పోటీలు.. 13వ తేదీతో ముగియనున్నాయి. 26 జిల్లాలకు చెందిన పల్లెల్లో నుంచి వచ్చిన యువ క్రీడా కెరటాలు అంతర్జాతీయ మైదానాల్లో హోరాహోరీగా తలపడుతున్నారు. 12వ తేదీ నాటికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ (డబుల్స్) ఫైనల్స్ పూర్తి చేసి, 13వ తేదీన క్రికెట్ ఫైనల్స్ నిర్వహించి క్రీడా పోటీలను ఘనంగా ముగించేందుకు శాప్ కసరత్తు చేస్తోంది. దేశ చరిత్రలో ఒక రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా అతిపెద్ద భారీ టాలెంట్ హంట్ చేపట్టడం ఇదే ప్రథమం. దీనికి తోడు గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి సమర్థవంతంగా పోటీలను ముందుకు తీసుకెళ్లడంపై క్రీడావర్గాలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో పేరుకు మాత్రమే క్రీడాపోటీలు ఉండేవని.. ప్రతిభగల క్రీడాకారులను గుర్తించే లక్ష్యం కనుమరుగవుతున్న తరుణంలో 'ఆడుదాం ఆంధ్రా' తిరిగి క్రీడా రంగానికి జవసత్వాలు తీసుకొచ్చిందని సీనియర్ క్రీడాకారులు ప్రశంసిస్తున్నారు. క్రికెట్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే), ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, బ్యాడ్మింటన్‌లో సింధు, శ్రీకాంత్ బృందాలు, వాలీబాల్‌లో ప్రైమ్ వాలీబాల్, కబడ్డీలో ప్రోకబడ్డీ ఆర్గనైజర్లు, ఖోఖోలో రాష్ట్ర క్రీడా సంఘ ప్రతినిధులు టాలెంట్ హంట్ చేస్తున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ ప్రతిభగల క్రీడాకారులను గుర్తిస్తున్నాయి. పోటీలు ముగిసిన అనంతరం వారికి వివిధ స్థాయిల్లో అంతర్జాతీయ శిక్షణ అందించడం, ఐపీఎల్ వంటి ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో అవకాశం కల్పించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

37.35 లక్షల మంది క్రీడాకారుల సత్తా

'ఆడుదాం ఆంధ్ర' తొలి ఏడాది ఐదు దశల్లో ప్రతిభగల క్రీడాకారులకు అవకాశం కల్పించింది. 15 ఏళ్లకు పైబడిన పురుషులు, మహిళలను భాగస్వాములను చేసి క్రీడల్లో వయసు అంతరాలను తొలగించింది. దాదాపు 37.35 లక్షల మంది వివిధ క్రీడాంశాల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 23.58 లక్షల మంది పురుషులు కాగా, 13.77 లక్షల మంది మహిళలున్నారు. వీరు సంప్రదాయ క్రీడా పోటీల్లో (నాన్ కాంపిటీటివ్ విభాగంలో యోగ, మారథాన్, టెన్నికాయిట్)తో పాటు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో సత్తాచాటారు. 1.49 లక్షల మంది గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పాఠశాల విద్యాశాఖ పీఈటీలు, పీడీలతో పాటు శాప్ కోచ్‌లు, క్రీడా సంఘాల పోటీలను తొలి నాలుగు దశల్లో సమర్థవంతంగా నిర్వహించారు. పోటీల సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్రీడాకారుల మొబైల్ ఫోన్లకు సమాచారం ఇస్తూ టెక్నాలజీని సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో విజేతలకు అత్యంత పారదర్శకంగా వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు బహుమతులను జమ చేసింది. ఇప్పటికే 95 శాతం పంపిణీ పూర్తి చేసింది. రూ.119.19 కోట్ల బడ్జెట్‌లో ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తోంది. సుమారు రూ.12.21 కోట్ల నగదు బహుమతులు ప్రదానం చేస్తోంది. క్రీడాకారులకు రూ.42 కోట్లతో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడాకారులకు అవసరమైన 5.09 లక్షల స్పోర్ట్స్ కిట్లను ప్రతి సచివాలయానికి సరఫరా చేసింది. ప్రొఫెషనల్ టోర్నీ తరహాలో మండల స్థాయిలో 17.10 లక్షల టీషర్టులు, టోపీలతో కూడిన కిట్లను ఇచ్చింది. క్రీడాకారులకు భోజన, రవాణ, వసతి సౌకర్యాల కోసం ఏకంగా రూ.21 కోట్లకుపైగా ఖర్చు చేసింది.

వివిధ దశల్లో పోటీపడ్డ క్రీడాకారులు

దశ	క్రీడాకారుల సంఖ్య
గ్రామ/వార్డు సచివాలయం	34 లక్షలు
మండల స్థాయి	17 లక్షలు
నియోజకవర్గం	77 వేలు
జిల్లా	19 వేలు
రాష్ట్రం	2,964

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్ల విజేతలకు బహుమతులు (రూపాయల్లో)

స్థానం	నియోజకవర్గం	జిల్లా	రాష్ట్ర
ప్రథమ	35,000	60,000	5,00,000
ద్వితీయ	15,000	30,000	3,00,000
తృతీయ	5000	10,000	2,00,000

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు (రూపాయల్లో)

స్థానం	నియోజకవర్గం	జిల్లా	రాష్ట్ర
పథమ	20,000	35,000	2,00,000
ద్వితీయ	10,000	20,000	1,00,000
తృతీయ	5000	10,000	50,000

ఇదో గొప్ప మైలురాయి..

రాష్ట్ర క్రీడా చరిత్రలో ఆడుదాం ఆంధ్ర గొప్ప మైలురాయి. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. ప్రతిఏటా ఈ మెగా టోర్నీని నిర్వహించి ఎందరో మట్టిలోని మాణిక్యాలను ప్రపంచానికి పరిచయం చేస్తాం. క్రీడలను పట్టించుకోని సమాజంలో ప్రభుత్వమే స్వయంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ భారీ స్థాయిలో పోటీలు నిర్వహించడం గతంలో ఎన్నడూ జరగలేదు. ఈ పోటీల్లో యువత పెద్ద ఎత్తున భాగస్వాములవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో తల్లిదండ్రులతో పాటు విద్యార్థుల్లోనూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే ఆలోచన బలపడుతుంది. అప్పుడు దేశానికి పతకాలను తెచ్చిపెట్టే క్రీడాకారులు మనదగ్గర నుంచే తయారవుతారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్ప బలం ఆంధ్రప్రదేశ్ క్రీడా ముఖ చిత్రాన్నే మార్చేసింది.

– ధ్యాన్‌చంద్ర, ఎండీ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ

శిక్షణ ఇస్తే జాతీయ స్థాయికి..



సచివాలయ సిబ్బంది మా దగ్గరికి వచ్చి ఎంట్రీ గురించి అడిగారు. వివరాలు చెప్పారు. తొలి రెండు స్థాయిల్లో చాలా మందికి ఆట గురించి పెద్దగా అవగాహన లేదు. అయితే చాలా ఇంట్రస్ట్ ఉంది. మాకు ఆడిన అనుభవం ఉండటంతో వారికి మా నాలెడ్జ్‌ను షేర్ చేశాం. చాలా సంతోషపడ్డారు. ఆట పట్ల వారికి అభిమానం పెరిగింది. ఓపెన్ మీట్స్ ఆడేటప్పుడు సమాచారం ఉంటేనే తెలిసేది. అక్కడ ఎంట్రీ ఫీజుతో ఆడేవాళ్లం. ఇక్కడ ఎంట్రీ ఫీజు లేదు. పైగా లోయర్ స్థాయిలో, ఇప్పుడు ప్రొఫెషనల్ స్థాయిలో కిట్లను అందించారు. రాకెట్స్, షూస్, షటిల్ బారెల్ కొనాలంటే చాలా డబ్బు వెచ్చించాలి. అలాంటివి మాకు ఉచితంగా ఇచ్చారు. ఇదే స్పిరిట్ కొనసాగితే జాతీయ స్థాయికి ఎదుగుతాం. ఇప్పుడు మా అన్నమయ్య జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడుతున్నాం.

– సింధూర, గ్రీష్మ (మదనపల్లి, అన్నమయ్య జిల్లా)–బ్యాడ్మింటన్ జోడి

ఈ గుర్తింపు పట్ల ఆనందంగా ఉంది



గ్రామంలో చదువుకుని ఖాళీగా ఉన్నాం. తీరిక దొరికినప్పుడు గ్రామంలో మేమంతా కలిసి ఆడుకునేవాళ్లం. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పుణ్యమా అని రాష్ట్ర స్థాయి వరకూ వచ్చాం. ఈ సర్టిఫికెట్‌తో మాకు గుర్తింపు వచ్చింది. ఉద్యోగం సాధించడానికి తోడ్పడుతుంది. ఇలా రాష్ట్ర స్థాయికి క్వాలిఫై కావడం చాలా గర్వంగా ఉంది. జగనన్నకు ధన్యవాదాలు.

– రమేష్, ప్రసన్నకుమార్ (గుమ్మలపాడు, అనకాపల్లి జిల్లా)– కెప్టెన్, వైస్ కెప్టెన్, వాలీబాల్ టీమ్

ఆడుదాం ఆంధ్రా కొనసాగాలి



ఆటల గురించి వలంటీర్లు చెప్పేంత వరకు తెలియదు. కోచ్‌కు చెప్పాం. వారే జట్టుగా పేర్లను నమోదు చేశారు. ఇంటర్ చదువుకుని ఓర్వకల్లు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరిగిన స్టేట్ మీట్‌లో పాల్గొన్నాం. విజయనగరం జిల్లాలో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానానికి చేరుకున్నాం. ఈ సర్టిఫికెట్‌తో మాకు కొంచెం హోప్ వచ్చింది. జిల్లా స్థాయిలో వచ్చిన నగదు ప్రోత్సాహకాన్ని జాగ్రత్తగా పెట్టుకున్నాం. ప్రొఫెషనల్‌గా ఎదగడానికి ఈ టోర్నీ ఉపయోగపడుతుంది. అకాడమి ద్వారా నేర్చుకునే అవకాశం కల్పిస్తే జాతీయ స్థాయి ఆట ఆడగలం. ఆడుదాం ఆంధ్ర టోర్నీ కొనసాగితే చాలా బెనిఫిట్ అవుతుంది. మాకు మంచి పేరు వస్తుంది.

– మాధవి, మైత్రి (అమకతాడు, కర్నూలు జిల్లా) – కెప్టెన్, వైస్ కెప్టెన్, కబడ్డీ జట్టు

కలలో కూడా అనుకోలేదు



ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో కడప జిల్లాపై విజయం సాధించాం. ఈ స్థాయికి ఒక గ్రామ జట్టు నుంచి రావడం చాలా గర్వంగా ఉంది. అండర్–19లో వాకాడ నుంచి నెల్లూరు జట్టుకు ఆడాను. ఈ టోర్నమెంట్ ఒక నేషనల్ మీట్‌లా జరుగుతుంది. ఓపెన్ మీట్‌లో జిల్లాలో ఒక జట్టుపైన, రాష్ట్ర స్థాయిలో ఐదు జట్లపై విజయం సాధించి నేషనల్స్‌కు వస్తాం. కాని ఇక్కడ మేము దాదాపు వంద జట్లపై గెలిచి ప్రస్తుతం ఈ స్థాయికి చేరుకున్నాం. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటాం. మారుమూల ప్రాంతం నుంచి ఇక్కడ ఆడే స్థాయికి వస్తామని కలలో కూడా అనుకోలేదు.

– ప్రవీణ్‌కుమార్, సాయిభరత్ (ఇదుగుర్తి, తిరుపతి జిల్లా)– కెప్టెన్, వైస్ కెప్టెన్, ఖోఖో జట్టు

ఆరంభం అదిరింది

క్రీడల ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం

- 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా విజయవంతంగా తొలి అడుగు
- క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని మెరుగు పరిచే ప్రయత్నానికి ఇది శ్రీకారం
- ఇన్నాళ్లూ ఆంధ్రాలో మంచి టెన్నిస్ కోర్టులు లేవు.. కోచ్‌లు లేరు
- ఇప్పుడు విశాఖపట్నంలో టెన్నిస్ అకాడమీకి స్థలం కేటాయిస్తున్నారు
- ఈ ఊపు చూస్తుంటే భవిష్యత్తులో అన్ని క్రీడలకు సౌకర్యాలు ఖాయమనిపిస్తోంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ టెన్నిస్ ఆటగాడు సాకేత్ మైనేని



సానియా మీర్జాతో సాకేత్ మైనేని

(బోణం గణేష్, సాక్షి ప్రతినిధి–అమరావతి)

పదకొండేళ్ల వయసులో తండ్రిని చూసి రాకెట్ పట్టిన బాలుడు.. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి టెన్నిస్ స్టార్ సానియా మీర్జాతో జత కట్టే స్థాయికి ఎదిగాడు. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడల్లో రాణిస్తూ ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్ విభాగంలో రజత పతకం సాధించాడు.. అతనే అర్జున అవార్డు గ్రహీత, మన ఆంధ్రప్రదేశ్ క్రీడా యువ కెరటం సాకేత్ మైనేని. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలపై ముచ్చటించారు. రాష్ట్ర క్రీడా రంగ అభివృద్ధికి ఇది ఆరంభమని, గ్రామీణ క్రీడాకారులను గుర్తించడానికి ప్రభుత్వం వేసిన ఈ తొలి అడుగు అభినందనీయమని ప్రశంసించారు. ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే..

ఖరీదైన క్రీడ.. అయినా నేను సిద్ధం

టెన్నిస్.. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడే కాదు ఖరీదైన క్రీడల్లో ఒకటి. అలాగే ఒక ప్రొఫెషనల్ ప్లేయర్ తన శిక్షణకు, ప్రపంచ వ్యాప్తంగా టోర్నమెంట్‌లలో పాల్గొనడానికి ఖర్చులకు నిధులు తానే సమకూర్చుకోవాలి. అందుకే పాఠశాల దశ నుంచే ఆటగాళ్లకు నిధులు సమకూరుస్తున్న రాష్ట్రాలు మాత్రమే మనదేశంలో అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లను తయారు చేయడంలో విజయం సాధించాయి. ఆంధ్రాలో ఆటగాళ్లను తయారు చేయడానికి మనకు మంచి టెన్నిస్ కోర్టులు, కోచ్‌లు లేరు. మాకు ప్రతిభగల ఆటగాళ్లను తయారు చేయగల సామర్థ్యం ఉంది. కానీ ఆటగాళ్లు చాలా చిన్న వయస్సులో శిక్షణ కోసం హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, గుజరాత్ వంటి రాష్ట్రాలకు, ఆ తర్వాత విదేశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆంధ్రాలో ఎక్కువ మంది యువత టెన్నిస్‌లో పాల్గొనేలా చేయడానికి, మనకు రాష్ట్రంలోనే మంచి టెన్నిస్ అకాడమీ, కోచ్ ఉండాలి. దీనిపై ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు. కాస్మోపాలిటన్ కల్చర్ ఉన్న విశాఖపట్నంలో టెన్నిస్ అకాడమికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నా వయసు ఇప్పుడు 36 ఏళ్లు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో టోర్నమెంట్లలో పాల్గొన్న అనుభవంతో పాటు, అంతర్జాతీయ కోచ్‌గా కూడా నాకు గుర్తింపు ఉంది. మన రాష్ట్రంలో టెన్నిస్ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు నా నైపుణ్యాన్ని సంతోషంగా అందించడం కోసం నేను సిద్ధంగా ఉన్నా.

కృష్ణమ్మ ఒడి నుంచి క్రీడా రంగంలోకి..

కృష్ణా జిల్లా ఉయ్యూరులో జన్మించినప్పటికీ పెరిగిందంతా విశాఖపట్నంలోనే. చిన్నప్పటి నుంచీ క్రీడలపై ఆసక్తి ఉండేది. ఖోఖో, కర్రా–బిళ్లా, గోలీలు అంటూ ప్రతి ఆటా ఆడేసేవాడిని. మా నాన్న టెన్నిస్ ఆడుతుంటే చూసి నాకూ ఆడాలని పించింది. అలా 11 ఏళ్లకే ఆ గేమ్‌ను సీరియస్‌గా తీసుకున్నా. 12 ఏళ్లకు విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచా. 13 ఏళ్ల వయసులో నాకు టెన్నిస్ శిక్షణ ఇప్పించడం కోసం అమ్మానాన్నలు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. 17 ఏళ్ల వయసులో టెన్నిస్ స్కాలర్‌షిప్‌పై అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ కోసం అమెరికా వెళ్లాను. అక్కడ కోచింగ్ సర్టిఫికేషన్ పొందాను. ఖర్చుల కోసం అక్కడి స్థానిక క్లబ్‌లో శిక్షణ ఇచ్చాను. అకడమిక్స్‌లో కూడా అగ్రస్థానంలో నిలిచాను. అత్యుత్తమ డబుల్స్ ర్యాంకింగ్ 74వ స్థానంలో ఉన్నాను. 2014లో చైనాలో జరిగిన 17వ ఏషియన్ గేమ్స్‌లో సానియాతో జత కట్టి మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకం, సనమ్ సింగ్‌తో జోడికట్టి డబుల్స్‌లో రజత పతకం గెలవడం నిజంగా అద్భుతమైన అనుభూతి. దక్షిణాసియా క్రీడల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో 2016, 2019లో రజత పతకాలు సాధించా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి టెన్నిస్‌లో అంతర్జాతీయ స్థాయిలో నేను, సానియా మీర్జా మాత్రమే పతకాలు సాధించాం. సరదాగా ప్రారంభించిన ఈ క్రీడ చివరికి నా కెరీర్‌గా మారింది. ప్రస్తుతం డేవిస్ కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నా. కేంద్ర ప్రభుత్వం 2017లో అర్జున అవార్డుతో గౌరవిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, స్థలం మంజూరు చేయాలని నిర్ణయించింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలి.. ఇండియాకే ఓ గ్రాండ్‌స్లామ్ టైటిల్ తెచ్చివ్వాలనేది నా లక్ష్యం.

ఈ అద్భుత ప్రయత్నం కొనసాగాలి

ఏదైనా క్రీడలో తమ పిల్లవాడు రాణించేలా చేయాలంటే ఆ కుటుంబానికి చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. ఆర్థికంగానూ సమస్యలు వస్తాయి. అలాగే పిల్లవాడి చదువుపైనా ఆ క్రీడ ప్రభావం చూపుతుంది. సౌకర్యాలు లేకపోవడం ఆటంకంగా మారుతుంది. పాఠశాలకు వెళ్లి వచ్చేసరికే పిల్లాడు అలసిపోతుంటాడు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను టోర్నమెంట్‌లకు తీసుకెళ్లడానికి సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. అయినా అన్నిటిలో గెలుస్తాడని గ్యారెంటీ ఉండదు. ఇలాంటి అనేక ప్రతికూలతలను అధిగమించి నేను ఈ స్థాయికి చేరుకున్నానంటే దానికి నా తల్లిదండ్రులు ప్రసాద్, సరోజ, భార్య శ్రీలక్ష్మి, స్నేహితులతో పాటు ఎంతో మంది అందించిన ప్రోత్సాహం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో చాలా క్రీడల్లో అవకాశాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. వీటితో పాటు క్రీడలు చాలా చిన్న వయస్సు నుంచే సంస్కృతిలో భాగం కావాలి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా గుర్తించింది. ప్రతి గ్రామంలో యువత పోటీపడి క్రీడలను ఆస్వాదించడానికి ప్రోత్సహించేలా 'ఆడుదాం ఆంధ్ర'ను ప్రారంభించింది. ఇందుకు నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఇది ఓ ప్రారంభం.. దీనికి కొనసాగింపుగా శిక్షణా సౌకర్యాలను మెరుగు పరచడం ద్వారా భవిష్యత్తులో మన రాష్ట్రం నుంచి అనేక మంది ఛాంపియన్‌లను తయారు చేయగలుగుతాం.

వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్లకు బాధ్యతలు

జిల్లాలు, పార్లమెంటరీ నియోజకవర్గాలకు నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురు పార్టీ రీజినల్‌ కో ఆర్డినేటర్లకు పార్లమెంటరీ నియోజకవర్గాలు, జిల్లాల బాధ్యతలను అప్పగించారు.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి: ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గంతోపాటు ఉమ్మడి నెల్లూరు జిల్లా

వి.విజయసాయిరెడ్డి: గుంటూరు, నరసరావుపేట, బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గాలు

పి.రామసుబ్బారెడ్డి: కర్నూలు, నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గాలు

కె.సురేష్‌బాబు: కడప, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాలు.

కాగా ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌గా గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. ఈయన సంబంధిత రీజినల్‌ కో ఆర్డినేటర్‌ ఆధ్వర్యంలో పనిచేస్తారు. అలాగే విజయవాడ నగర పార్టీ అధ్యక్షుడిగా మల్లాది విష్ణును నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

విశాఖ-హైదరాబాద్‌కు ఎయిర్‌ ఇండియా కొత్త సర్వీస్‌



ఎయిర్‌ ఇండియా ఎక్స్‌ప్రెస్‌ విమానం

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విశాఖ నుంచి హైదరాబాద్‌కు కొత్త సర్వీస్‌ను శనివారం విశాఖ విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్‌ డైరెక్టర్‌ రాజారెడ్డి ప్రారంభించారు. ఎయిర్‌ ఇండియా ఎక్స్‌ప్రెస్‌ విమానయాన సంస్థ ఈ సర్వీస్‌ను నడుపుతోంది. ఇది ప్రతీ మంగళ, గురు, శని, ఆదివారాల్లో ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి 7.05 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 8 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

సై అంటే సై..

టీడీపీ, జనసేన నేతల మధ్య పొత్తు కుంపట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నా టీడీపీ, జనసేన పార్టీల మధ్య సీట్ల సిగపట్లు ఏమాత్రం తగ్గడంలేదు. ఎవరికి వారు సై అంటే సై అంటూ కత్తులు నూరుతున్నారు. రెండు పార్టీల అధినేతలు పొత్తు కుదుర్చుకున్నా కింది స్థాయిలో నేతలు, కేడర్‌ మనసులు మాత్రం కలవడంలేదు. మున్ముందు కూడా కలిసి పనిచేసేందుకు కేడర్‌ సంసిద్ధంగాలేని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో రాష్ట్రంలో చాలాచోట్ల రెండు పార్టీల నేతల మధ్య పొత్తు అస్సలు పొసగడంలేదు. పైగా.. కలిసి పనిచేస్తున్నట్లు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎప్పుడో ప్రకటించినా ఇప్పటివరకు ఒక్కడుగు కూడా వారిరువురూ ఆ దిశగా ముందుకు వేయలేదు. సీట్ల సర్దుబాటు నుంచి ఉమ్మడి మేనిఫెస్టో, ఉమ్మడి సభల వరకు అన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయి. కలిసి పనిచేయడానికి ఇద్దరు నేతలు ఆరాటపడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇరు పార్టీల నేతలు కత్తులు దూసుకుంటున్నారు. అలాగే, సీట్ల సర్దుబాటుపై కొన్నినెలలుగా చర్చలు జరగడమే తప్ప ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం వెల్లడించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు.. తమకు 50కి పైగా సీట్లు కేటాయించాలని జనసేన కోరుతుండగా, 15 సీట్లు ఇవ్వడానికి కూడా బాబు సిద్ధంగాలేరు. ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తామని రెండునెలల క్రితం ప్రకటించినా ఇంతవరకూ ఆ ఊసేలేదు. అంతేకాక.. ఇద్దరు అధినేతలు కలిసి ఉమ్మడిగా సభలు నిర్వహిస్తారని ప్రకటించినా అదీ జరగలేదు. బాబు 'రా కదలిరా' సభలకు పవన్‌ వెళ్తారని ప్రచారం చేసినా ఆయన వెళ్లలేదు. సీట్ల సర్దుబాటు కుదరకపోవడం వల్లే ఏ నిర్ణయం తీసుకోలేక సతమతమవుతున్నారు.

జిల్లాలో నువ్వా నేనా?

ఇదిలా ఉంటే.. నియోజకవర్గాల్లో మాత్రం రెండు పార్టీల నేతలు సీటు తమదంటే తమదంటూ పోటీపడుతూ గొడవలకు దిగడంతో జిల్లాల్లో పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగా మారింది. పలు నియోజకవర్గాల్లో ఆ రెండు పార్టీల నేతలు బలప్రదర్శనకు దిగుతూ నువ్వా నేనా అన్నట్లు తలపడుతున్నారు. ఉదా.. అనకాపల్లి ఎంపీ సీటు కోసం టీడీపీ సీనియర్‌ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి తనయుడు విజయ్‌ ప్రయత్నిస్తుండగా దాన్ని జనసేనకు కేటాయిస్తారనే ప్రచారంతో వాతావరణం వేడెక్కింది. తన కొడుక్కి ఎంపీ సీటు నిరాకరిస్తుండడంతో అయ్యన్న కస్సుమంటూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

రాజమండ్రి రూరల్‌లో రాజుకున్న విభేదాలు..

ఇక తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్‌ సీటు టీడీపీ, జనసేన నేతల మధ్య విభేదాలు రాజేసింది. అక్కడి నుంచి మళ్లీ తానే పోటీచేస్తానని సిట్టింగ్‌ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెబుతుండగా సీటు తనదేనని జనసేన నేత కందుల దుర్గేష్‌ తొడకొడుతున్నారు. ఇలా రెండు పార్టీల నేతలు ఇప్పటికే బహిరంగంగా గొడవలు పడే పరిస్థితి నెలకొంది. తాజాగా.. బుచ్చయ్య చౌదరి స్థానికంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో తన సీటును అడగడానికి దుర్గేష్‌ ఎవరని ప్రశ్నించారు. దీనిపై దుర్గేష్‌ వర్గం మండిపడుతూ ప్రతి విమర్శలు చేసింది. ఇలా.. నిత్యం రెండు పార్టీల నేతలు సీటు కోసం రెచ్చగొట్టే ప్రకటనలు చేసుకుంటూనే ఉన్నారు.

పిఠాపురంలో పోటాపోటీ..

- కాకినాడ జిల్లా పిఠాపురంలో టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌ఛార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ మధ్య విభేదాలు ముదిరి పాకానపడ్డాయి. ఇటీవల జరిగిన రెండు పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో ఇద్దరూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. ఈ సీటు తనదేనని చెబుతూ ఒకసారి ఓడిపోయిన వారికి సీటు ఎలా ఇస్తారని వర్మను ఉద్దేశించి మాట్లాడారు. దీనికి ప్రతిగా పార్టీ అధినేతలే ఓడిపోయిన పరిస్థితి ఉందంటూ పవన్‌ విషయాన్ని వర్మ గుర్తుచేశారు. దీంతో గొడవ జరిగి ఇరు వర్గాలు కుర్చీలు విసురుకునే పరిస్థితి ఏర్పడింది.
- అలాగే, కాకినాడ రూరల్‌ సీటును జనసేన నేత పంతం నానాజీకి ఇస్తారనే ప్రచారంతో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి కారాలు నూరుతున్నారు. సీటు తనకు ఇవ్వకపోతే పార్టీకి రాజీనామా చేస్తానని ప్రకటించారు.
- అమలాపురం నియోజకవర్గంలో ఇరు పార్టీల నేతలు సీటు తమదంటే తమదని ప్రచారం చేసుకుంటున్నారు.
- రాజోలు సీటును పవన్‌ తమదేనని ప్రకటించినా అక్కడి టీడీపీ నేతలు మాత్రం ఇంకా ఆశలు పెట్టుకుని హడావుడి చేస్తున్నారు.
- ఇక ఉమ్మడి పశ్చిమ గోదావరిలో పోలవరం సీటు జనసేనకు ఇస్తున్నారనే ప్రచారంతో అక్కడి టీడీపీ నేతలు భగ్గుమంటున్నారు.
- నర్సాపురం సీటు జనసేనకు ఇస్తే ఊరుకునేది లేదని స్థానిక టీడీపీ నేతలు హెచ్చరిస్తున్నారు.
- అలాగే, కృష్ణా జిల్లాలోనూ రెండు, మూడు నియోజకవర్గాల్లో రెండు పార్టీల మధ్య గందరగోళ వాతావరణం నెలకొంది. విజయవాడ పశ్చిమ నుంచి తాను పోటీచేస్తున్నట్లు జనసేన నేత పోతిన మహేష్‌ హడావుడి చేస్తుండగా టీడీపీ నేతలు జలీల్‌ఖాన్‌, బుద్దా వెంకన్నలు అతనికి అంత సీన్‌లేదని ఎద్దేవా చేస్తున్నారు.

తెనాలిపై మనోహర్‌, రాజా పట్టు..

ఇక తెనాలి సీటు కోసం జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్‌, టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజా పోటీపడుతుండడం రసవత్తరంగా మారింది. సీటు తనదేనని మనోహర్‌ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేయగా, రాజా మాత్రం ఇంకా నిర్ణయం జరగలేదని చెబుతూ తానే పోటీచేస్తానని చెబుతున్నారు. రాజాకు సీటు ఇవ్వకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయనే రీతిలో రాజా అనుచరులు తొడలు కొడుతున్నారు.

- కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ సీటు తమదేనని జనసేన నేతలు ప్రకటించుకోవడంతో అక్కడి టీడీపీ నేత భూమా అఖిలప్రియ మండిపడుతున్నారు.
- అనంతపురం అర్బన్‌ సీటు కోసం రెండు పార్టీల నేతలు బహిరంగంగా విమర్శలు చేసుకుంటున్నారు.
- ధర్మవరం సీటుపైనా రెండు పార్టీల నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి.

సీఎం సీటుపైనా సిగపట్లు..

ఇలా మొత్తంగా రెండు పార్టీలు పొత్తు కుదుర్చుకున్నా కింది స్థాయిలో నేతలు, కేడర్‌ మనసులు మాత్రం కలవలేదు. మున్ముందు కూడా కలిసి పనిచేసేందుకు కేడర్‌ సంసిద్ధంగాలేని పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు.. సీఎం అభ్యర్థిత్వంపై సోషల్‌ మీడియాలో రెండు పార్టీలు కత్తులు నూరుకుంటున్నాయి. చంద్రబాబు సీఎం అభ్యర్థిత్వాన్ని పవన్‌కళ్యాణ్‌ బలపరుస్తున్నా ఆ పార్టీ నేతలు, కేడర్‌ మాత్రం అంగీకరించడంలేదు. పైగా పవనే సీఎం అభ్యర్థని ప్రచారం చేస్తున్నాయి. దీనిపై టీడీపీ నేతలు మండిపడుతూ జనసేనకు అంత సీన్‌లేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.

నెలాఖరుకల్లా ఎన్నికల శిక్షణ పూర్తి చేయాలి

- షెడ్యూల్‌ ప్రకటించగానే ఎన్నికల నియమావళి అమలు
- ఈలోగానే అన్ని రకాల బృందాలకు శిక్షణ పూర్తవ్వాలి
- 80 ఏళ్లు దాటిన వారు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటు వేసే అవకాశం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌ మీనా



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ త్వరలో ప్రకటించనున్నందున అన్ని రకాల బృందాల శిక్షణను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌ కుమార్‌ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఎన్నికల సంసిద్ధత, ఓటర్ల జాబితా నవీకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. షెడ్యూలు ప్రకటించిన వెంటనే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని చెప్పారు. దాని ప్రకారం ఫ్లయింగ్‌ స్క్వాడ్లు, స్టాటిక్‌ సెర్వైలెన్స్‌, వీడియో వ్యూయింగ్‌, ఎలక్షన్‌ ఎక్స్పెండిచర్‌ మేనేజ్‌మెంట్‌ టీమ్‌లు, ఇతర బృందాల కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అందువల్ల ఆ బృందాలకు వారి విధులపై సమగ్ర అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణను మార్చి నెలలో ఇవ్వవచ్చని చెప్పారు.

విధుల్లో చేరకపోతే చర్యలు తప్పవు

అన్ని జిల్లాల్లో ఆర్వోలు, ఏఆర్వోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోల నియామకం జరిగిందని, వారిలో ఇప్పటికీ విధుల్లో చేరని వారి వివరాలను వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. వారి సమాచారాన్ని ప్రభుత్వానికి పంపి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్‌ కేంద్రాల వద్ద ఓటర్లకు సౌకర్యాలు కల్పించే బృందాలు, హోమ్‌ ఓటింగ్‌ బృందాల్లో తగినంత మందిని సమకూర్చుకోవాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్‌కు అవకాశం ఉన్నందున రెవెన్యూ అధికారులు, సిబ్బందితో హోం ఓటింగ్‌ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌ సిబ్బంది డేటాను సంబంధిత పోర్టల్‌లో వెంటనే ఫీడ్‌ చేయాలన్నారు. ఎలక్షన్‌ సీజర్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టంను పటిష్టంగా అమలు పర్చేందుకు రెగ్యులేటరీ అథారిటీలతో సమన్వయం చేసుకోవాలని, ప్రతి అథారిటీ నుండి తప్పనిసరిగా ఒక నోడల్‌ అధికారి ఉండాలని అన్నారు. ఈవీఎంలను తరలించే వాహనాలు, ఫ్లయింగ్‌ స్క్వాడ్లు, ఇతర బృందాల వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్‌ ఉండాలని చెప్పారు. జిల్లా కేంద్రం నుండి బ్లాక్‌ స్థాయి వరకు అందరు అధికారులతో పటిష్టమైన కమ్యూనికేషన్‌ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని మీనా ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్‌ స్టేషన్లు అన్నింటికీ తప్పనిసరిగా మైక్రో అబ్జర్వర్లను నియమించాలని, వెబ్‌ కాస్టింగ్‌, మీడియో కవరేజిల్లో పోలింగ్‌ కేంద్రాల పరిసరాలను కూడా చిత్రీకరించాలని చెప్పారు. అందుకు అవసరమైన వీడియోగ్రాఫర్లను, జిల్లా స్థాయిలోనే సమకూర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సీఈవోలు పి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పొత్తు చిచ్చు

- పార్టీలో రోజురోజుకు పెరుగుతున్న అసంతృప్తి
- అధినేత పవన్‌ తీరుపైనా శ్రేణుల్లో అసహనం
- పొత్తులో జనసేన వాటా సీట్లను ఇంకా తేల్చకపోవడంపై మండిపాటు
- చంద్రబాబు-పవన్‌ల వైఖరి మీద జనసేన శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీతో పొత్తు, ఆ పొత్తులోనూ జనసేన పార్టీకి అరకొర సీట్లే కేటాయించే అవకాశముందని సాగుతున్న ప్రచారం జనసేనలో చిచ్చు పుట్టిస్తోంది. కొద్దిరోజులుగా నియోజకవర్గాల స్థాయి నాయకుల్లోనూ, పార్టీ కేడర్‌లోనూ రోజురోజుకూ అసహనం, అసంతృప్తి పెల్లుబుకుతోంది. చివరికి ఇది తమ అధినేత పవన్‌కళ్యాణ్‌ తీరునే శంకించే పరిస్థితికి వెళ్లింది. పొత్తులు, సీట్ల కేటాయింపులో పార్టీ నేతలు, కేడర్‌ అభిప్రాయాలను నేరుగా తన వ్యక్తిగత రాజకీయ కార్యదర్శి దృష్టికి తీసుకురావాలని పవన్‌కళ్యాణ్‌ శనివారం బహిరంగ ప్రకటన చేశారంటే పార్టీలో అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకోవచ్చు. పైగా.. అసంతుష్టులను బుజ్జగించేందుకు పవన్‌ తన సోదరుడు నాగబాబును సైతం ఇప్పటికే రంగంలోకి దించడంతో జనసేన దుస్థితిపై రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమైంది.

పొత్తు ప్రకటన రోజు నుంచీ పంచాయతీలే..

నిజానికి.. టీడీపీతో పొత్తు జనసేన కేడర్‌కు మొదటి నుంచీ అస్సలు ఇష్టంలేదు. పొత్తుపై పవన్‌కళ్యాణ్‌ మాట్లాడిన మొదటి రోజు నుంచీ జనసేన కేడర్‌లో చాలామంది దానిపై అసంతృప్తిని వ్యక్తంచేస్తూనే ఉన్నారు. రోజులు గడుస్తున్నా ఇది తగ్గకపోగా పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో.. కొంతమంది పార్టీ నేతలు అప్పట్లో టీడీపీతో పొత్తు ఆలోచనలను వ్యతిరేకిస్తూ చేసిన వీడియో ప్రకటనలపై పార్టీ సమావేశాల్లో పవన్‌ ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. అయినా సరే.. చంద్రబాబు అరెస్టు తర్వాత రాజమండ్రి జైలు వద్ద పవన్‌కళ్యాణ్‌ టీడీపీ-జనసేన పొత్తుపై అధికారిక ప్రకటన చేశాక కూడా పిఠాపురం, జగ్గంపేటలో నిర్వహించిన రెండు పార్టీల ఉమ్మడి సమావేశాల్లో రెండు పార్టీల నాయకులు బాహాబాహీకి తలపడ్డారు. రెండునెలల క్రితం ఈ ఘటనలు జరిగినా, ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికీ ఇరు పార్టీల నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితే కొనసాగుతోంది.

సోషల్‌ మీడియాలో డిష్యూం డిష్యూం..

ఇదిలా ఉంటే.. పొత్తులో జనసేనకు కనీసం మూడో వంతు సీట్లయినా కేటాయించకపోతే తమ అధినేత పవన్‌కు సీఎం అయ్యే ఛాన్స్‌ ఉండదని.. ఈ కారణంతో ముందే సీఎం పదవిలో వాటా తేల్చాలని వారు డిమాండ్‌ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు తనయుడు లోకేశ్‌ ఓ మీడియా చానల్‌ ఇంటర్వ్యూలో సీఎం చంద్రబాబే అంటూ చేసిన వ్యాఖ్యలు జనసేన శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. దీనిపై సోషల్‌ మీడియా వేదికగా జనసేన-టీడీపీ అభిమానులు రెండుగా చీలిపోయి తీవ్రస్థాయిలో పరస్పరం విమర్శలు చేసుకున్నారు.

సీట్ల పంపకాలను తేల్చకపోయినా నిర్లిప్తతేనా?

ఇక జనసేన పార్టీ ఏర్పాటు నుంచీ పవన్‌ కళ్యాణ్‌ చంద్రబాబుతో అంటకాగుతూ టీడీపీ భజన చేస్తున్నారని సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు కూడా టీడీపీ అడక్కుండానే పవన్‌ అత్యుత్సాహంతో రాజమండ్రి జైలు దగ్గరకు వెళ్లి పొత్తు ప్రకటన చేయడాన్ని జనసేన శ్రేణులు తప్పుపడుతున్నారు. పైగా.. చంద్రబాబు సీట్ల సర్దుబాటును తేల్చకుండా కాలయాపన చేస్తున్నా తమ అధినేత పవన్‌కళ్యాణ్‌ పట్టించుకోకపోవడంపై వారు మండిపడుతున్నారు. అలాగే, సీఎం పదవిపై లోకేశ్‌ వ్యాఖ్యలను పవన్‌ ఖండించకపోవడాన్ని పార్టీలో చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు.

అది ముంపు ప్రాంతం కాదు..మిక్స్‌డ్‌ జోన్‌

- ముడసర్లోవలో రైల్వేకు అప్పగించిన స్థలంపై జీవీఎంసీ స్పష్టీకరణ
- రైల్వే అధికారులు తనిఖీ చేసి అంగీకరించిన తర్వాతే ఒప్పందం జరిగింది
- జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ స్పష్టీకరణ

సాక్షి, విశాఖపట్నం: రైల్వే శాఖకు ముడసర్లోవ వద్ద అప్పగించిన స్థలం ముంపు ప్రాంతం కాదని, మిక్స్‌డ్‌ జోన్‌ అని మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ స్పష్టం చేశారు. ప్రత్యేక రైల్వే జోన్‌ ఏర్పాటుకు ముంపు భూమి ఇచ్చారంటూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ చేసిన ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున జీవీఎంసీ కమిషనర్‌ శనివారం వివరణ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో భాగంగా పెందుర్తి ట్రాన్సిట్‌ కారిడార్‌ మంజూరు చేసిన సమయంలో రోడ్డు నిర్మాణానికి, రైల్వే భూముల్లో తరాలుగా ఉన్న మురికివాడల అభివృద్ధికి మొత్తం 26.11 ఎకరాలు అవసరమయ్యాయన్నారు. దీనిపై రైల్వే అధికారులతో దఫ దఫాలుగా జరిపిన చర్చలు సఫలీకృతం కాలేదని, చివరికి 1:2 నిష్పత్తిలో అంటే 52.22 ఎకరాలు ముడసర్లోవలో ఇచ్చే ప్రతిపాదనకు రైల్వే అధికారులు అంగీకరించారని తెలిపారు. ముడసర్లోవ స్థలం రైల్వేకి ఇచ్చేందుకు 2013 ఫిబ్రవరి 2న నం.55/12తో జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేశారని చెప్పారు. దీనిని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2015 నవంబర్‌ 26న జీవో ఎంఎస్‌ నం. 254 జారీ చేసినట్లు తెలిపారు. విశాఖపట్నం రూరల్‌లోని ముడసర్లోవలో సర్వే నెం.26లో జీవీఎంసీకి చెందిన సుమారు 270 ఎకరాలు పోరంబోకు ఉండగా, ఇందులో 52 ఎకరాలు రైల్వే శాఖకి అప్పగించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. అప్పట్లో రైల్వే అధికారులతో సంయుక్తంగా తనిఖీలు చేసి, వారు ఆమోదించిన తర్వాతే భూమి అప్పగింత చర్యలు చేపట్టినట్లు స్పష్టంచేశారు. ఈ ప్రాంత వీఎంఆర్డీఏ మాస్టర్‌ ప్లాన్‌ ప్రకారం అది మిక్స్‌డ్‌ జోన్‌ అని, ఏ విధమైన భవనాలైనా నిర్మించుకునేందుకు అనుకూలమైన స్థలంగా ధ్రువీకరించిందని తెలిపారు. ఆ భూమి చెరువు బ్యాక్‌ వాటర్‌లో లేదని, ముడసర్లోవ రిజర్వాయర్‌లో భాగం కాదని, ముంపునకు గురయ్యే అవకాశమే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై రైల్వే అధికారుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అభ్యంతరాలు, లేఖలు రాలేదని కమిషనర్‌ తెలిపారు.

రానున్న ఎన్నికల్లో మూడు రాజధానులదే విజయం

1,231వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



మూడు రాజధానులకు మద్దతుగా రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: వికేంద్రీకరణ ఫలాలు అందరికీ అందించే మూడు రాజధానుల అజెండాతో ప్రభుత్వం ఎన్నికలకు వెళితే.. ఏపీలో భారీ విజయం తథ్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,231వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. అమరావతి ఉద్యమం డ్రామా కంపెనీ మాత్రమేనని, బాబు అవినీతిని కాపాడుకునేందుకు సృష్టించిన ఈ కంపెనీ ఇప్పటికే జనం లేక వెలవెలబోతుందని ఎద్దేవా చేశారు. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం కోసం అమరావతిని ఎంచుకున్న బాబు కోట్లాది రూపాయలు ఇన్‌సైడర్‌ ట్రేడింగ్‌ చేసి ఈ ప్రాంతాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చేసిన విఫల యత్నాలను ప్రజలు తిప్పికొట్టారని మండిపడ్డారు. ఎలాంటి రాజకీయ అజెండా లేకుండా బాబు పొత్తుల కోసం ఢిల్లీలో వెంపర్లాడుతుండటం సిగ్గుచేటన్నారు. నాయకుల ఎం. గురునాథం, బూదాల సలోమి, పులిదాసు, బి.శామ్యేలు, ఈపూరి ఆదాం, పి.సౌమ్య, పెద్దింటి విజయ్‌, నూతక్కి జోషి పాల్గొన్నారు.

'నారాయణ'లో వడ్డీ దుకాణం!

- టీడీపీ ఎన్నికల ఫండ్‌ కోసం నగదు వసూళ్లు.. రూ.5 వడ్డీకి ప్రకాశం, నెల్లూరు జిల్లాల వారితో వ్యాపారం
- నారాయణ కాలేజీల్లో 4 కౌంటర్లు.. 4 రోజుల్లోనే రూ.650 కోట్లు వసూలు
- రశీదులు కాకుండా టోకెన్లతో వ్యాపారం
- డ్రగ్స్‌ విక్రయిస్తున్నట్లూ ఆరోపణలు
- అదే సమాచారంతో శుక్రవారం కళాశాలలో డ్రగ్స్‌ కంట్రోల్‌ అధికారుల సోదాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన నారాయణ విద్యా సంస్థల అధినేత పొంగూరు నారాయణ డబ్బు వసూళ్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వడ్డీ ఆశ చూపించి రాబోయే ఎన్నికల కోసం నెల్లూరు, ప్రకాశం జిల్లాల వ్యాపారుల నుంచి వందల కోట్లు వసూలు చేసిన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. నారాయణకు చెందిన నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాల కేంద్రంగా ఈ వసూళ్లు జరిగాయి. దీని కోసం ఈ కాలేజీలో వారం క్రితం 4 కౌంటర్లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా రూ.650 కోట్లు వసూలు చేసి, రహస్య ప్రదేశానికి తరలించినట్లు సమాచారం.

రూ.5 వడ్డీకి ..

విద్యా సంస్థల అధినేత అయిన నారాయణకు మార్వాడీలు, వ్యాపారులతో మంచి సంబంధాలు ఉన్నాయి. విద్యా సంస్థల కోసం వ్యాపారులతో తరచూ లావాదేవీలు నిర్వహించేవారు. దీంతో గత ఎన్నికల్లోనూ ఇలాగే రూ.2 వడ్డీకి రూ.400 కోట్లు వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈసారి 2 రూపాయల వడ్డీకి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో ఐదు రూపాయలకు పెంచారు. ఈమేరకు ప్రకాశం, నెల్లూరు జిల్లాల వ్యాపారులు, మార్వాడీలకు సమాచారమిచ్చారు. వడ్డీ పెరగడంతో అనేక మంది వ్యాపారులు, మార్వాడీలు క్యూ కట్టారు. ఇలా నాలుగు రోజుల్లోనే రూ.650 కోట్లు సేకరించినట్లు సమాచారం. వ్యాపారులే కాకుండా, నారాయణ సంస్థలో పనిచేసే ఉద్యోగుల నుంచి కూడా నగదు సేకరించారు. ఈ సొమ్ముకు ఆధారాలు ఉండకూడదన్న ఉద్దేశంతో ఎవరికీ రశీదులు ఇవ్వలేదు. అందుకు బదులుగా టోకెన్ల ద్వారా లావాదేవీలు నిర్వహించారు. వ్యాపారులు నగదు చెల్లించగానే టోకెన్లు ఇచ్చారు. వడ్డీ కావాల్సిన వారికి ప్రతి నెలా వడ్డీ చెల్లిస్తామని, లేదంటే ఏడాది తర్వాత అసలు, వడ్డీ కలిపి ఇస్తామని వ్యాపారులకు చెప్పారు. నారాయణ కళాశాలలో వడ్డీ వ్యాపారం బయటకు పొక్కడంతో దుకాణాలు మూయించేశారు. నగదును రహస్య ప్రాంతంతో దాచేశారు. అక్కడి నుంచి పార్టీ అధినేత సూచనల మేరకు అభ్యర్థులకు చేరవేస్తారు.



కాలేజీలోకి వెళుతున్న వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్‌)

నారాయణ ఇష్టారాజ్యం

చంద్రబాబుతో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి, ఆయన బినామీగా ఉన్న నారాయణ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకముందే చంద్రబాబు ఆర్థిక వ్యవహారాలు చూసుకునేవారు. ప్రతి ఎన్నికల సమయంలో తన విద్యా సంస్థల నుంచే డబ్బు సేకరించి చంద్రబాబుకు పంపుతుంటారు. అంతేకాదు తన విద్యా సంస్థల ఉద్యోగుల ద్వారానే సర్వేలు చేయించేవారు. 2014లో చంద్రబాబు సీఎం కాగానే నారాయణకు ఎమ్మెల్సీ కట్టబెట్టి ఏకంగా మంత్రిని చేశారు. చంద్రబాబు కేబినెట్‌లో కీలక మంత్రిగా ఉంటూ ఆయన బినామీగా నారాయణ రాజధాని భూసేకరణ నుంచి అన్నింటా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడిన విషయం తెలిసిందే. నారాయణ విద్యా సంస్థల్లోనూ విద్యార్థులపై అమానుష ఘటనలు పలుమార్లు వెలుగుచూశాయి. విద్యార్థుల బలవన్మరణాలకూ దారి తీశాయి. ఇటీవలి కాలంలో నారాయణ వైద్య కళాశాలలో డ్రగ్స్‌ కూడా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. రెండేళ్ల క్రితం ఓ వైద్యుడు మత్తు ఇంజక్షన్‌ చేసుకొని మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇటీవల విద్యార్థులు అనేక మంది మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని తల్లిదండ్రుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయి. కళాశాలలో నిషేధిత మందుల విక్రయాలు జరుగుతున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు కాలేజీలో సోదాలు చేశారు.



ఆదియందు వాక్యముండెను,
వాక్యము దేవునియొద్ద ఉండెను,
వాక్యము దేవుడై యుండెను.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.విదియ రా.1.03 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** శతభిషం రా.9.20 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.3.18 నుండి 4.46 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.23 నుండి 5.09 వరకు, **అమృతఘడియలు:** ప.2.39 నుండి 4.06 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం : 5.55
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు


ఏ నిర్ణయమూ తీసుకోలేని తాత్సారం కన్నా ఏదో ఒక నిర్ణయం తీసుకునే తొందరపాటు తక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. లేదా ఎక్కువ ప్రయోజనాన్ని చేకూర్చుతుంది.

లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్నాయా, ఇంకా దూరంగానే ఉన్నాయా అన్నది... ఏమీ తోచని పనుల్లో తలమునకలై ఉండే వాళ్లు మాత్రమే చేసే ఆలోచన.

ఏ రాష్ట్రంలో ఏ సీటుకు ఎవరు అభ్యర్థి, ఎవరి అభ్యర్థి అనేది కూర్చొని మాత్రమే నిర్ణయించవలసిన పనేముంది? పడుతూ లేస్తూ కూడా ఆ పని చేయవచ్చు. నిజానికి పడుతూ లేస్తూ చేసినప్పుడే పనులు గానీ, జాబితాలు గానీ చక్కగా కుదురుతాయి.

ఇండియా కూటమి ఏర్పడి ఏడు నెలలు కావస్తోంది. కాంగ్రెస్ ఎటూ తేల్చడం లేదు. ఎటూ తేల్చుకోనివ్వడం లేదు!

మోదీకి సమఉజ్జీగా ఒక గట్టి అభ్యర్థిని ప్రకటించే ఉత్సాహాన్ని కాంగ్రెస్ ఇంతవరకు ప్రదర్శించనే లేదు! కూటమి నుంచి నితీశ్ వెళ్లిపోయినందుకు, మమతాజీ వెళ్లిపోతానని అంటున్నందుకు కోపాన్నీ ప్రకటించలేదు!



ఆఖరికి ఎలక్షన్ కమిషన్ ఎన్సీపీని పవార్‌కు కాకుండా చేసినప్పుడు కూడా కాంగ్రెస్‌లో చిన్నపాటి కలవరమైనా కనిపించలేదు!

ఈ ఉదయం నిద్ర లేవగానే నాకు అనిపించింది... ఇప్పుడప్పుడే కాంగ్రెస్ నిద్ర లేవదని. వెంటనే అతిషికి కాల్ చేశాను. పంకజ్ గుప్తాని కూడా లైన్‌లోకి రప్పించాను. "ఫైనల్ చేసేయండి. దిబ్రూగడ్ మనోజ్ ధనోవర్, గువాహటి భాబెన్ చౌదరి, అండ్.. సోనిట్‌పూర్..' అని చెప్పబోతున్నాను.. 'రిపి రాజ్ కౌండిన్య కదా అరవింద్ జీ' అన్నారు అతిషి!!

"యెస్ మేడమ్" అని నవ్వుతూ ఫోన్ పెట్టేశాను. వియ్ ఆర్ దట్ ఫాస్ట్.

'మూడ్ ఆఫ్ ది నేషన్' అంటూ మళ్లీ ఒక సర్వే బయటికి వచ్చింది! ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మోదీ అండ్ టీమ్‌కి మొత్తం లోక్‌సభలో ఉన్న సీట్లన్నీ వచ్చేస్తాయని! అది 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలా లేదు. 'మూడ్ ఆఫ్ ది మోదీ' సర్వేలా ఉంది! అలాంటి సర్వేలను చూసైనా కాంగ్రెస్ ఎందుకు తను మూడ్ తెచ్చుకోదు?

రాహుల్ నవ్వుతూ ఉంటారు. సీరియస్‌గా ఒక్క పనీ చేయరు. ఖర్గేజీ సీరియస్‌గా ఉంటారు. నవ్వుతూ ఒక్క పనైనా రాహుల్‌తో చేయించలేరు.

అస్సాంలో 14 సీట్లుంటే ఈసారి వాటిల్లో మూడు సీట్లు పెరిగి మొత్తం 12 సీట్లు బీజేపీకి వచ్చేస్తాయట! ఆ మూడు సీట్లు గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుచుకున్నవి. ఈసారి కాంగ్రెస్‌కు.. వస్తే ఒక సీటు వస్తుందనీ, అదీ రాకుంటే మిగిలి రెండు సీట్లూ తక్కిన పార్టీలకు వెళతాయనీ 'మూడ్ ఆఫ్ ది నేషన్' అంటోంది!

వాష్‌రూమ్ నుంచి బయటికి రాగానే మళ్లీ పంకజ్ గుప్తాకి ఫోన్ చేశాను. "పంకజ్.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరగవు కనుక ఈలోపు మనం 'మూడ్ ఆఫ్ ది నేషన్' ని మార్చేయాలి" అన్నాను.

"అన్ని స్టేట్‌లలో 'ఆప్' టీమ్‌లతో కలిసి అతిషి, నేను అదే పనిలో ఉన్నాం అరవింద్‌జీ" అన్నారు పంకజ్. అతిషి కేబినెట్ మినిస్టర్. ఐదు శాఖల్ని చూస్తున్నారు. పంకజ్ నేషనల్ సెక్రెటరీ.

మోదీని ఓడించడమే ధ్యేయంగా పెట్టుకున్నప్పుడు మోదీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. కూటమి ధ్యేయానికి, లక్ష్యానికి మధ్య కాస్త గ్యాప్ దొరికినా చాలు మోదీ 'భారతరత్న'ల్ని ప్రకటించేస్తున్నారు!

జోడో యాత్రకు బ్రేక్ ఇచ్చి రాహుల్ ఢిల్లీ వచ్చారని తెలిసి ఆయనకు ఫోన్ చేశాను.

"చెప్పండి కేజ్రీవాల్‌జీ... ఏమిటింత ఉదయాన్నే ఫోన్ చేశారు?" అన్నారు రాహుల్ నవ్వుతూ!!

టైమ్ చూశాను. పన్నెండు దాటుతోంది!

మనం కొంచెం ఫాస్ట్‌గా మూవ్ అవ్వాలి రాహుల్‌జీ అంటే బాగుండదని... "మనం ఇంకొంచెం ఫాస్ట్‌గా మూవ్ అవ్వాలి రాహుల్‌జీ" అన్నాను... నేను ఆయన మూడ్‌లోకి వెళ్లి, ఆయన్ని కూటమి మూడ్‌లోకి తెచ్చే ప్రయత్నంగా.

అబద్ధాలే ఆయుధాలు!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

వర్తమాన భారత రాజకీయాల్లో అలవోకగా అబద్ధాలు చెప్పగలిగే నేర్పరి ఎవరు? ఈ ప్రశ్నకు తెలుగు రాష్ట్రాల్లోని 90 శాతం మంది ప్రజలు తడుముకోకుండా సమాధానం చెప్పగలరు. అబద్ధం – ఆయనా కవల పిల్లలన్నంతగా అపఖ్యాతిపాలైన ఆ నాయక శిరోమణి పేరు చంద్రబాబని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 'నిజం చెబితే ఆయన తల వేయి ముక్కలవుతుందని ముని శాపం వున్నది, అందువల్లనే ఆయన నిజం చెప్పడ'ని వైఎస్సార్ తరుచూ చెబుతుండేవారు. 'కళ్లార్పకుండా అబద్ధం చెప్పగలిగే వాడే చంద్రబాబ'ని జగన్‌మోహన్ రెడ్డి పలుమార్లు చెప్పారు.

అటువంటి చంద్రబాబు రామోజీరావు చెంతకు చేరారు. లేదా, రామోజీయే చంద్రబాబును చేరదీశారు. రామోజీది గోబెల్స్ అంశ. అంతకంటే నైపుణ్యం గలవాడు. గోబెల్స్‌ను తొండ అనుకుంటే, రామోజీని ఊసరవెల్లి అనుకోవాలి. భౌతిక శాస్త్రంలో న్యూటన్ వంటివాడు గోబెల్స్ అనుకుంటే, ఐన్‌స్టీన్ మాదిరిగా అప్‌డేటెడ్ వెర్షన్ రామోజీ. ఆయనకు రాసుకోవడానికి పత్రికా, చూసుకోవడానికి టీవీలూ, తీసుకోవడానికి స్టూడియో ఉన్న సంగతి తెలిసిందే. వాటి సాయంతో ప్రాపగాండా అనే సబ్జెక్టును అసత్యశాస్త్రంగా అభివృద్ధి చేశారు. రామోజీ–బాబులకు ఇంకొందరు పిల్ల గోబెల్స్ తోడయ్యారు. ఇంకేముంది? అసలే కోతి... కల్లు తాగింది. ఆపై నిప్పు తొక్కింది. దాన్ని ఎగరకుండా ఆపడం ఎవరి తరం?

ఆ కల్లు తాగిన కోతికే జనం యెల్లో మీడియా అనే వాడుక పేరు తగిలించారు. ఈ యెల్లో మీడియాకు జగన్‌మోహన్ రెడ్డి మీద ప్రత్యేకమైన ఆసక్తి ఉన్నదనే సంగతి తెలియనిది కాదు. పొలిటికల్ బాసు బాబు మీద మన యెల్లో మీడియా ఈగనైనా వాలనీయదు. ఆయన్ను కుర్చీలోంచి లాగి గిరాగిరా తిప్పి నేలకేసి కొడుతుంటే చూస్తూ ఊరుకుంటుందా? ఊరుకోదు కనుకనే 2014లో, ఆ తర్వాత 2019లో జగన్‌మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా కోటి అబద్ధాల నోము నోచింది. నూరు అబద్ధాలాడైనా సరే ఒక పెళ్లి చేయమన్నారు కదా పెద్దలు. ఇదే స్ఫూర్తితో కోటి అబద్ధాలాడైనా సరే బాబును కుర్చీలో కూర్చోబెట్టాలనే సంకల్పాన్ని యెల్లో మీడియా తలదాల్చింది.

ఈసారి ఇంకా పెద్దఎత్తున శతకోటి అబద్ధాల నోమును ప్రారంభించినట్టున్నారు. యెల్లో పత్రికలూ, ఛానెళ్లూ అబద్ధాల మందుగుండును అడ్డదిడ్డంగా పేలుస్తున్నాయి. ఈ అడ్డగోలు కాల్పులు లక్ష్యాన్ని తాకలేకపోతున్నాయి. జనంలో విశ్వసనీయత పూర్తిగా సన్నగిల్లింది. వీళ్లు పొరపాటున ఎప్పుడో ఒక నిజం చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. దాంతో కొత్త వార్‌ఫ్రంట్స్‌ను చంద్రబాబు ఓపెన్ చేశారు. తెలుగుదేశం – యెల్లో మీడియాల స్క్రిప్టును చదవడానికి, అబద్ధాలను వల్లె వేయడానికి వేరే గొంతులు కావాలి. వేరే ముఖాలు కనిపించాలి. ఇటువంటి పరకాయ ప్రవేశపు వ్యూహాలను చంద్రబాబు చాలా కాలంగానే అమలు చేస్తున్నారు. కాకపోతే ఇప్పుడు ఆ వ్యూహాలకు మరింత పదును పెట్టారు.

ఇతర పార్టీల్లో, వ్యవస్థల్లో, సంస్థల్లో తన మనుషులను జొప్పించి తనకు అవసరమైనట్టుగా ఆడించుకోవడం చంద్రబాబు వెన్నుపోటుతో నేర్చిన విద్య. చంద్రబాబు ఉచ్చులోపడి ఆయన మెప్పుకోసం ముఖ్యమంత్రి జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఒక న్యాయమూర్తి పరిస్థితిని నిన్ననే చూశాము. ఆ న్యాయమూర్తి వ్యవహారశైలిని తప్పుపడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తొలగించింది. పైనున్న వారి అండ చూసుకొని అభ్యంతరకరంగా వ్యవహరించిన న్యాయమూర్తికి శృంగభంగం తప్పలేదు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గద్దె నెక్కాలన్న లక్ష్యంతో అధికార పార్టీ మినహా మిగిలిన అన్ని పార్టీలతోనూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పొత్తులు పెట్టుకోవడానికి చంద్రబాబు పడుతున్న ప్రయాస కనిపిస్తూనే ఉన్నది.

ఇప్పటికే జనసేనను హత్తుకున్న బాబు బీజేపీ పెద్దల కటాక్షం కోసం నిరీక్షిస్తున్న సంగతి గమనిస్తూనే ఉన్నాము. ఇక రాష్ట్రంలో ఖాయిలాపడిన కాంగ్రెస్ పార్టీని చంద్రబాబు కౌలుకు తీసుకున్న సంగతి కూడా జగమెరిగిన సత్యమే. జనసేన, బీజేపీలు తనకు ఓట్లను జోడించాలి. కాంగ్రెస్ పార్టీ వైసీపీ ఓట్లను చీల్చాలి. ఇదీ చంద్రబాబు–రామోజీల స్వీట్‌డ్రీమ్. ప్రత్యక్ష పొత్తు పార్టీలతో పాటు పరోక్ష పొత్తు పార్టీ కూడా జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అబద్ధాలను ప్రచారం చేయాలి. అపోహలు సృష్టించాలి. అవసరమైన అబద్ధాల స్క్రిప్టును టీడీపీ అందజేస్తుంది. ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అదే పనిలో ఉన్నది. చంద్రబాబు ఆకాంక్షల మేరకే రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలి నియామకం కూడా జరిగింది. పీసీసీ అధ్యక్షురాలితో పాటు ఆ పార్టీ నాయకులు కూడా తెలుగుదేశం, యెల్లో మీడియా భాషనే మాట్లాడుతున్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు కేవీపీ రామచంద్రరావుకు ఇంచుమించు చంద్రబాబుకున్నంత రాజకీయ అనుభవం ఉన్నది. ఆయన నిన్న విజయవాడలో ఒక ప్రెస్‌మీట్ పెట్టారు. అందులో ఒక అద్భుతమైన, అనూహ్యమైన పొట్టలు పగిలేలా విరగబడి నవ్వించే సంచలన ఆరోపణ చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నుంచి భారతీయ జనతా పార్టీకి ముడుపులు అందుతున్నాయట! కుబేరుడికి చందాలివ్వడమేమిటో! ప్రపంచంలోనే అత్యంత సంపన్న పార్టీగా బీజేపీకి పేరున్నది. పదేళ్లుగా అవిచ్ఛిన్నంగా కేంద్రంలో అధికారం చలాయిస్తున్నది. మెజారిటీ రాష్ట్ర ప్రభుత్వాలూ వారివే. దేశంలోని బడా పారిశ్రామికవేత్తలంతా ఆ పార్టీ కనుసన్నల్లోనే మసులుకుంటున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇప్పుడిప్పుడే కాలు చేయి కూడదీసుకుంటున్న రాష్ట్రం నుంచి వారికి ముడుపులు కావాలా? ఈ నికృష్టమైన ఆరోపణ చేయడానికి టీడీపీకి ధైర్యం సరిపోదు గనుక 'బంతి'ని కాంగ్రెస్‌కు పాస్ చేసింది. బాల్ దొరికిందని గోల్ కొట్టబోయి కేవీపీ బొక్కబోర్లా పడ్డారు.

కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తెలుగుదేశం పార్టీతో కలిసి ఉమ్మడిగా అక్రమ కేసును బనాయించి జగన్‌మోహన్ రెడ్డిని అన్యాయంగా పదహారు నెలలు జైల్లో పెట్టిన సంగతి తెలిసిందే. ఉత్తి పుణ్యానికి అంతకాలం జైల్లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకత్వం సంతృప్తి చెందినట్లు లేదు. ఆంధ్రప్రదేశ్ మంత్రులెవరూ అరెస్టు కావడం లేదేమిటని ఆయన చాలా బాధపడ్డారు. రాష్ట్రంలో అవినీతి జరుగుతున్నదని టీడీపీ యెల్లో మీడియా చేస్తున్న విషప్రచారానికి వంత పాడటమన్న మాట. ఇక రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలి సంగతి సరేసరి. వైసీపీకి మద్దతునిస్తున్న మైనారిటీల ఓట్లు చీల్చడానికి బాబు అప్పగించిన బాధ్యత నిర్వహణ కోసం ఆమె తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు జరిగితే జగన్‌మోహన్ రెడ్డి ఖండించలేదట! అసలు మణిపూర్‌లో జరిగిందేమిటి? మతాల మధ్యన ఘర్షణగా ఎందుకు చిత్రిస్తున్నారు? రోజూ పత్రికలు చదివే వారికి మణిపూర్ ఘటనల నేపథ్యం తెలిసే ఉంటుంది. అది రెండు తెగల మధ్యన ఏర్పడిన పరస్పర అపనమ్మకం. ఒకరి పట్ల ఒకరికి అనుమానం. ఇక్కడ మతం లేదు. కొండ ప్రాంత షెడ్యూల్డ్ తెగ కుకీలకు, మైదాన ప్రాంత మెయితీలకు మధ్యన ఏర్పడిన విభేదాలు కారణం. మెయితీల్లో మెజారిటీ ప్రజలు హిందువులు కావడం, కుకీల్లో అత్యధికులు క్రైస్తవులు కావడం యాదృచ్ఛికం. ఈ వివాదానికి అది కారణం కాదు. మెయితీల్లో క్రైస్తవులు, మహ్మదీయులు కూడా ఉన్నారు. మెయితీలకు షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించే ప్రతిపాదన పట్ల కుకీల్లో అభద్రతాభావం ఏర్పడింది. తమ భూములు కూడా క్రమంగా మైదాన ప్రాంతాల వారి చేతుల్లోకి వెళ్లి పోతాయేమోననే భయం కుకీలను ఆందోళనకు పురికొల్పింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకం వల్ల ఘర్షణలు చెలరేగి కొన్ని సిగ్గుపడాల్సిన సంఘటనలు జరిగాయి.

కేంద్రం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం కలిసి పరిష్కరించవలసిన స్థానిక సమస్యకు మతం రంగులు పులమడం, మత వైషమ్యాలు లేని రాష్ట్రంలో చిలువలు పలువలు చేర్చి రెచ్చగొట్టడం అవాంఛనీయం. తమ పబ్బం గడుపుకోవడానికి కుటుంబాలను చీల్చడం, కులాల మధ్య కుంపట్లు పెట్టడం, మతాల మధ్య చిచ్చుపెట్టడం వంటి పనులకు కొందరు రాజకీయవేత్తలు వెనుకాడరు. తమ నోటి వెంట వస్తే రక్తి కట్టవనుకున్న సంభాషణల్ని ఇతరుల చేత పలికిస్తారు. ఆ స్క్రిప్టును చదివేవాళ్లు ఒకటికి పదిసార్లు ఆలోచించి చదవడం మంచిది.

అధికారపక్షం మీద అబద్ధాలనే ఆయుధాలుగా ప్రయోగించే కార్యక్రమంలో భాగంగా యెల్లో మీడియా, జనసేనలతోపాటు ఈ వారం కాంగ్రెస్ పరివారాన్ని కూడా చంద్రబాబు రంగంలోకి దించారు. దాంతోపాటు ఒకానొక సర్వే సంస్థను కూడా ప్రయోగించారు. దాని పేరు సీ-వోటర్. ఈ సంస్థకు విశ్వసనీయత లేదనీ, ఈ సంస్థతో చంద్రబాబుకు అక్రమ సంబంధం ఉన్నదనీ చెప్పడానికి కావలసినన్ని రుజువులున్నాయి. ఒక ప్రొఫెషనల్ సంస్థ ఎన్నికల కంటే ముందే ప్రజల మూడ్‌ను అంచనా కట్టి రిపోర్టు ఇస్తే అది కనీసం 90 శాతమన్నా వాస్తవానికి దగ్గరగా ఉండాలి. అప్పుడే దాని ప్రొఫెషనలిజం మీద నమ్మకం కుదురుతుంది. గత రెండు దశాబ్దాలుగా మన దేశంలో సెఫాలజీ ఒక శాస్త్రంగా బాగా వేళ్లూనుకున్నది. 90 నుంచి 95 శాతం వరకు కచ్చితత్వంతో చాలా సంస్థలు రిపోర్టులు ఇవ్వగలుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కచ్చితత్వం లేకపోయినా ట్రెండ్‌నయితే సరిగ్గానే పట్టుకుంటున్నారు. విజేతను ముందుగానే గుర్తించగలుగుతున్నారు.

2019లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 86 శాతం (151) అసెంబ్లీ సీట్లను, 88 శాతం (22) పార్లమెంట్ స్థానాలను గెలుచుకున్నది. ఇటువంటి భారీ విజయాల సందర్భాన్ని వేవ్‌గా, ప్రభంజనంగా పేర్కొంటారు. ప్రభంజనం ఉన్న సందర్భాల్లో ఔత్సాహిక సర్వే సంస్థలు సైతం విజేతను సరిగ్గానే ఊహిస్తాయి. సీట్ల సంఖ్యను చెప్పడంలో ప్రొఫెషనల్ సంస్థలు కొంతమేరకు దగ్గరగా రావచ్చు. ఇటువంటి సందర్భాల్లో కూడా సీట్ల సంఖ్యను పక్కనబెట్టి అసలు విజేతనే తప్పుగా ఊహించేవాడు ఎవడైనా ఉంటాడా? ఒక్కడున్నాడు. వాడే సీ-వోటర్. ముందస్తు సర్వేలో వైసీపీకి 10 సీట్లు, టీడీపీకి 15 సీట్లు వస్తాయని రిపోర్టు ఇచ్చాడు. పోలింగ్ జరిగిన రోజు ఎగ్జిట్ పోల్‌లో కొద్దిగా సవరించి వైసీపీకి 11, టీడీపీకి 14 ఇచ్చాడు. వాస్తవ ఫలితం తెలిసిందే. వైసీపీకి 22, టీడీపీకి 3 సీట్లు వచ్చాయి. ఆ మూడు సీట్లను కూడా పదివేల లోపు ఓట్ల తేడాతోనే టీడీపీ గెలిచింది. అంత వేవ్‌ను అంచనా వేయలేకపోతే అది ఒక ప్రొఫెషనల్ సంస్థగా పని చేయడం తగునా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో జరిగిన ఎన్నికలను పరిశీలిద్దాం. పోలింగ్ ముగిసిన రోజున సీ-వోటర్ సంస్థ ప్రెస్‌మీట్ పెట్టి తెలుగుదేశం 160 సీట్లు గెలవబోతున్నదని ప్రకటించింది. వాస్తవానికి ఆ ఎన్నికల్లో టీడీపీకి 47 అసెంబ్లీ సీట్లు మాత్రమే దక్కాయి. ప్రొఫెషనల్ సంస్థ చేసే సర్వే ఇంత దారుణంగా వికటిస్తుందా? వచ్చే ఎన్నికలకు సంబంధించి గడిచిన నెల రోజుల్లో 13 సర్వేలు వచ్చాయి. అందులో పన్నెండు సర్వేలు వైసీపీ గెలుస్తుందని చెప్పాయి. 47.7 నుంచి 51 శాతం వరకు ఆ పార్టీ వోట్ షేర్‌ను అంచనా వేశాయి. టీడీపీ గెలుస్తుందని అంచనా వేసినవాడు మళ్లీ ఒకే ఒక్కడు. వాడే సీ-వోటర్. టీడీపీకి 17 పార్లమెంట్ సీట్లు, వైసీపీకి 8 పార్లమెంట్ సీట్లు వస్తాయని ఆ సంస్థ అంచనా వేసింది. వైసీపీకి 41 శాతం, టీడీపీ కూటమికి 45 శాతం ఓటు షేర్ ఉన్నట్టు ప్రకటించింది. ఊరందరిదీ ఒక దారైతే ఉలిపి కట్టెది ఇంకో దారి అంటారు. ఇప్పుడు సీ-వోటర్ అనే సంస్థదీ అదే దారి.

చంద్రబాబుకు సంబంధించిన ఎన్నికలు జరిగే ప్రతి సందర్భంలోనూ ఈ సంస్థ ఆయన పార్టీయే గెలుస్తుందని రిపోర్టులు ఇచ్చింది. గడిచిన 25 సంవత్సరాలుగా ఈ సంస్థది ఇదే కథ. చంద్రబాబు అనగానే ఆటోమేటిక్‌గా విజేత అని వచ్చేట్టు కంప్యూటర్ ప్రోగ్రామింగేదో వీళ్ల దగ్గర ఉన్నట్టున్నది. సీ-వోటర్ అనే సంస్థ చంద్రబాబు పెంపుడు చిలక అనడానికి ఈ ఉదాహరణలు సరిపోతాయి. ఈ పెంపుడు చిలక పలికిందని గడిచిన రెండు రోజులుగా యెల్లో మీడియా పండుగ చేసుకుంటున్నది. కానీ క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ ప్రకారం ఐదేళ్ల కిందటి ఫలితాలే ఆంధ్రప్రదేశ్‌లో పునరావృతం కాబోతున్నాయని ఘంటాపథంగా చెప్పవచ్చు.

అసలే కోతి... కల్లు తాగింది. ఆపై నిప్పు తొక్కింది. దాన్ని ఎగరకుండా ఆపడం ఎవరి తరం? ఆ కల్లు తాగిన కోతికే జనం యెల్లో మీడియా అనే వాడుక పేరు తగిలించారు. ఈ యెల్లో మీడియాకు జగన్‌మోహన్ రెడ్డి మీద ప్రత్యేకమైన ఆసక్తి ఉన్నదనే సంగతి తెలియనిది కాదు. పొలిటికల్ బాసు బాబు మీద మన యెల్లో మీడియా ఈగనైనా వాలనీయదు. ఆయన్ను కుర్చీలోంచి లాగి గిరాగిరా తిప్పి నేల కేసి కొడుతుంటే చూస్తూ ఊరుకుంటుందా? ఊరుకోదు కనుకనే 2014లో, ఆ తర్వాత 2019లో జగన్‌మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా కోటి అబద్ధాల నోము నోచింది. నూరు అబద్ధాలాడైనా సరే ఒక పెళ్లి చేయమన్నారు కదా పెద్దలు. ఇదే స్ఫూర్తితో కోటి అబద్ధాలాడైనా సరే బాబును కుర్చీలో కూర్చోబెట్టాలనే సంకల్పాన్ని యెల్లో మీడియా తలదాల్చింది.
ఈసారి ఇంకా పెద్దఎత్తున శతకోటి అబద్ధాల నోమును ప్రారంభించినట్టున్నారు. యెల్లో పత్రికలూ, ఛానెళ్లూ అబద్ధాల మందుగుండును అడ్డదిడ్డంగా పేలుస్తున్నాయి. ఈ అడ్డగోలు కాల్పులు లక్ష్యాన్ని తాకలేకపోతున్నాయి. జనంలో విశ్వసనీయత పూర్తిగా సన్నగిల్లింది. వీళ్లు పొరపాటున ఎప్పుడో ఒక నిజం చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. దాంతో కొత్త వార్‌ఫ్రంట్స్‌ను చంద్రబాబు ఓపెన్ చేశారు. తెలుగుదేశం – యెల్లో మీడియాల స్క్రిప్టును చదవడానికి, అబద్ధాలను వల్లె వేయడానికి వేరే గొంతులు కావాలి. వేరే ముఖాలు కనిపించాలి. ఇటువంటి పరకాయ ప్రవేశపు వ్యూహాలను చంద్రబాబు చాలా కాలంగానే అమలు చేస్తున్నారు. కాకపోతే ఇప్పుడు ఆ వ్యూహాలకు మరింత పదును పెట్టారు.

2019లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 86 శాతం (151) అసెంబ్లీ సీట్లను, 88 శాతం (22) పార్లమెంట్ స్థానాలను గెలుచుకున్నది. ఇటువంటి భారీ విజయాల సందర్భాన్ని వేవ్‌గా, ప్రభంజనంగా పేర్కొంటారు. ప్రభంజనం ఉన్న సందర్భాల్లో ఔత్సాహిక సర్వే సంస్థలు సైతం విజేతను సరిగ్గానే ఊహిస్తాయి. సీట్ల సంఖ్యను చెప్పడంలో ప్రొఫెషనల్ సంస్థలు కొంతమేరకు దగ్గరగా రావచ్చు. ఇటువంటి సందర్భాల్లో కూడా సీట్ల సంఖ్యను పక్కనబెట్టి అసలు విజేతనే తప్పుగా ఊహించేవాడు ఎవడైనా ఉంటాడా? ఒక్కడున్నాడు. వాడే సీ-వోటర్. ముందస్తు సర్వేలో వైసీపీకి 10 సీట్లు, టీడీపీకి 15 సీట్లు వస్తాయని రిపోర్టు ఇచ్చాడు. పోలింగ్ జరిగిన రోజు ఎగ్జిట్ పోల్‌లో కొద్దిగా సవరించి వైసీపీకి 11, టీడీపీకి 14 ఇచ్చాడు. వాస్తవ ఫలితం తెలిసిందే. వైసీపీకి 22, టీడీపీకి 3 సీట్లు వచ్చాయి. ఆ మూడు సీట్లను కూడా పదివేల లోపు ఓట్ల తేడాతోనే టీడీపీ గెలిచింది. అంత వేవ్‌ను అంచనా వేయలేకపోతే అది ఒక ప్రొఫెషనల్ సంస్థగా పని చేయడం తగునా?
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో జరిగిన ఎన్నికలను పరిశీలిద్దాం. పోలింగ్ ముగిసిన రోజున సీ-వోటర్ సంస్థ ప్రెస్‌మీట్ పెట్టి తెలుగుదేశం 160 సీట్లు గెలవబోతున్నదని ప్రకటించింది. వాస్తవానికి ఆ ఎన్నికల్లో టీడీపీకి 47 అసెంబ్లీ సీట్లు మాత్రమే దక్కాయి. ప్రొఫెషనల్ సంస్థ చేసే సర్వే ఇంత దారుణంగా వికటిస్తుందా? వచ్చే ఎన్నికలకు సంబంధించి గడిచిన నెల రోజుల్లో 13 సర్వేలు వచ్చాయి. అందులో పన్నెండు సర్వేలు వైసీపీ గెలుస్తుందని చెప్పాయి. టీడీపీ గెలుస్తుందని అంచనా వేసినవాడు మళ్లీ ఒకే ఒక్కడు. వాడే సీ-వోటర్.




vardhelli1959@gmail.com

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

కమ్యూనిస్టు విప్లవయోధుడు

కమ్యూనిస్టు విప్లవోద్యమ అగ్రనాయకుల్లో ఒకరైన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి (టీఎన్) జన్మించి ఈ ఫిబ్రవరి 11 నాటికి 107 సంవత్సరాలు. భారత విప్లవ రాజకీయరంగంలో 35 ఏళ్లకు పైగా వెలుగొంది పీడిత ప్రజల హృదయాలలో ఆయన శాశ్వత స్థానం సంపాదించారు. తరిమెల నాగిరెడ్డి 1917లో అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో పుట్టారు. తాను భూస్వామ్య కుటుంబంలో జన్మించినా దేశంలో కొనసాగుతున్న ఫ్యూడల్ దోపిడీ వ్యవస్థను భూస్థాపితం చేయటానికి, సమ సమాజ స్థాపనకు తన సర్వస్వాన్నీ అర్పించి దేశవ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందారు. టీఎన్ ఎమర్జన్సీ కాలంలో వెంకట్రామయ్య అనే మారు పేరుతో ఉస్మానియా ఆసుపత్రిలో చేరి 1976 జూలై 28న అమరులైనారు. తన విద్యార్థి దశలోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో చదువుతూ కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. చదువు అయిన వెంటనే కార్మిక, కర్షకుల కొరకు ఉద్యమించారు. 1940లో 'యుద్ధం- దాని ఆర్థిక ప్రభావం' అనే పుస్తకాన్ని ప్రచురించి ఏడాది కఠిన కారాగారశిక్షను అనుభవించారు.

కా॥ టీఎన్ చక్కని వక్త. అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఆయన ఉపన్యాసాలను అధికార, ప్రతిపక్ష సభ్యులు శ్రద్ధతో వినేవారు. కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ)తో కలిసి మనదేశ పీడిత ప్రజల విముక్తికి అవసరమైన సరైన విప్లవపంథాను రూపకల్పన చేయడంలో, ఈ పంథాను దేశమంతటా వ్యాపింప చేయటంలో చరిత్రాత్మకమైన పాత్రను నిర్వహించారు. ఈ క్రమంలో ఆయనపైనా, మరో 60 మందిపైనా పెట్టిన కుట్రకేసు విచారణ సందర్భంగా జైలులో ఉన్నప్పుడు (1970–72) ఆయన ప్రస్తుత భారత ఆర్థిక వ్యవస్థపై 'తాకట్టులో భారతదేశం' అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. దానిని కోర్టులో ఒక ప్రకటన రూపంలో చదివారు. ఆ పుస్తకంలో ఆయన చేసిన నిర్ధారణలు నేటికీ అక్షర సత్యాలే.



కా॥ తరిమెల నాగిరెడ్డి

1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తన బావ నీలం సంజీవరెడ్డిని ఓడించి అనంతపురం శాసనసభ్యునిగా తొలిసారిగా ఎన్నికయ్యారు. 35 ఏళ్ళ వయస్సులోనే మద్రాసు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునిగా తన రాజకీయ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించారు. 1969 మార్చిలో తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి అసెంబ్లీలో సంచలనాత్మకమైన ఉపన్యాసాన్ని ఇచ్చారు. పాలకవర్గాలు దేశాన్ని విదేశీ పెట్టుబడిదారులకు తాకట్టు పెడ్తూ వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే విధానాలనూ, భూస్వాముల ప్రయోజనాలనూ పరిరక్షించే విధానాలను అనుసరిస్తున్నాయనీ అన్నారు. దేశాభివృద్ధి కంటే రక్షణ చర్యలకే ప్రాధాన్యతనిస్తూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాన్ని నివారించే చర్యలను అసెంబ్లీ, పార్లమెంటులు చేపట్టకుండా ఈ సంక్షోభ తీవ్రతను మరింతగా పెంచే విధానాలను అవలంబిస్తున్నాయనీ అన్నారు.

ఆయన భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రవేశించిన మితవాద, అతివాద, అవకాశవాదాలకూ, తప్పుడు ధోరణులకూ వ్యతిరేకంగా డీవీతో కలిసి రాజీలేని పోరాటం నిర్వహించి సరైన విప్లవ పంథాను పరిరక్షించారు. ఈ క్రమంలోనే 1975లో కా॥ డీవీతో కలిసి యూసీసీఆర్ (ఎమ్ఎల్)ను స్థాపించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా కా॥ టీఎన్ తన జీవితకాలమంతటా అత్యున్నత విప్లవ ప్రమాణాలను పాటించారు.

– సి. భాస్కర్, యూసీసీఆర్ (ఎమ్ఎల్)
(నేడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి జయంతి)

ప్రాప్తి సూత్రం

పాలసముద్రం మధ్య ఏర్పడిన లంకలో ఉన్నది ఒక కొంగ. అది సామాన్యమైన కొంగ కాదు. శ్రీ విష్ణుమూర్తి నాభి కమలం నుంచి ఉద్భవించిన బ్రహ్మదేవునికి వాహనమైన హంసకు మిత్రురాలు. అయినప్పటికీ 'ఓహో ఇది నా వాహనమైన హంసకు మిత్రురాలు కదా, దీనికి క్షీరసముద్రంలోని క్షీరాన్ని ఆహారంగా చేద్దా'మన్న' ఆలోచన చెయ్యలేదు బ్రహ్మదేవుడు. అన్ని కొంగలకు లాగానే దానికి కూడా నత్తగుల్లలనే ఆహారంగా చేసి యథావిధిగా దాని పొడువాటి ముక్కుతో వాటిని పట్టి పొట్టలో వేసుకుని ఆకలి తీర్చుకునేట్టు చేశాడు. అలా ఒకవేళ కొంగలను తీసుకెళ్ళి క్షీరసాగరంలో పడేసినా వాటికి ఆహారంగా నత్తగుల్లలే పనికొస్తాయిగాని, చుట్టూ పుష్కలంగా ఉన్న పాలు కాదని చెబుతూ 'క్షీరాబ్ధిలంకలో చేరినప్పటికీ, కొంగ తిండికి నత్తగుల్లలే కదా!' అని మనకు ఒక సామెత పుట్టింది. బ్రహ్మదేవుడు నిర్దేశించిన ఈ సంగతిని దృష్టిలో ఉంచుకునే చామర్తి శేషగిరి అనే కవి తాను రచించిన 'నమశ్శివాయ శతకము' లోని ఈ క్రింది పద్యంలో 'ప్రాప్తి సూత్రము' అనే పదబంధం ద్వారా ఒక మంచి విషయాన్ని చెప్పాడు:

గీ. ఎంత దొరనాశ్రయించిన నేమి? తనదు / ప్రాప్తి సూత్రంబు కొలది సంభవము గాంచు
నజుని మోపరి హంసకేమయ్యె భుక్తి / మథితగజదనుజాయ నమశ్శివాయ!

పద్యంలో చెప్ప తలపెట్టిన భావం పరిధి చాలా విశాలమైనదైనపుడు, అందుకు సరితూగే మాటలను ఒక్కొకపుడు కవికి తానే నూతనంగా రూపకల్పన చేసుకోవాల్సిన అవసరం కలుగుతుంది. 'ప్రాప్తి సూత్రము' అనే జోడు మాటల పదబంధం ఈ అవసరంతో రూపకల్పన చేసినదే! ఒక వ్యక్తికి ఏదైతే లభించేదిగా బ్రహ్మచే నిర్దేశించబడి ఉంటుందో అది ఆ వ్యక్తికి పుట్టడంతోటే బ్రహ్మ కల్పించిన 'ప్రాప్తి' అనబడుతుంది. అలా బ్రహ్మ లిఖితమైన 'ప్రాప్తి' నియమాన్ని దాటి ఎవరికీ ఏమీ సంభవించడం జరగదు. దానికి నిదర్శనం ఏమిటంటే, సాక్షాత్తూ బ్రహ్మదేవునికి వాహనమైన హంస, ఆహారంగా తామరతూండ్లలోని గుజ్జుతో సరిపెట్టుకొంటుంది. అది బ్రహ్మదేవుడు కల్పించిన నియమం. అందుకు తిరుగు ఉండదు. అలాగే ధనబలం, అధికారబలం పుష్కలంగా ఉన్న వాళ్ళ అండ ఒక్కటే సరిపోదు. ఆ అండతో సమకూరే లాభాన్ని అనుభవించే ప్రాప్తి ఉండాలి. అది లేనప్పుడు ఎంత పాకులాడినా ఏమీ ప్రయోజనం ఉండదు అని పై ఉదాహరణతో సారాంశంగా చెప్పబడింది.

జ్యోతిర్మయం

– భట్టు వెంకటరావు

ఇంతటి అభివృద్ధి ఇదే ప్రథమం

విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు

- ప్రభుత్వ పాఠశాలలను ఆధునికంగా తీర్చిదిద్దారు
- అంతర్జాతీయ ప్రమాణాలతో పేద పిల్లలకు విద్యనందిస్తున్నారు
- ఉపాధ్యాయుల సంక్షేమంలో ఏపీ భేష్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత
- గుంటూరులో 'జగన్ పాలన–ఉపాధ్యాయుల స్పందన'పై సదస్సులో వక్తలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే ఉపాధ్యాయుల సంక్షేమం భేషుగ్గా ఉందని పలువురు మేధావులు, విద్యావేత్తలు వెల్లడించారు. విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి.. ప్రభుత్వ పాఠశాలలకు జీవం పోసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'జగన్ పాలన–ఉపాధ్యాయుల స్పందన'పై శనివారం గుంటూరులో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతుంటే ఎల్లో మీడియా నిత్యం విష ప్రచారం సాగిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలను సకల హంగులతో తీర్చిదిద్దిన జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. కాగా లక్ష్మీపార్వతిని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ సదస్సులో బండ్లమూడి రోజారాణి, వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి, హైకోర్టు న్యాయవాది ప్రభాకర్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, జ్యోతిరెడ్డి, డి.తిరుపతిరెడ్డి, సాదం సత్యనారాయణ, పలువురు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై రూ.90 వేలు ఖర్చు

జాతీయ స్థాయిలో విద్యాభివృద్ధి కోసం వివిధ రాష్ట్రాలు ఒక్కో విద్యార్థిపై సగటున రూ.50 వేలు మాత్రమే ఖర్చు చేస్తున్నాయి. అదే మన రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.90 వేలు ఖర్చు చేస్తోంది. గతేడాది ఉపాధ్యాయులతోపాటు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా పంపిణీ చేసింది. దేశంలోని మరే రాష్ట్రం వేల కోట్ల రూపాయల విలువైన డిజిటల్ విద్యా ఉపకరణాలను ఉచితంగా ఇవ్వడం లేదు. ఐబీ సిలబస్‌లో చదువుకోవాలంటే ఏడాదికి రూ.నాలుగు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ప్రైవేటు స్కూళ్లు వసూలు చేస్తున్నాయి. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లలకు దీన్ని ఉచితంగా బోధించనుంది.

– వీవీఆర్ కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు


'జగన్ పాలన-ఉపాధ్యాయుల స్పందన' రాష్ట్రస్థాయి సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

ప్రభుత్వ పాఠశాలలు కొత్తరూపు సంతరించుకున్నాయి..

సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక వసతులతో కొత్త రూపు సంతరించుకున్నాయి. పేద పిల్లలకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం చదువులను అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వం ఉచితంగా చెప్పిస్తోంది. ఉపాధ్యాయులకు అత్యధిక వేతనాలు అందుతున్నాయి. ఆరేళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు కేరళలో రూ.2.6 లక్షలు, కర్ణాటకలో రూ.3 లక్షలు, తమిళనాడులో రూ.4.3 లక్షలు, తెలంగాణలో రూ.5.2 లక్షల వార్షిక వేతనాలు మాత్రమే ఉన్నాయి. అదే ఆంధ్రప్రదేశ్‌లో రూ.5.6 లక్షలు అందుతున్నాయి.

–మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బెటర్ ఏపీ కన్వీనర్

ఇంతటి అభివృద్ధి చరిత్రలో ఎప్పుడూ లేదు

గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు లేక ఆడపిల్లలు చదువులు మానేయాల్సిన దుస్థితిని చూశాం. వైఎస్ జగన్ వచ్చాక నాడు–నేడు ద్వారా జరిగిన అభివృద్ధి చరిత్రలోనే ఎన్నడూ జరగలేదు.

– ఆలపాటి రాధామాధవ్, అధ్యాపకుడు, గుంటూరు

జగన్‌ను గెలిపించుకోకుంటే ఈ సంక్షేమం ఆగిపోతుంది..

స్వాతంత్ర్యం వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను ఆధునికంగా తీర్చిదిద్దిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్కరే. పేదలకు అండగా నిలిచిన సీఎం జగన్‌కు ప్రజలందరూ అండగా నిలవాలి. ఆయనను గెలిపించుకోకుంటే ఈ సంక్షేమం ఆగిపోతుంది.

– డాక్టర్ పి.ముత్యం, ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, గుంటూరు

ప్రభుత్వ రంగాభివృద్ధితో ఉపాధ్యాయులకే ప్రయోజనం

నా 50 ఏళ్ల విద్యారంగ అనుభవంలో ఎన్నడూ ఇంతటి అభివృద్ధిని చూడలేదు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. దీనివల్ల ఉపాధ్యాయులకే ప్రయోజనం. మరింత మంది ఉపాధ్యాయులు అవసరమవుతారు.

– ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, డీన్, మహాత్మాగాంధీ కళాశాల, గుంటూరు

విద్యా రంగంపై రూ.74 వేల కోట్ల వ్యయం

విద్యారంగంపై ప్రభుత్వం రూ.74 వేల కోట్లు ఖర్చు చేసింది. వివిధ పథకాలతో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. డిజిటల్ విద్య, ట్యాబ్స్, ఐఎఫ్‌పీ, స్మార్ట్‌టీవీలతో ఆధునిక చదువులను అందుబాటులోకి తెచ్చారు. జగన్ పాలనలో రాష్ట్రంలో 12 వేల పీఈటీ, భాషా పండిట్లకు పదోన్నతులు కల్పించారు. 1998, 2008, 2018 డీఎస్సీల కింద మొత్తం 13,272 పోస్టులను భర్తీ చేశారు.

–టి.కల్పలతారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

'విద్య'లో అగ్రగామిగా ఏపీ

ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి



వైవీయూ: వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అన్నారు. విద్యా రంగంలో ఏపీ.. దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని చెప్పారు. శనివారం కడపలో జరిగిన డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నాలుగో వార్షికోత్సవ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగాలు, ఉపాధి పొందేలా విద్యా విధానంలో ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టామని.. పరిశ్రమలతో అనుసంధానం చేయించి నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా.. ఏపీలో విద్యా దీవెన అందిస్తూ విద్యార్థులు ఉన్నత విద్య చదివేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. డిగ్రీ ఆనర్స్ ప్రవేశపెట్టడంతో పాటు నాలుగో సంవత్సరం డిగ్రీకి సైతం విద్యా దీవెన వర్తింపజేసిందన్నారు. విద్యా రంగంలో తీసుకున్న సంస్కరణల కారణంగా గతంలో కంటే మూడు రెట్లు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు పెరిగాయని వివరించారు. ప్రవేశాల ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటైన నాలుగేళ్లలోనే ప్రగతి సాధించిందన్నారు. సమావేశంలో వైఎస్సార్ ఏఎఫ్‌యూ వీసీ బి.ఆంజనేయప్రసాద్, వైవీయూ వీసీ చింతా సుధాకర్, ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి, వైవీయూ రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'బలిమెల' నీటి పంపకంపై సమీక్ష

- సమావేశమైన ఆంధ్ర, ఒడిశా అధికారులు


సమావేశమైన ఇరురాష్ట్రాల అధికారులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): రానున్న వేసవిలో ఇరురాష్ట్రాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం లేకుండా ప్రస్తుతం ఉన్న నీటిని సమన్వయంతో వాడుకుందామని ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల అధికారులు నిర్ణయించారు. శనివారం బలిమెల కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. బలిమెల జలాశయంలో ప్రస్తుతం ఉన్న 47.7878 టీఎంసీల నీటిలో ఒడిశాకు 26.9510, ఏపీకి 20.8368 టీఎంసీలు కేటాయించారు. అలాగే గతేడాది జూలై నుంచి ఈ ఏడాది జనవరి వరకు 39.6683 టీఎంసీలు ఒడిశా, 45.7824 టిఎంసీలు ఏపీ వాడుకున్నాయి. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం బలిమెల నుంచి ఏపీకి రోజుకు 2300 క్యూసెక్కులు, ఒడిశాకు వెయ్యి క్యూసెక్కుల నీటిని వాడుకునేందుకు నిర్ణయించారు. ఏపీజెన్‌కో ఎస్ఈ ప్రశాంత్‌కుమార్, ఒడిశా పొట్టేరు ఇరిగేషన్, ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ అధికారులు, ఏపీ జెన్‌కో ఈఈ ప్రభాకరరావు, ఏడీఈ వెంకట మధు పాల్గొన్నారు.

భారీగా హరియాణ మద్యం స్వాధీనం


పట్టుబడిన అక్రమ మద్యం, వ్యక్తులను చూపుతున్న అడిషనల్ ఎస్పీ సుధాకర్


పులివెందుల రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల మండల పరిధిలోని కనంపల్లె గ్రామ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా హరియాణ రాష్ట్రానికి చెందిన 575 అక్రమ మద్యం బాటిళ్లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు..పులివెందుల అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి కదిరి–పులివెందుల రోడ్డులోని కనంపల్లె చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కదిరి వైపు నుంచి వస్తోన్న బొలేరో వాహనంలో రూ.5.50 లక్షలు విలువైన హరియాణకి చెందిన అక్రమ మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాగిపాటి మహబూబ్ బాషా, బండి శ్రీనాథరెడ్డి, చావిడి నాగరాజు, షేక్ సుభాన్, మాచిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, కంబటి హరికృష్ణ, బండి ఓబుళరెడ్డిని అదుపులోకి తీసుకుని బొలేరో, 750 ఎంఎల్ పరిమాణం ఉన్న 390 మద్యం బాటిళ్లు, 180 ఎంఎల్ ఉన్న 185 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో దీనీ ఇజ్‌తిమా ప్రార్థనలు


దీనీ ఇజ్ తిమా ప్రార్థనలకు హాజరైన భక్తులు

పెదకాకాని: రెండు రోజుల రాష్ట్రస్థాయి దీనీ ఇజ్‌తిమా ప్రార్థనలు గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు డాంగేనగర్ సమీపంలోని విశాల స్థలంలో ప్రారంభమయ్యాయి. శనివారం 50 వేల మందికిపైగా ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన మత పెద్దలు ఉదయం, సాయంత్రం ఖురాన్ సందేశం అందించారు. ఏర్పాట్లను రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ సలహాదారులు డాక్టర్ ఎస్ఎం.జియావుద్దీన్ తదితరులు పరిశీలించారు.

గాయపడిన చిరుత ఎస్వీ జూలో మృతి



తిరుపతి మంగళం/పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిరుత తిరుపతి ఎస్వీ జూపార్క్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. జూ క్యూరేటర్ సెల్వం తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 6వ తేదీన శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిరుతను మెరుగైన వైద్యం కోసం తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల(ఎస్వీ జూపార్క్)కు తీసుకొచ్చారు. దీనికి జూలోని సంజీవిని వైద్యశాలలో అన్ని విధాల వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలందించారు. అయినప్పటికీ చిరుత ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందింది. పోస్ట్‌మార్టం నిమిత్తం వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. సెప్టిసిమిక్ షాక్ అండ్ లైయామ్‌పోసర్‌కమ్ కారణంగా చిరుత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

భక్తులతో పోటెత్తిన గుణదల కొండ

- మేరీమాత పుణ్యక్షేత్రంలో 2వ రోజూ వైభవంగా శతాబ్ది ఉత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన విశ్వాసులు
- కొండ దిగువన ఘనంగా సమష్టి దివ్యబలి పూజ



సందేశం ఇస్తున్న బిషప్ విజయ కుమార్


గుణదల కొండకు పోటెత్తిన విశ్వాసులు

గుణదల (విజయవాడ తూర్పు): విజయవాడలోని గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం మరియ తల్లిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా విశ్వాసులు తరలివచ్చారు. దీంతో గుణదల కొండ భక్తులతో పోటెత్తింది. కొండ దిగువన ఉన్న బిషప్ గ్రాసి పాఠశాల ఆవరణలో ఉదయం సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయకుమార్ దైవ సందేశం ఇచ్చారు. స్త్రీలందరిలో పవిత్రురాలు గనుకనే దేవుడు ఆమె గర్భవాసాన జన్మించాడని తెలిపారు. లోక రక్షకుడైన క్రీస్తు ద్వారానే సర్వ మానవాళికి రక్షణ మార్గం లభించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో, పవిత్ర జీవితాన్ని గడపాలని కోరారు. అనంతరం విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులతో కలిసి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు.

చంద్రబాబు అంత నీచుడు భూమిపై లేడు

- ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం ఎలాంటి ప్రయత్నాలు బాబు చేయలేదు
- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి



గుంటూరు ఎడ్యుకేషన్: చంద్రబాబు వంటి నీచుడు, దుర్మార్గుడు భూమిపై ఎక్కడా ఉండబోరని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించకపోవడం శోచనీయమని, కేంద్రంలోని బీజేపీతో చెట్టపట్టాలేసుకుని తిరిగిన చంద్రబాబు ఈ విషయంలో ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. ఎన్టీఆర్ ఫొటోలు, విగ్రహాలకు దండలు వేసే అర్హత బాబుకు ఎక్కడిదని ప్రశ్నించారు. మహానాడు జరిగినప్పుడల్లా 'ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి' అనే తీర్మానం చేసి చెత్తబుట్టలో పడవేశారని మండిపడ్డారు. బాబుతో పొత్తు పెట్టుకున్న పవన్ వంటి తెలివి తక్కువ రాజకీయ నాయకుడు ఎక్కడా ఉండరని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చంద్రబాబు, ఎల్లో మీడియా అబద్ధాలతో దుష్ప్రచారాన్ని సాగిస్తున్నాయని చెప్పారు. సిద్ధాంతాలతో పాటు మానవత్వం లేని చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్థితిల్లోనూ నమ్మరాదన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారం కోసం బాబు ఎంతకైనా తెగిస్తాడని, ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీ నేతల కాళ్లు పట్టుకుని పొత్తుల కోసం పాకులాడుతున్నాడని చెప్పారు. ఢిల్లీలో బాబు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందం చేసుకున్న బాబు ఏపీలో అధికారం కోసం బీజేపీతో పొత్తు కోసం తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

తెల్లవారుజామున లారీ విధ్వంసం

- ముందు వెళ్తున్న గేదెల లారీని ఢీకొట్టి.. డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్న వైనం
- ఏడుగురు దుర్మరణం
- వీరిలో నలుగురు ప్రయాణికులు, మూడు వాహనాల డ్రైవర్లు
- 25 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ఘటన


నుజ్జునుజ్జయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

సాక్షి, అమరావతి/కావలి: డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ లారీ విధ్వంసం సృష్టించింది. ముందు వెళ్తున్న ఓ గేదెల లోడు లారీని మితిమీరిన వేగంతో బలంగా కొట్టింది. ఆ తర్వాత అదుపు తప్పి రోడ్డు డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో బస్సులోని నలుగురు ప్రయాణికులు, మూడు వాహనాల డ్రైవర్లు ఉన్నారు. మరో 25 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. మూడు వాహనాలు నుజ్జునుజ్జు కావడంతోపాటు ఆ ప్రాంతమంతా రక్తసిక్తమై భయానకంగా మారింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి సమీపంలో చెన్నై–కొల్‌కతా జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగింది. కావలి రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాసరావు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి..

హైదరాబాద్ నుంచి నాయుడుపేటకు గేదెల లోడుతో ఓ లారీ వెళ్తోంది. కావలి మండలం ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి మితిమీరిన వేగంతో ఐరన్ రీల్స్ లోడుతో వస్తున్న కంటైనర్ లారీ గేదెల లారీని ఢీకొట్టింది. దీంతో గేదెల లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన డ్రైవర్ దీపక్(29) లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలోని ఒక గేదె, దూడ మరణించాయి. గేదెల లారీని ఢీకొన్న తర్వాత ఐరన్ రీల్స్ లారీ అదుపు తప్పి రోడ్డు డివైడర్ మీదుగా అవతలి వైపునకు దూసుకెళ్లింది.. అదే సమయంలో చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న 'వేమూరి కావేరి' ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు, ఐరన్ రీల్స్ లారీ ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటనలో నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెనుబర్తికి చెందిన ఐరన్ రీల్స్ లారీ డ్రైవర్ సొంటి వేణు (22) వాహనంలోనే ఇరుక్కుపోయి మృతి చెందాడు. అలాగే చెన్నైకి చెందిన బస్సు డ్రైవర్ మునుస్వామి తంబియార్ (35)తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన కొప్పాడి తంబిస్వామి (40) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన హైదరాబాద్‌కు చెందిన వివాహిత అట్టల్ రూప(39), నరసాపురం ప్రాంతానికి చెందిన అంజూరి సురేష్ (33) నెల్లూరు జీజీహెచ్‌లో, గుర్తుతెలియని మరో ప్రయాణికుడు(40) కావలి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన 25 మంది ప్రయాణికులు నెల్లూరు, ఒంగోలు, కావలి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో విధుల్లో ఉన్న రూరల్ సీఐ శ్రీనివాసరావు ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అత్యవసర చర్యలు చేపట్టారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్ దిగ్భ్రాంతి

నెల్లూరు జిల్లా కావలి–ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంపై గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కుంభకర్ణుడి వారసుడు మీ బాబే!

ఇనాం భూముల సమస్యను పరిష్కరించింది వైఎస్ జగన్

- పచ్చకళ్లతో నిజాలు చూడలేక ఈనాడు రామోజీ విషపు రాతలు
- 2019లో ఎన్నికలకు ముందు హడావుడిగా చంద్రబాబు ఆర్డినెన్స్
- దేవాలయ, గ్రామ సర్వీస్ ఇనాం భూములకు తేడా తెలియకుండా అడ్డగోలుగా జారీ
- లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిన ఘనత చంద్రబాబుది
- 1.79 లక్షల సర్వీసు ఈనాం భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించిన సీఎం జగన్
- భూముల వ్యవస్థలో జగన్ విప్లవం సృష్టిస్తే సైంధవులంటారా?



సాక్షి, అమరావతి: ఇనాం భూముల సమస్యను పరిష్కరించి లక్షలాది ఎకరాల భూములపై నిషేధం తొలగించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఈనాడు తన అక్కసు వెళ్లగక్కింది. చంద్రబాబు అసమర్థతను కప్పిపుచ్చుతూ తప్పుడు కథనాన్ని వండి వార్చింది. పచ్చకళ్లతో నిజాలు చూడకుండా వివాదాస్పద భూములకు హక్కులు కల్పించిన వైఎస్ జగన్‌ను కుంభకర్ణుడి వారసుడంటూ అసత్యాలు వల్లెవేస్తూ.. భూముల సమస్యలను పరిష్కరించలేక రైతులను నట్టేట ముంచిన చంద్రబాబును మాత్రం పేదల పెన్నిధి అంటూ ఆకాశానికెత్తారు. అసలు గ్రామ సర్వీస్ ఇనాం భూముల సమస్యను పరిష్కరించలేక చేతులెత్తేసింది చంద్రబాబు కాదా? ఆ విషయం రామోజీకి, ఈనాడుకు తెలియదా? ఓట్ల కోసం ఎన్నికలకు రెండు నెలల ముందు పనికిరాని ఆర్డినెన్స్ చేసి రైతులను ఇబ్బందుల్లోకి నెట్టిన చంద్రబాబు అసమర్థత ఆ పత్రికకు కనిపించలేదా? ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించలేకపోయిన బాబును వదిలి ఆ సమస్యను పరిష్కరించిన వైఎస్ జగన్‌ను ఆడిపోసుకోవడం, కుంభకర్ణుడి వారసుడు, సైంధవుడంటూ ఇష్టానుసారం రాయడం దుష్టచతుష్టయంలో ఒకరైన రామోజీకే చెల్లింది.

ఆర్డినెన్స్ పేరిట బాబు డ్రామాలు

1956 ఏపీ (ఆంధ్ర ప్రాంత) ఇనామ్స్ (ఎబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్ టు రైత్వారీ) చట్టం ప్రకారం రైత్వారీ భూములు, అవి వ్యక్తిగతంగా ఉంటే రైతులు, వారి వారసులకు.. లేదంటే కౌలుదారులకు హక్కులను గుర్తించి రైత్వారీ పట్టాలు ఇవ్వవచ్చు. దేవదాయ శాఖ భూములైతే దేవాలయం పేరిట రైత్వారీ పట్టాలు మంజూరు చేయవచ్చు. ఆ చట్టం దుర్వినియోగం అవుతుండడంతో పాటు అందులో లోపాలు ఉన్నాయని గుర్తించారు. అలాగే కోర్టు ఆదేశాలతో 2013లో అప్పటి ప్రభుత్వం యాక్ట్–16 ఆఫ్ 2013 చట్టం చేసింది. దీని ప్రకారం దేవాలయ భూములను వ్యక్తులకు, దేవాలయానికి సేవలు చేసే వారికి ఇస్తే అవి రద్దయ్యాయి. ఆ భూముల క్రమవిక్రయాలు.. వారికి సంబంధించిన రైత్వారీ పట్టాలు రద్దు చేశారు. కులవృత్తుల వారికి కేటాయించిన ఇనాం భూముల రైత్వారీ పట్టాలు కూడా పొరపాటున రద్దయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ సమస్యను పరిష్కరించలేకపోయారు. 2019లో ఎన్నికలకు రెండు నెలల ముందు ఆ సమస్యను పరిష్కరిస్తున్నట్లు ఆర్డినెన్స్ తీసుకొచ్చి చేతులు దులుపుకున్నారు.

1.79 లక్షల ఎకరాల భూములపై ఆంక్షల తొలగింపు

వైఎస్ జగన్ ప్రభుత్వం ముందుచూపుతో దేవాలయ భూములు, చారిటబుల్ భూములు, ఇనాం భూములు, గ్రామ సర్వీసు ఈనాం భూములను విడదీసింది. ప్రస్తుత చట్టాల ప్రకారం గ్రామ సర్వీసు ఇనాం భూములకు, గతంలో మంజూరు చేసిన రైత్వారీ పట్టాలకు జీఓ ఎంఎస్ నెం–310 ద్వారా గత సంవత్సరం చట్టబద్ధత కల్పించారు. దేవదాయ భూములకు, గ్రామ సర్వీసు ఇనాం భూములకు వ్యత్యాసాన్ని గుర్తించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమవగా దాన్ని ఈ ప్రభుత్వం సరిచేసింది. దీనివల్ల 1.79 లక్షల ఎకరాల సర్వీసు ఇనాం భూములపై ఆంక్షలు తొలగాయి. అంతేకాదు దేవదాయ ఇనాం భూములు, ఇన్‌స్టిట్యూషనల్ ఇనాం భూములు, చారిటబుల్ ఇనాం భూములు, గ్రామ సర్వీసు ఇనాం భూముల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా వివరించింది. దీనివల్ల సంవత్సరాలుగా వివాదంలో ఉన్న భూముల సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇనాం భూములే కాదు చుక్కల భూములు, షరతుల గల పట్టా భూముల, ఇతర అనేక రకాల భూముల సమస్యను వైఎస్ జగన్ ప్రభుత్వం చాకచక్యంగా పరిష్కరించింది. 3 లక్షల ఎకరాలకు పైగా భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి సంబంధిత రైతులకు మేలు చేకూర్చింది. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడంతో 27 లక్షల ఎకరాలకు చెందిన రైతులు లబ్ధి పొందారు. కళ్ల నిండా పచ్చ విషం నింపుకున్న రామోజీరావుకు, ఆయన పత్రికకు ఇవేమీ కనపడలేదు. అందుకే పచ్చపాతంతో అసత్య కథనాలు అచ్చేసింది. పేదల పక్షపాతిని కాదని.. సైంధవుల పక్షపాతినని, కుంభకర్ణుడికి అసలు సిసలు వారసుడినని రామోజీరావు మరోసారి ఈ కథనం ద్వారా నిరూపించుకున్నారు.

ఈపీఎఫ్ వడ్డీ రేటు 8.25 శాతం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) కీలక నిర్ణయం తీసుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ఖాతాల్లో డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటు చెల్లించాలని నిర్ణయించింది. 2020-21 తర్వాత ఇదే అత్యధిక వడ్డీ రేటు! ''వడ్డీ రేటును సవరిస్తూ శనివారం ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ట్రస్టీలు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖకు ప్రతిపాదించారు'' అని కేంద్ర కార్మిక శాఖ వెల్లడించింది. చందాదారులకు అందుబాటులో ఉన్న ఇతర పెట్టుబడి మార్గాలతో పోలిస్తే ఈపీఎఫ్‌వో వడ్డీ రేటు ఎక్కువని పేర్కొంది. ఆర్థిక శాఖ ఆమోదం రాగానే సవరించిన వడ్డీ మొత్తాన్ని చందాదారుల ఖాతాల్లో జమ చేస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులు ఉన్నట్టు కార్మిక శాఖ వర్గాలు వెల్లడించాయి. 2019-20, 2020-21ల్లో ఈపీఎఫ్‌వో వడ్డీ రేటు 8.5 శాతం ఉంది. ఆ తర్వాతి సంవత్సరానికి దీనిని 8.1 శాతానికి కుదించారు. గత నాలుగు దశాబ్దాల్లో ఇదే కనిష్టం! అంతకు ముందు 1977-78లో వడ్డీ రేటు 8 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో 8.15 శాతం వడ్డీ రేటు చెల్లించారు.

వాసనలోనూ మర్మాలెన్నో..



సప్తవర్ణశోభిత పుష్పజాతుల వనంలో విహరిస్తే మన ముక్కుపుటాలను తాకే సువాసనలెన్నో. చూస్తే మనుషుల మనసుల్ని తేలికపరిచే పువ్వులేకాదు మనుషులు సైతం చాలా ప్రత్యేకమైన వాసనలను వెదజల్లుతారని శాస్త్రాలు చెబుతున్నాయి. నానా రకాల వృత్తుల్లో, వాతావరణాల్లో మసలే మనుషులు వేర్వేరు దుర్వాసనల కంపు కొట్టడంలో కొత్తేముందని అనుకోవచ్చు. కానీ ఆ వాసనల్లోనే ఆరోగ్య రహస్యాలు, అనారోగ్యం బారిన పడబోతున్నామనే హెచ్చరించే ముందస్తు సంకేతాలు దాగున్నాయని పరిశోధకులు గుర్తించారు. మనకు మేలు చేసే ఎన్నో సూక్ష్మజీవుల రకాలకు మన శరీరం ఆలవాలం. వేర్వేరు చోట్ల నుంచి గ్రంథులు వెలువర్చిన స్రావాలతో ప్రతిచర్య జరిపిన సూక్ష్మజీవులు సరికొత్త రసాయనిక వ్యర్థాలను విడుదల చేస్తాయి. అవన్నీ చర్మ గ్రంథుల స్రావాలతో కలిసిపోయి చెమట రూపంలో బయటికొస్తాయి. ఈ చెమటలో దాదాపు 500 రకాల రసాయనాలు ఉంటాయని పరిశోధనల్లో తేలింది. మనిషి అనారోగ్యంగా ఉంటే ఆ మనిషి చెమట, శ్వాస ద్వారా వ్యక్తమయ్యే వాసన విభిన్నంగా ఉంటుంది. ఆ వాసనే మన ఆరోగ్య, అనారోగ్య వివరాలను చెప్పేస్తుందని ఐర్లాండ్‌లోని డబ్లిన్ సిటీ విశ్వవిద్యాలయంలోని అనలైటికల్ కెమిస్ట్రీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్, పరిశోధకులు అయోఫీ మోరిన్ వ్యాఖ్యానించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గ్రీకుల కాలంలోనే ఉందట!

''మనం అనారోగ్యంగా ఉంటే మన నుంచి వెలువడే వాసన అంతకుముందు కంటే వేరుగా ఉంటుందట. గ్రీకుల కాలంలో వైద్యులు ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వారి వాసన చూసి ఆరోగ్యపరిస్థితి విషమించిందో లేదో చెప్పేవారు. శ్వాసను బట్టే కాలేయ వైఫల్యాన్ని కనిపెట్టేవారు. అతను నుంచి తీయని, ఫలాల వాసన వస్తుంటే చక్కెరవ్యాధి బారిన పడ్డట్లు లెక్క. ఇదే విషయాన్ని 1971లో నాటి నోబెల్ అవార్డు గ్రహీత, రసాయన శాస్త్రవేత్త లీనస్ పౌలింగ్ వెల్లడించారు. శ్వాస ద్వారా 250 రకాల వాయువులు వెలువడతాయని పేర్కొన్నారు. ఈ వాయు రసాయనాలనే వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ (వీఓసీ) అంటారు. వీఓసీలు ఉంటాయని పౌలింగ్ కనిపెట్టాక ఈ దిశలో పరిశోధనలు చేసిన ఇంకొందరు శాస్త్రవేత్తలు వందలాది వీఓసీలను గుర్తించగలిగారు. వీటిలో కొన్ని వాసన వస్తాయి. కొన్ని అస్సలు రావు. కానీ వాటిని పీల్చినపుడు తేడాను ముక్కు కనిపెట్టగలదు''

రోగాన్ని నర్సు కనిపెట్టిన వేళ

''స్కాట్లాండ్‌లో ఒక పెద్దాయనకు పార్కిన్సన్ వ్యాధి సోకింది. అయితే ఆయన నుంచి వెలువడే వాసనలో ఏదో తేడా ఉందని అతని భార్య, రిటైర్డ్ నర్సు జోయ్ మిల్నర్ గుర్తించి పరీక్షలు చేయించింది. దీంతో అతనికి పార్కిన్సన్ ఉందని 2005లో బయటపడింది. దీంతో పార్కిన్సన్ వ్యాధిగ్రస్తులు ప్రత్యేకమైన వాసనను వెదజల్లుతారని గుర్తించి, ఆ దిశగా చేసే పరిశోధనల్లో నర్సు జోయ్‌ను భాగస్వామురాలిని చేశారు. శునకాలకు సైతం వాసనలను గుర్తించే అమోఘమైన శక్తి ఉన్నా ఆ వాసన ఏ రోగానికి చెందినదని గుర్తించే స్థాయిలో పరిశోధనలు జరగలేదు''

సాయపడుతున్న అనలైటికల్ టూల్ మాస్ స్పెక్ట్రోమీటర్

''ఈ దిశగా చేసే పరిశోధనలకు అనలైటికల్ టూల్ మాస్ స్పెక్ట్రోమీటర్ సాయపడుతోంది. చెమటలోని పోషకాలను వాడుకున్న బ్యాక్టీరియా అందులో ఇంకొన్ని సూక్ష్మజీవులను పెంచడంతో ఆ చెమట ప్రత్యేకమైన వాసనను సంతరించుకుంటుంది. అందుకే చర్మ వీఓసీలపైనే పరిశోధనలను ముమ్మరం చేశాం. కణాల రోగాల బారిన పడకుండా మంచి బ్యాక్టీరియా, మానవ కణాలు ఎలా సమన్వయంతో పనిచేస్తాయన్న దానిపైనా పరిశోధనలు చేస్తున్నాం'' అని పరిశోధకులు అయోఫీ మోరిన్ చెప్పారు.

దాడిలో భారత సంతతి వ్యక్తి మృతి



వాషింగ్టన్: అమెరికాలో భారత సంతతికి చెందిన మరో వ్యక్తి చనిపోయారు. డైనమో టెక్నాలజీ వ్యవస్థాపకుడు వివేక్ తనేజా(41)పై ఈ నెల 2వ తేదీన వాషింగ్టన్‌లోని అధ్యక్ష భవనం వైట్ హౌస్‌కు కొద్ది దూరంలో ఉన్న ఓ రెస్టారెంట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. దుండగుడు కిందపడిపోయిన తనేజా తలను పేవ్‌మెంట్‌కేసి బలంగా మోదడంతో ఆయన తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పోలీసులు తనేజాను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 7వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి 25 వేల డాలర్ల రివార్డు ప్రకటించారు. డైనమో సంస్థ అమెరికా ప్రభుత్వానికి టెక్నాలజీ సొల్యూషన్స్, అనలైటిక్స్ ప్రొడక్ట్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తోంది.

త్వరలో పంజాబ్ ఎంపీ అభ్యర్థులు: కేజ్రీవాల్

చండీగఢ్: పంజాబ్‌తోపాటు కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను పక్షం రోజుల్లో ప్రకటిస్తామని ఆ పార్టీ అగ్ర నేత కేజ్రీవాల్ ప్రకటించారు. పంజాబ్‌లోని ఖన్నాలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. రెండు నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు గాను పంజాబ్‌లోని 13, చండీగఢ్‌లోని ఒక సీటు కలిపి మొత్తం 14 సీట్లకు ఆప్ అభ్యర్థుల పేర్లను రెండు వారాల్లో ప్రకటిస్తామని చెప్పారు. పంజాబ్‌ను దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్, అకాలీదళ్ పార్టీలు చెప్పుకోదగ్గ ఒక్క పనీ చేయలేదని విమర్శించారు.

ఆస్పత్రిలో చేరిన మిథున్ చక్రవర్తి

కోల్‌కతా: సీనియర్ బాలీవుడ్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి(73) కోల్‌కతాలోని ఆస్పత్రిలో చేరారు. ఛాతీలో తీవ్రమైన నొప్పి రావడంతో శనివారం ఉదయం 10.30 గంటల ఆయన ఆస్పత్రిలో చేరారు. ఎంఆర్‌ఐ, ఇతర పరీక్షలు జరిపినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. హిందీ, బెంగాలీ, ఒడియా, భోజ్‌పురి, తమిళ తదితర భాషల్లో 350కి పైగా చిత్రాల్లో నటించిన మిథున్ చక్రవర్తిని ప్రభుత్వం దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మభూషణ్‌తో సత్కరించింది.

చిత్రకారుడు రామచంద్రన్ కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రఖ్యాత చిత్రకారుడు ఎ.రామచంద్రన్ శనివారం కన్నుమూశారు. ఆయన వయస్సు 89 ఏళ్లు. కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న రామచంద్రన్ ఉదయం 9 గంటల సమయంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు రాహుల్ చెప్పారు. అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు లోధి రోడ్డులోని శ్మశాన వాటికలో జరుగుతాయని తెలిపారు. కేరళలోని అట్టింగల్‌లో 1935లో జన్మించిన రామచంద్రన్ అసలు పేరు అచ్యుతన్ రామచంద్రన్ నాయర్. రంగురంగుల ఆయిల్, వాటర్ కలర్ చిత్రాలెన్నిటికో ప్రాణం పోశారు. 2002లో లలిత కళా అకాడమీ ఫెలోగా ఎన్నికయ్యారు. కేంద్రం 2005లో రామచంద్రన్‌ను పద్మభూషణ్‌తో సత్కరించింది.

ఈశ్వరప్ప 'కాల్చివేత' వ్యాఖ్యల వివాదం

బెంగళూరు: దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని, ఇది ఇలాగే కొనసాగితే దక్షిణాదికి ప్రత్యేక దేశ డిమాండ్లు రావొచ్చేమో అని వ్యాఖ్యానించిన బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్‌పై కర్ణాటక బీజేపీ సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప మండిపడ్డారు. దావణగెరెలో గురువారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడారు. ''దక్షిణభారత దేశం వేరే దేశంగా ఉంటే మంచిదంటూ వ్యాఖ్యలు చేసిన దేశ ద్రోహులు డీకే శివకుమార్, వినయ్ కులకర్ణిలను కాల్చి చంపేలా ఒక చట్టం తేవాలని ప్రధాని మోదీని వేడుకుంటున్నా''అని అన్నారు. డీకే సురేశ్ ధీటుగా స్పందించారు. 'ఎవరైనా నన్ను ఎందుకు షూట్ చేయాలి? ఈశ్వరప్ప టైమిస్తే నేనే ఆయన ఎదుటకు వెళ్తా. ఇది కన్నడిగుల భూమి'అని పేర్కొన్నారు. 'నాకోసం వెదకొద్దు. వారంలోగా నేనే మీ ముందుకు వస్తా. కాల్చుతారా? పాడుస్తారా? నిర్ణయించుకుని సిద్ధంగా ఉండండి'అని సురేశ్ పేర్కొన్నారు. దావణగెరె పోలీసులు ఈశ్వరప్పపై కేసు నమోదు చేసి, నోటీసు జారీ చేశారు.

ఎన్నికలకు ముందే సీఏఏ

త్వరలో నిబంధనలు: అమిత్ షా

- లౌకిక దేశంలో మతాధార చట్టాలకు తావులేదన్న హోం మంత్రి
- ముస్లింలను కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తోందంటూ మండిపాటు



న్యూఢిల్లీ: పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల నుంచి 2014కు ముందు వలస వచ్చిన ముస్లిమేతర మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ (సవరణ) చట్టాన్ని లోక్‌సభ ఎన్నికలకు ముందే అమల్లోకి తెస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దాని అమలుకు సంబంధించిన నియమ నిబంధనలను త్వరలోనే జారీ చేస్తామని తెలిపారు. ఈ విషయంలో ఎవరికీ అనుమానం అక్కర్లేదన్నారు. శనివారం ఈటీ నౌ గ్లోబల్ బిజినెస్ సమిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ వంటి లౌకిక దేశంలో మతాధారిత పౌర స్మృతులు ఉండేందుకు వీల్లేదని కుండబద్దలు కొట్టారు. ''పొరుగు దేశాల్లో ఊచకోతకు, మతపరమైన అణచివేతకు గురైన మైనారిటీలకు పౌరసత్వం కల్పిస్తామని అప్పట్లో కాంగ్రెస్ కూడా హామీ ఇచ్చింది. కానీ మత రాజకీయాల్లో భాగంగా తర్వాత దానిపై వెనక్కు తగ్గింది'' అని ఆరోపించారు. సీసీఏ ఎవరి పౌరసత్వాన్నీ రద్దు చేసేందుకు ఉద్దేశించిన చట్టం కాదని మంత్రి పునరుద్ఘాటించారు. ముస్లిం సోదరులను విపక్షాలు తప్పుదోవ పట్టిస్తూ కావాలనే సీఏఏకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. వివాదాస్పద సీఏఏ అమలు బీజేపీ గత ఎన్నికల ప్రధాన హామీల్లో ఒకటి. ముఖ్యంగా పశ్చిమబెంగాల్లో పార్టీ బలపడేందుకు ఇదెంతగానో దోహదపడిందని అగ్ర నాయకత్వం భావిస్తోంది. ఆ మేరకు 2019లోనే నరేంద్ర మోదీ సర్కారు సీఏఏ చట్టాన్ని తీసుకొచ్చింది. దానిపై దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు రేగడం, హింసాకాండలో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడంతో అమలు వాయిదా పడుతూ వచ్చింది.

రాజకీయ పొత్తుల విషయంలో 'ఫ్యామిలీ ప్లానింగ్'పై బీజేపీకి నమ్మకం లేదని అమిత్ షా చమత్కరించారు. ఎన్డీఏలోకి కొత్త భాగస్వాములను తామెప్పుడూ స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ''సంకీర్ణ ధర్మాన్ని బీజేపీ ఎన్నడూ తప్పదు. చాలా రాష్ట్రాల్లో మేం ఏకైక పెద్ద పార్టీ అయినా మా భాగస్వాములకే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమిచ్చాం'' అని గుర్తు చేశారు. ''భాగస్వాములను వదలుకోవడం మాకు అలవాటు లేదు. స్వీయ సమీకరణాల రీత్యా కొందరు ఎన్డీఏను వీడుతున్నారు'' అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఎలాంటి సస్పెన్సూ లేదని, మరోసారి విపక్షంలో కూర్చోబోతున్నట్టు కాంగ్రెస్‌కు కూడా అర్థమైపోయిందని అమిత్ షా అన్నారు. ''జమ్మూ కశ్మీర్లో ఆర్టికల్ 370ని రద్దు చేశాం. ఈసారి బీజేపీకి 370, ఎన్డీఏకు 400 పై చిలుకు లోక్‌సభ స్థానాలిచ్చి ప్రజలు ఆశీర్వదించడం ఖాయం'' అని ధీమా వెలిబుచ్చారు. దేశ విభజనకు కాంగ్రెసే ప్రధాన కారణమని మంత్రి మండిపడ్డారు. ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీకి భారత్ జోడో యాత్ర చేసే నైతిక అర్హతే లేదన్నారు. కొంతకాలంగా కాంగ్రెస్ నేతలు మళ్లీ దేశ విభజన గురించి మాట్లాడుతున్నారంటూ ఆ పార్టీ కర్ణాటక ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యలనుద్దేశించి దుయ్యబట్టారు. వాటిని కాంగ్రెస్ కనీసం ఖండించడం లేదంటూ ఆక్షేపించారు. యూపీఏ పదేళ్ల పాలన తాలూకు పాపాలను, వాటిని తమ పదేళ్ల పాలనలో కడిగేసిన తీరును ప్రజల ముందుంచేందుకే శ్వేతపత్రం తెచ్చామన్నారు. సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలన్న ఉద్ధవ్ ఠాక్రే తదితరుల సూచన తమ దృష్టికొచ్చిందని చెప్పారు.


మోదీపై ప్రేలాపనలు రాహుల్ నైజం

ప్రధాని మోదీ సామాజిక వర్గాన్ని ఓబీసీగా 1994లో గుజరాత్‌లో కాంగ్రెస్ సర్కారు, తర్వాత 2000లో కేంద్రంలో ఆ పార్టీ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వమే గుర్తించాయని అమిత్ షా గుర్తు చేశారు. అయినా మోదీ కులంపై రాహుల్ ఇప్పటికీ అనవసర ప్రేలాపనలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. పబ్లిగ్గా పచ్చి అబద్ధాలు చెప్పడం, వాటిని పదేపదే పునరుద్ఘాటించడం ఆయనకు నైజంగా మారిందన్నారు.

అఖండ భారత్‌కు ప్రతీక

అయోధ్య రామాలయంపై పార్లమెంటు తీర్మానం

- మన దేశ లౌకికత్వానికి ప్రతీక
- లోక్‌సభలో చర్చలో అమిత్ షా
- జన్మభూమికి దూరంగా కట్టారు
- రామాలయంపై కాంగ్రెస్ వాదన
- అఖిలపక్ష పరిశీలనకు డిమాండ్



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: అయోధ్య రామాలయాన్ని 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి పరిపూర్ణ ప్రతీకగా పార్లమెంటు అభివర్ణించింది. శనివారం ఈ మేరకు ఉభయ సభలు తీర్మానాలను ఆమోదించాయి. ఆలయ నిర్మాణం, రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ అంశంపై రాజ్యసభలో చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్ సభ లో స్పీకర్ ఓం బిర్లా తీర్మానాలు ప్రవేశపెట్టారు. ''శతాబ్దాల ఎదురుచూపుల అనంతరం సుపరిపాలన, ప్రజా సంక్షేమ రంగాల్లో నూతన శకానికి రామాలయ నిర్మాణం నాంది పలికింది. అది కేవలం రాళ్లు, ఇటుకలతో కూడిన నిర్మాణం కాదు. నమ్మకం, విశ్వాసాలతో నిండిన జాతి ప్రతీక. ఈ చారిత్రక క్షణాన్ని సాకారం చేయడంలో న్యాయవ్యవస్థ, పౌర సమాజం కూడా కీలక పాత్ర పోషించాయి'' అంటూ వారు కొనియాడారు. రామ మందిరంపై సుప్రీంకోర్టు తీర్పు దేశ లౌకికత్వ విలువలను ప్రతిఫలించిందని లోక్‌సభలో చర్చలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. మందిర నిర్మాణంలో సమాజంలోని అన్ని వర్గాలనూ ప్రధాని మోదీ భాగస్వాములను చేశారన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనూ మెజారిటీ సామాజిక వర్గం ఇలా తమ మత విశ్వాసాలకు సంబంధించిన అంశంపై ఇంతటి సుదీర్ఘకాలం ఎదురు చూడాల్సి రాలేదన్నారు. జనవరి 22న మందిర ప్రారంభంతో మహోన్నత భారత్ దిశగా గొప్ప ప్రయాణం మొదలైందని, మన దేశం విశ్వగురువుగా ఆవిర్భవించేందుకు దారులు పడ్డాయని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ఘనవిజయం సాధించి ప్రజల ఆకాంక్షలను మోదీ సర్కారు నెరవేరుస్తుందని చెప్పారు. చరిత్రాత్మక రథయాత్ర ద్వారా ఆలయ నిర్మాణంలో బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే ఆడ్వాణీ కూడా కీలక పాత్ర పోషించారని అమిత్ షా గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ చర్చ అనంతరం తీర్మానాలు సభలు ఆమోదం పొందాయి.

జన్మస్థలికి వందల మీటర్ల దూరంలో ఆలయ నిర్మాణం: కాంగ్రెస్

అయోధ్య రామాలయంపై కొత్త చర్చకు కాంగ్రెస్ తెర తీసింది. రామ మందిర నిర్మాణంపై రాజ్యసభ చేపట్టిన స్వల్ప వ్యవధి చర్చ ఇందుకు వేదికైంది. రాముని అసలు జన్మస్థలికి కొన్ని వందల మీటర్ల అవతల ఆలయాన్ని నిర్మించారని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అన్నారు. కావాలంటే దీనిపై పరిశీలనకు ఎంపీలతో అఖిలపక్ష బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణం పూర్తవకుండానే ప్రారంభించడం పూర్తిగా శాస్త్రవిరుద్ధమన్నారు. అసంపూర్తి ఆలయంలో పూజలు చేస్తే దేశానికే అరిష్టమని వాదించారు. పైగా ఆలయ ప్రారంభోత్సవంలో అన్ని నిబంధనలనూ యథేచ్ఛగా ఉల్లంఘించారని ఆయన ఆరోపించారు.

ఉభయసభలు నిరవధిక వాయిదా

పార్లమెంటు ఉభయసభలూ శనివారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. బడ్జెట్ సమావేశాలు ముగిసిన అనంతరం లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. 17వ లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు. ఈ ఐదేళ్లలో సభ 222 బిల్లులను ఆమోదించినట్టు స్పీకర్ తెలిపారు. ''అధికార, విపక్ష సభ్యులను నేనెప్పుడూ సమానంగానే చూశా. కాకపోతే సభ హుందాతనాన్ని, గౌరవాన్ని కాపాడేందుకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది.'' అని చెప్పుకొచ్చారు. మరోవైపు, రాజ్యసభ 263వ సమావేశాలు కూడా ముగిశాయని చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభలో ప్రకటించారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు.



శనివారం లోక్‌సభలో మాట్లాడుతున్న మోదీ

తరాల నిరీక్షణకు తెర

17వ లోక్‌సభలో కీలక నిర్ణయాలు: మోదీ

న్యూఢిల్లీ: పలు కీలకాంశాలపై దశాబ్దాల నిరీక్షణకు 17వ లోక్‌సభ తెర దించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతించారు. ఆర్టికల్ 370 రద్దు చేయడంతో పాటు చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిందని గుర్తు చేశారు. ''ఈ ఐదేళ్లూ రిఫార్మ్ (సంస్కరణలు), పెర్ఫామ్ (పనితీరు), ట్రాన్స్‌ఫార్మ్ (మార్పు) కాలంగా సాగాయి. దేశమంతటికీ ఒకే రాజ్యాంగముండాలన్న ప్రజల కలను నిజం చేశాం. మరెన్నో సవాళ్లను దీటుగా ఎదుర్కొని అధిగమించాం. దేశానికి సరైన దిశానిర్దేశం చేశాం. ఫలితంగా భారీ మార్పుల దిశగా అమిత వేగంతో భారత్ దూసుకుపోతోంది. ఈ ప్రయాణంలో సభ్యులంతా భాగస్వాములయ్యారు'' అంటూ కొనియాడారు. పలు కీలక సంస్కరణలతో బలోపేతమైన భారత్‌కు ఈ ఐదేళ్లలో పునాదులు వేశామని పేర్కొన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని అభినందిస్తూ పార్లమెంటు బడ్జెట్ సమావేశాల చివరి రోజైన శనివారం లోక్‌సభలో స్పీకర్ ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చలో ఆయన పాల్గొన్నారు. ''17వ లోక్‌సభకు ఇది చివరి పని దినం. గొప్ప మార్పులకు, నిర్ణయాలకు వేదికగా నిలిచిన 17వ సభను దేశం ఎప్పటికీ ఆశీర్వదిస్తూనే ఉంటుంది'' అని అభిప్రాయపడ్డారు. రామాలయ అంశంపై బీజేపీపై విపక్షాలు పదేపదే విమర్శలు చేస్తూ వచ్చాయంటూ మోదీ మండిపడ్డారు. ''వాస్తవమేమిటంటే ఇలాంటి గొప్ప బాధ్యతలను తలకెత్తుకుని పూర్తి చేసే సామర్థ్యం అందరికీ ఉండదు. చేతులెత్తేసి పారిపోతారు'' అంటూ చురకలు వేశారు. ''ఆలయ నిర్మాణంపై ఈ రోజు సభలో జరిగిన చర్చలు మన సహానుభూతికి, సున్నితత్వానికి, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అన్న మా ప్రభుత్వ దీక్షకు అద్దం పట్టాయి'' అన్నారు.

దేశ ఘనత పెంచనున్న ఎన్నికలు

రానున్న లోక్‌సభ ఎన్నికలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఘనతను మరింత పెంచుతాయని తనకు పూర్తి నమ్మకముందన్నారు. ''బ్రిటిష్ కాలం నాటి 'శిక్షాత్మక' చట్టాల స్థానంలో భారతీయ న్యాయ చట్టాలను తెచ్చాం. కరోనా సవాలును అధిగమించడంలో ప్రపంచ దేశాలకే భారత్ బాసటగా నిలిచింది. ప్రజల జీవితాల్లో ప్రభుత్వ జోక్యాన్ని వీలైనంతగా తగ్గించడమే ప్రజాస్వామ్య ప్రభుత్వ సామర్థ్యానికి గీటురాయి. 'కనీస ప్రభుత్వం, గరిష్ఠ పాలన' మన మూలమంత్రం'' అన్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 44 మంది మృతి

రఫా: ఈజిప్టు సరిహద్దుల్లోని గాజా దక్షిణ ప్రాంత పట్టణం రఫాపై శనివారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 44 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మూడు నెలల పసికందు సహా మొత్తం 13 మంది చిన్నారులున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం జరిగిన మరో దాడిలో రఫా సివిల్ పోలీస్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు ప్రాణాలు కోల్పోయారు. పూర్తి స్థాయిలో హమాస్ మిలిటెంట్ల ఏరివేతే లక్ష్యంగా రఫాను ఖాళీ చేయించాలంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తాజాగా ఆర్మీకి ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. గాజాలోని ఇతర ప్రాంతాల్లో ఇజ్రాయెల్ జరుపుతున్న భీకర దాడుల నుంచి ప్రాణాలర చేతబట్టుకుని సుమారు 15 లక్షల మంది ప్రజలు రఫాలో ఆశ్రయం పొందుతున్నారు. తాజాగా, ఇక్కడ సైతం దాడులు మొదలు కావడంతో వీరంతా దిక్కు తోచని స్థితిలో పడ్డారు.

రాజ్యసభలో ఉండే అర్హత మీకు లేదు

కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్‌పై చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ శనివారం కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎల్‌డీ చీఫ్ జయంత్ సింగ్‌పై చేసిన కొన్ని వ్యాఖ్యలను చైర్మన్ ధన్‌ఖడ్ ఆక్షేపించారు. 'మీకు ఈ సభలో ఉండే అర్హతే లేదు. మీ తీరుతో నా కుమారున్ని కోల్పోయినప్పటి కంటే కూడా బాధ పడ్డా. ఒక దశలో రాజీనామా చేద్దామని కూడా అనిపించింది'' అంటూ మండిపడ్డారు. మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్‌కు భారత రత్న పురస్కారంపై చర్చ సందర్భంగా ఆయన మనవడు, ఆర్ఎల్‌డీ చీఫ్ జయంత్ సింగ్‌కు ధన్‌ఖడ్ మాట్లాడే అవకాశమివ్వడంపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఏ నిబంధనల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారని నిలదీస్తూ జైరాం చేసిన వ్యాఖ్యలపై ధన్‌ఖడ్ ఆగ్రహించారు. ''జైరాం ఏమన్నదీ విన్నాను. ఆయన శ్మశానంలో సైతం వినోదారగించగల వ్యక్తి'' అంటూ తూర్పారబట్టారు.

నితీశ్ విందుకు ఎమ్మెల్యేలు డుమ్మా

పట్నా: బిహార్ అసెంబ్లీలో సోమవారం బలపరీక్ష జరగనుండగా శనివారం సీఎం నితీశ్ కుమార్ ఇచ్చిన విందుకు అధికార జేడీ(యూ) ఎమ్మెల్యేలు కొందరు డుమ్మా కొట్టారు! విందులో ఎమ్మెల్యేల నుంచి సంతకాలు సేకరించడం విశేషం. అనారోగ్య కారణాలతో రాలేకపోతున్నట్లు కొందరు ఎమ్మెల్యేలు ముందే సమాచారమిచ్చారని అనంతరం నితీశ్ మీడియాకు చెప్పారు. ''వారిలో కొందరు ఆదివారం పార్టీ శాసనసభాపక్ష భేటీకి వచ్చే అవకాశముంది. సోమవారం నుంచి మొదలయ్యే బడ్జెట్ సెషన్‌లో వారంతా సభలో ఉంటారు'' అని వివరించారు. 12వ తేదీన బలపరీక్ష ఉన్నందున తప్పక హాజరు కావాలంటూ జేడీయూ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేసినట్లు సీఎం నితీశ్ చెప్పారు.

దేశానికి బాబా మోదీ అవసరం లేదు: ఒవైసీ

న్యూఢిల్లీ: కేంద్రం వైఖరిపై మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ నిప్పులు చెరిగారు. మోదీ ప్రభుత్వం ఒక వర్గానికో, మతానికో చెందిన ప్రభుత్వమా లేక యావద్దేశానికి ప్రభుత్వమా అని నిలదీశారు. దేశానికి బాబా మోదీ ప్రభుత్వం అవసరం లేదన్నారు. రామమందిర నిర్మాణంపై శనివారం సభలో చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''రామ మందిర ప్రారంభం ద్వారా ఒక మతంపై మరో మతం విజయం సాధించినట్లు సందేశం ఇవ్వదలిచారా? దేశంలోని 17 కోట్ల ముస్లింలకు ఏం సందేశమిస్తున్నారు? నేను బాబర్, జిన్నా, ఔరంగజేబ్ తరఫున మాట్లాడటం లేదు. రాముడిని గౌరవిస్తా. కానీ గాడ్సేను ద్వేషిస్తా. 'బాబ్రీ మసీదు జిందాబాద్, బాబ్రీ మసీదు ఎప్పటికీ ఉంటుంది' అంటూ ముగించారు.

పాక్‌లో సంకీర్ణం!

చేతులు కలుపుతున్న నవాజ్ షరీఫ్, బిలావల్

- పీఎంఎల్, పీపీపీలకు కలిపి 127 స్థానాలు
- మెజారిటీకి 7 సీట్లు తక్కువ
- ప్రధాని పదవిపైనే పీటముడి!
- మళ్లీ తెరపైకి షహబాజ్ పేరు
- ఇమ్రాన్ అభ్యర్థులకు 100 సీట్లు
- ఫలితాలు తారుమారు చేశారన్న మాజీ ప్రధాని


ఇస్లామాబాద్/లాహోర్: పాకిస్తాన్‌లో మరోసారి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. గురువారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ జైలుపాలవడమే గాక పాకిస్తాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ ఎన్నికల గుర్తు రద్దవడంతో స్వతంత్రులుగా బరిలో దిగిన ఆయన మద్దతుదారులు 100 స్థానాల్లో నెగ్గి ప్రబల శక్తిగా ఆవిర్భవించారు. అయితే 73 సీట్లు సాధించిన మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పీఎంఎల్ (ఎన్), 54 సీట్లొచ్చిన బిలావల్ భుట్టోకు చెందిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ మరోసారి చేతులు కలిపాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 133 సీట్లు అవసరం కాగా ఆ రెండింటికి కలిపి 127 స్థానాలున్నాయి. శుక్రవారం రాత్రే పలు దఫాలుగా చర్చోపచర్చలు జరిపి ప్రభుత్వ ఏర్పాటుకు చేతులు కలిపేందుకు పీఎంఎల్, పీపీపీ అంగీకారానికి వచ్చాయి. మెజారిటీ సాధనకు 28 స్థానాల్లో నెగ్గిన చిన్న పార్టీలు, స్వతంత్రుల మద్దతు కోసం శనివారమంతా జోరుగా మంతనాలు సాగాయి. నవాజ్ ప్రయత్నాలు ఫలిస్తే రికార్డు స్థాయిలో నాలుగోసారి పాక్ ప్రధాని అవుతారు. అయితే ప్రధానిగా బిలావల్‌కే అవకాశమివ్వాలని పలువురు పీపీపీ సీనియర్ నేతలు డిమాండ్ చేస్తుండటంతో పరిస్థితి ఆసక్తికరంగా మారింది! కాకపోతే సైన్యం దన్ను నవాజ్‌కు కలిసొస్తుందంటున్నారు. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు ఆయన ఇచ్చిన పిలుపుకు ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కూడా మద్దతు పలకడం విశేషం. ''రాజకీయ సుస్థిరత పాక్‌కు తక్షణావసరం. అందుకు ప్రజాస్వామిక శక్తులన్నీ ఒక్కతాటిపైకి వచ్చి ఏకీకృత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి'' అని శనివారం ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు! నవాజ్ పేరుకు పీపీపీ ఒప్పుకోని పక్షంలో బిలావల్‌కు అవకాశమిచ్చేందుకు పీఎంఎల్ కూడా అంగీకరించే ప్రసక్తే లేదని ఆ పార్టీ సీనియర్లు అంటున్నారు. మధ్యేమార్గంగా మరోసారి నవాజ్ సోదరుడు షహబాజ్ షరీఫ్ పేరును ప్రధాని పదవికి ప్రతిపాదించవచ్చని చెబుతున్నారు. దీనికి సైన్యం నుంచి కూడా అభ్యంతరం ఉండకపోవచ్చన్నది రాజకీయ వర్గాల మాట.

యథేచ్ఛగా అక్రమాలు!

మొత్తం 265 జాతీయ అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ముగిసి రెండు రోజులు దాటినా 10 చోట్ల ఇంకా ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల వెల్లడి విపరీతంగా ఆలస్యమవుతుండటంపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. నిజానికి తమకే మెజారిటీ సమకూరిందని ఇమ్రాన్‌ఖాన్ ప్రకటించారు. కానీ అక్రమంగా ఫలితాలను పీఎంఎల్‌కు అనుకూలంగా మార్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకే ఫలితాల వెల్లడిలో జాప్యం చేస్తున్నారంటూ దుయ్యబట్టారు.

భిన్న వర్గాల భాగస్వామ్యంతో చారిత్రక తప్పిదాలు సరిచేయొచ్చు

'సుప్రీంకోర్టు' వార్షిక ప్రసంగంలో సీజేఐ చంద్రచూడ్



న్యూఢిల్లీ: కోర్టులు నిర్ణయాత్మకమైన అద్భుత తీర్పులు ఇవ్వాలన్నా, చారిత్రక తప్పిదాలను సరిదిద్దాలన్నా భిన్న వర్గాల భాగస్వామ్యం ఉండాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. 1950 జనవరి 28న భారత సర్వోన్నత న్యాయస్థానం తొలిసారిగా కొలువుతీరిన సందర్భంగా ఏటా నిర్వహించే వార్షిక ప్రసంగాల రెండో విడతలో భాగంగా శనివారం సీజేఐ ప్రసంగించారు. ముఖ్య అతిథి ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ న్యాయమూర్తి హిలరీ చార్లెస్‌వర్త్‌కు స్వాగతం పలికారు. ''అంతర్జాతీయ న్యాయస్థానంలో భిన్న ఖండాల దేశాల ప్రాతినిధ్యం తప్పనిసరి. ఇది చారిత్ర తప్పిదాలను సరిచేయడంతో పాటు అంతర్జాతీయ న్యాయస్థానంలో యూరప్‌కేంద్ర సంస్కృతికి చరమగీతం పాడింది'' అన్నారు. ఎల్‌జీబీటీక్యూఐఏ+ వర్గాల కేసుల తీర్పుల్లో న్యాయమూర్తులు, న్యాయాధికారులు సున్నితంగా వ్యవహరించాలని సూచించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



దుర్గమ్మ సేవలో..
ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆది దంపతుల పల్లకీ సేవలో కమిషనర్ పాల్గొన్నారు.



విలన్ రోల్ చేయాలనేది..
తనకు పూర్తిగా విలన్‌రోల్ చేయాలన్న కోరిక ఉందని హీరోయిన్ ప్రియమణి అన్నారు. ఆ పాత్రకోసం ఎదురు చూస్తు న్నానని పేర్కొన్నారు. -8లో▸



ఆసరా చెక్కుల పంపిణీ
కంకిపాడు: మండలంలోని కోలవెన్నులో శని వారం డాక్టర్ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ జరిగింది. గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెక్కులు అందజేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ విజయవాడ నగర అధ్యక్షుడిగా విష్ణు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ నగర అధ్యక్షుడిగా సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విష్ణును పార్టీ నగర అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. మల్లాది విష్ణు 2019 ఎన్నికల్లో పార్టీ తరఫున సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా కూడా సేవలు అందిస్తున్నారు. మల్లాది విష్ణుకు నగరంపై మంచి పట్టు ఉంది. ఆయనకు విస్తృతమైన పరిచయాలు, సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయనను నగర అధ్యక్షుడిగా నియమించడంతో మూడు నియోజకవర్గాలను సమన్వయం చేసేందుకు దోహదపడుతుంది.

కార్తికేయుని సేవలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎస్పీకి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు బుద్దు ఫణికుమార్ శర్మ, వెంకటేశ్వరావు స్వామికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏసీ ఎన్.ఎస్. చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐలు నాగప్రసాద్, త్రినాథ్, ఎస్ఐలు వై.వి.వి.సత్యనారాయణ, చినబాబు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలు
పెనమలూరు: మండలంలోని కానూరులో 11వ మిస్టర్ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరుగుతాయని ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్ష కార్యదర్శులు బి.మనోహర్, తాళ్లూరి అశోక్ తెలిపారు. కానూరు అశోక్ జిమ్ సహకారంతో గ్లోబల్ కిడ్స్ స్కూల్ ప్రాంగణంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొంటా రని వివరించారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 86867 71358, 64599 85182 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆదివారం నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఆర్ఐఓ రవికుమార్ శనివారం తెలిపారు. కృష్ణా జిల్లాకు సంబంధించి 16,150 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 31,880 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతారని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలో 5,620 మంది బైపీసీ, 10,530 మంది ఎంపీసీ విద్యార్థులకు 77 పరీక్ష కేంద్రాలను, ఎన్టీఆర్ జిల్లాలో 3,755 మంది బైపీసీ, 28,125 మంది ఎంపీసీ విద్యార్థులకు 130 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా ప్రాక్టికల్స్ జరుగుతాయని తెలిపారు. పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

సోషల్ వేదిక.. సైబర్ కీచక

• ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ గృహిణి ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తిని మహిళగా భావించి తన వ్యక్తిగత వివరాలను పూర్తిగా చెప్పేసి చిక్కుల్లో పడింది. అక్కడితో ఆగకుండా వీడియో కాల్‌లో సైతం మాట్లాడి ఇబ్బందులు కొని తెచ్చుకుంది. కొద్ది రోజుల తరువాత బ్లాక్ మెయిల్ కాల్స్ రావడంతో అవతలి వ్యక్తి మహిళ కాదని కీచకుడని తెలుసుకుని నిర్ఘాంతపోయింది. సైబర్ పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్‌తో ఆగంతకుడి చెర నుంచి బయటపడింది.

• విజయవాడలోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతున్న డిగ్రీ విద్యార్థిని ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన ఆగంతకుడిని నమ్మింది. వ్యక్తిగత వివరాలన్నీ పంచుకుంది. పలుమార్లు వీడియో కాల్స్‌తో మరింత దగ్గరైంది. వీడియో చాటింగ్‌ను రికార్డ్ చేసిన ఆగంతకుడు ఆమెను బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. కీచకుడి వేధింపులను తాళలేని ఆ విద్యార్థిని పోలీసులను ఆశ్రయించింది.

- ఆర్థిక, లైంగిక నేరాల వేదికవుతున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్
- గృహిణులు, విద్యార్థినులు, ఉన్నత వర్గాల ఉద్యోగులే నేరస్తుల లక్ష్యం
- విజయవాడ సైబర్ పోలీస్ స్టేషన్‌లో 24 కేసులు నమోదు
- హైదరాబాద్, బెంగళూరు, భరత్‌పూర్ కేంద్రంగా సైబర్ వల



విజయవాడస్పోర్ట్స్: స్మార్ట్ ఫోన్‌లో ఎక్కువ మంది వినియోగించే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికగా సైబర్ కీచకులు రెచ్చిపోతున్నారు. ఆర్థిక, లైంగిక నేరాలకు తెగబడుతున్నారు. ఈ యాప్‌లను వినియోగిస్తున్న వారి మానసిక స్థితి ఆధారంగానే హై ప్రొఫైల్ నేరాలకు పాల్పడుతున్నారు. యాప్‌లలో రిజిస్ట్రేషన్, వినియోగం, సమాజ పోకడలపై అవగాహన లేని వ్యక్తులే సైబర్ కీచకుల వలలో చిక్కి మోసపోతున్నారని పోలీసులు పేర్కొంటున్నారు.

ఎలా చేస్తారంటే..

నేరగాళ్లు ముందుగా ఆయా యాప్‌ల సెర్చ్ బాక్స్‌ల్లో రాండమ్‌గా కొన్ని పేర్లను వెదుకుతారు. ఆయా పేర్లతో ఉన్న యాప్‌ల అకౌంట్లలో ఎంత మంది ఫ్రెండ్స్, ఫాలోవర్స్ ఉన్నారు, ఏఏ తరహా వీడియోలు/ఫొటోలను షేర్ చేస్తున్నారు వంటి అంశాలను క్షుణ్ణంగా గమనిస్తారు. ఆ తరువాత వారి ఫ్రెండ్స్ లిస్ట్‌లోని ఒకరిని ఎంచుకుంటారు. ఆ వ్యక్తి ఫ్రెండ్ లిస్ట్‌లోని ఒకరి ఫొటోతో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తారు. ఫ్రెండ్‌కి ఫ్రెండే కదా అని రిక్వెస్ట్ అంగీకరించి లిస్ట్‌లో చేర్చుకున్న తరువాత తమ పని మొదలు పెడతారు. తియ్యటి పదాలతో చాటింగ్ చేస్తూ దగ్గరవుతారు. చాటింగ్‌లోనే ఫోన్ నంబర్ సహా వ్యక్తిగత వివరాలన్నీ సేకరిస్తారు. అక్కడ నుంచి ఫోన్‌లో తరచూ మాట్లాడటం, ఆ తరువాత వీడియో కాల్‌తో ముగ్గులోకి దించి బ్లాక్‌మెయిల్‌కు తెగబడతారు. పలువురు మహిళలు ఇలా కీచకుల వలలో చిక్కుకుని లైంగిక వేధింపులకు గురైన ఘటనలు ఉన్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ కేంద్రంగా ఈ తరహా నేరాలు జరిగేవి. తాజాగా హైదరాబాద్, బెంగళూరు కేంద్రాలుగా సైబర్ కీచకులు నేరాలకు తెగబడుతున్నారని పోలీసులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

- ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ రిజిస్ట్రేషన్‌లో వ్యక్తిగత వివరాలు ఎవరికీ కనిపించకుండా లాక్ చేసుకోవాలి.
- పాస్‌వర్డ్ క్రిటికల్‌గా ఉండేలా జాగ్రత్తపడాలి. యాప్ డీపీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.
- పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలను పంచుకోకూడదు.
- వ్యక్తిగత ఫొటోలు, కుటుంబ సభ్యులతో కూడిన వీడియోలను షేర్ చేయకూడదు.
- ఆగంతకుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను ఆమోదించకూడదు. వారిచ్చే గిఫ్ట్‌లు స్వీకరించకూడదు.
- అవసరం లేనప్పుడు ఇంటర్‌నెట్ డేటా, వై ఫైను ఆఫ్ చేయాలి.
- వ్యక్తిగత సమయాల్లో దగ్గర్లోని ఫోన్, ల్యాప్‌టాప్‌ల కెమెరాలను ఏదైనా వస్త్రంతో లేదా కవర్‌తో కప్పేయాలి.
- అవసరం లేని యాప్‌లను ఫోన్ నుంచి డిలీట్ చెయ్యాలి.
- యాప్‌లను ఇన్‌స్టాల్ చేసే సమయంలో మీడియా, కాంటాక్ట్స్‌కు యాక్సెస్ ఇవ్వొద్దు.
- వాష్‌రూంనకు మొబైల్‌ను తీసుకెళ్లకూడదు.
- పరిచయం ఉన్న/లేని వ్యక్తులు పంపే ప్రతి వెబ్ లింక్‌ను క్లిక్ చేయకూడదు.

అవగాహనే కీలకం



సోషల్ మీడియాతో ఎంత ఉపయోగం ఉందో, అంతే స్థాయిలో అనర్థాలున్నాయి. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని రకరకాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాలతో ఈ నేరాలపై నిత్యం ఏదో ఒక విద్యాసంస్థ లేదా ప్రధాన కూడళ్ల వద్ద విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎలాంటి సైబర్ నేరం బారిన పడినా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి. లైక్‌లు, షేర్‌ల మోజులో పడి ఆగంతకుల చెరలో చిక్కొద్దు.

– కోమాకుల శివాజీ, సీఐ, సైబర్ పోలీస్ స్టేషన్

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీఓ బి.హెచ్.భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సీఈఓ మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈసీఐ, సీఈఓ మార్గదర్శకాలకు అనుగుణంగా చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ ఢిల్లీరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తుది ఓటర్ల జాబితా అనంతరం వివిధ ఫారాల పరిష్కారం, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు తదితర అంశాలపై ఏర్పాట్లను తెలియజేశారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కమ్యూనికేషన్ ప్రణాళిక, సాంకేతిక వినియోగ ప్రణాళికల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడించారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం



ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను, కమిషనర్ నివాస్

వత్సవాయి(జగ్గయ్యపేట): పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. వత్సవాయి మండలం భీమవరం పరిధిలో జాతీయ రహదారి పక్కన టోల్‌ప్లాజా సమీపంలో రూ.2.85 కోట్లతో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్‌తో కలిసి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఉదయభాను మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మంచి పాలన అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ మాట్లాడుతూ.. ఏపీఐఐసీకి ఇచ్చిన భూమిని తిరిగి రెవెన్యూ శాఖ పరిధిలోకి తీసుకొచ్చిన ఘనత ఉదయభానుకే దక్కుతుందన్నారు. ఈ భూమిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేయడం శుభ పరిణామన్నారు. సర్పంచ్ కారుపాటి మాధురి, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీషరమేష్, డీహెచ్ కె.పద్మావతి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, వైద్యాధికారులు సుష్మాప్రియదర్శిని, హర్సిదాబేగం, సీతారాం, అలేఖ్య, ఎంపీటీసీ సభ్యులు కొమెర చెన్నమ్మ, నర్ల సుధాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాసరెడ్డి, చింతకుంట్ల వెంకటరెడ్డి, గుండం రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బందరు జీజీహెచ్‌లో
చిన్నారులకు అస్వస్థత

- వికటించిన యాంటీబయోటిక్ ఇంజక్షన్
- వెంటనే విరుగుడు వైద్యం చేసిన డాక్టర్లు
- సాధారణ స్థితికి చేరిన చిన్నారుల ఆరోగ్యం
- ఘటనపై త్రిసభ్య కమిటీ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం





చిన్నారులను పరీక్షిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్

మచిలీపట్నంటౌన్: వైద్యం కోసం ఇచ్చిన యాంటీ బయోటిక్ ఇంజక్షన్ వికటించి చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి జరిగింది. వైద్యులు సకాలంలో స్పందించి విరుగుడు వైద్యం చేయడంతో చిన్నారుల ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థితికి చేరింది. దగ్గు, జలుబు, ఆయాసంతో జీజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లుగా వైద్యం పొందుతున్న తొమ్మిది మంది చిన్నారులకు వార్డు సిబ్బంది శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో యాంటీబయోటిక్ ఇంజక్షన్ ఇచ్చారు. ఆ తర్వాత కొద్ది సేపట్లోనే ఏడుగురు చిన్నారులు చలి, జ్వరం బారినపడటంతో తల్లిదండ్రులు గుర్తించి వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఐసీయూ డ్యూటీ డాక్టర్‌తో పాటు మరో ఆరుగురు వైద్యులు హుటాహుటిన పిల్లలకు విరుడుగు వైద్యం చేశారు. రాత్రి 11.30 గంటలకు చిన్నారుల ఆరోగ్యం సాధారణ స్థితికి చేరింది. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. సకాలంలో వైద్యులు స్పందించడంతో చిన్నారుల ఆరోగ్యం సాధారణ పరిస్థితులకు చేరుకుందని తల్లిదండ్రులు తెలిపారు.

ఆరోపణలను ఖండించిన సూపరింటెండెంట్

నాణ్యత లేని, కాలం చెల్లిన ఇంజక్షన్‌ను చిన్నారులకు ఇవ్వటం వల్లే అస్వస్థతకు గురయ్యారని ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌కుమార్ ఖండించారు. తొమ్మిది మంది చిన్నారులకు సిబ్బంది అమోక్సిలిన్ అండ్ పొటాషియం క్లావునెట్ ఇంజక్షన్ ఇచ్చారని తెలిపారు. మూడు నెలలుగా ఈ ఇంజక్షన్లను వాడుతూనే ఉన్నామని వివరించారు. ఇప్పుడు ఈ ఏడుగురికి మాత్రమే రియాక్షన్ వచ్చిందన్నారు. ఈ బ్యాచ్ ఉన్న ఇంజక్షన్లను వాడకుండా, పరీక్షల కోసం పూణెలోని ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. ఆస్పత్రిలో ఎలాంటి డ్రగ్ ట్రైల్స్ జరగ వని స్పష్టం చేశారు.

విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

చిన్నారులకు ఇంజక్షన్ వికటించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై త్రిసభ్య కమిటీతో విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని ఆదేశించింది. కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సూచనల మేరకు పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్, నర్సింగ్ సూపరింటెండెంట్, డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జ్‌తో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. వారి నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు. పూణె ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టు ఆధారంగా కూడా బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.



ప్రార్థనలు చేస్తున్న బిషప్ విజయ్ కుమార్, బిషప్ రాజారావు తదితరులు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రీస్తు విశ్వాసులు



మరియమాత ప్రతిమకు పూలమాల వేస్తున్న బిషప్‌లు

మరియమాత దర్శనం.. సర్వపాప హరణం

- భక్తులతో పోటెత్తిన గుణదల కొండ
- ఘనంగా జరుగుతున్న ఉత్సవాలు
- ఆధ్యాత్మిక ఆనందంలో విశ్వాసులు



విద్యుత్ దీపాల కాంతుల్లో గుణదల మరియమాత గుడి

గుణదల (విజయవాడ తూర్పు): అమ్మా దర్శనం.. మరియమ్మా దర్శనం.. అంటూ భక్తుల శరణు ఘోషతో మేరీమాత పుణ్యక్షేత్రం మారుమోగింది. గుణదల క్షేత్రంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు అనేక రాష్ట్రాల నుంచి క్రీస్తు విశ్వాసులు లక్షలాదిగా తరలి వస్తున్నారు. ఏ దిక్కున చూసినా మరియమాత భక్తులే కనిపిస్తున్నారు. గుణదల మరియమాత ఉత్సవాల రెండో రోజైన శనివారం బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో జరిగిన సమష్టి దివ్యబలి పూజకు శ్రీకాకుళం మేత్రాసన బిషప్ రాయరాల విజయ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. లోక రక్షకుడైన ఏసు క్రీస్తును ఈ లోకానికి అందించిన మరియమాత పరమ పవిత్రురాలని కొనియాడారు. ఆమె పవిత్రతకు మెచ్చి సాక్షాత్తు దేవాది దేవుడే మానవ రూపంలో జన్మించారని పేర్కొన్నారు. ఏసు నామంలో జీవిస్తున్న మనం మరియ తల్లిని ఎల్లప్పుడూ మననం చేసుకోవాలని సూచించారు. ఆమె ఆదర్శాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. గుణదల మేరిమాత పుణ్యక్షేత్రం క్రైస్తవులకు, క్రీస్తు విశ్వాసులకు గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. ఈ ఆలయాన్ని స్థాపించి శత వసంతాలు పూర్తికావడం హర్షణీయమన్నారు. పుణ్యక్షేత్రాభివృద్ధికి ఎంతో మంది పీఠాధిపతులు, గురువులు కృషి చేశారని కొనియాడారు. వారి కృషి ఫలితంగానే గుణదల క్షేత్రం నేడు దేశంలోనే అతిపెద్ద రెండో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోందని వివరించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ ఫాదర్ సునీల్‌రాజు తదితర గురువులు, మఠకన్యలు, వేలాది మంది విశ్వాసులు పాల్గొన్నారు.

అధికారుల చర్యలు.. సత్ఫలితాలు

అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే గుణదల మరియ మాత ఉత్సవాలకు ప్రభుత్వ అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బాంబ్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు, చిన్నబోర్డింగ్ తదితర ప్రాంతాలలో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు తమ వాహనాలను ఆయా ప్రదేశాల్లో నిలిపి సకాలంలో పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటున్నారు. బస్సులు, లారీలు, వ్యాన్లు ఇలా పెద్ద వాహనాలను ఏలూరు రోడ్డు పై అనుమతించకపోవడంతో భక్తులు కాలినడకన సునాయాసంగా రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ కార్పొరేషన్ సిబ్బంది పుణ్యక్షేత్ర ప్రాంగణాలన్నింటిలో విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యర్థాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుతున్నారు. తాగునీరు, మొబైల్ టాయ్‌లెట్లను అందు బాటులో ఉంచారు. అనారోగ్యానికి గురైన భక్తులకు ప్రథమ చికిత్సను అందిస్తున్నారు. ఆర్టీసీ, రైల్వే అధికారుల సహకారంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు సౌకర్యవంతంగా పుణ్యక్షేత్రానికి చేరుతున్నారు. ఆలయ గురువులు, ప్రభుత్వాధికారుల సమన్వయంతో గుణదల ఉత్సవాలు సవ్యంగా జరుగుతున్నాయి.

క్లుప్తంగా

ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

కలెక్టర్ ఢిల్లీరావు



నందిగామ: జగనన్న కాలనీల్లోని ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. జాయింట్‌కలెక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలిసి శనివారం ఆయన చందర్లపాడు-2 సచివాలయాన్ని సందర్శించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో లబ్ధిదారులందరికీ త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులతో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడగా, ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ అవుతుండటంపై వారు ఆనందం వ్యక్తంచేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ పి. సాయిబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ సరస్వతి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

204 మద్యం సీసాలు స్వాధీనం

రామవరప్పాడు: పోలీసులు 204 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం రామవరప్పాడులో జరిగింది. పటమట పోలీసుల కథనం ప్రకారం.. బండి జ్యోతి గ్రామంలోని పేరంటాలమ్మ ఆలయం వెనుక ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఆమె కొంత కాలంగా ఇంటిలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్ దాడిచేసి 204మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పటిష్ట భద్రతకు పోలీసులు సంసిద్ధం

జిల్లా ఎస్పీ నయీం అస్మీ



నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో పడవలరేవును పరిశీలిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

నాగాయలంక: పటిష్ట బందోబస్తు నడుమ పబ్లిక్ పరీక్షలు, సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం సంపూర్ణ సంసిద్ధతతో ఉందని కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ తెలిపారు. జిల్లా నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో తొలిసారిగా నాగాయలంక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పరిస్థితులను ఆకళింపు చేసుకునే క్రమంలో ఈప్రాంతంలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తీసుకోబోయే భద్రతాచర్యలపై ఎస్పీని ప్రశ్నించగా ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. పోలీసు యంత్రాంగం కూడా తగినవిధంగా సిద్ధమవుతోందని తెలిపారు. స్థానిక పోలీసు అధికారుల నుంచి ఈ ప్రాంత మౌలిక, భౌగోళిక వివరాలు, శాంతిభద్రతల తీరుతెన్నులు తెలుసుకున్నానని, తద్వారా శాంతియుత ప్రాంతంగా గమనించానని చెప్పారు. త్వరలోనే ఈ ప్రాంతంలో మరోసారి పర్యటించి, ప్రజలతో ఇంటరాక్ట్ అవుతానన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల జోలికిపోకుండా సత్ప్రవర్తనతో ఉండాలని యువతకు సూచించారు. చెడు నడతతో పోలీసు రికార్డులకెక్కిన ప్రతిఒక్కరిపై నిరంతర నిఘా ఉంటుందనేది గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. అనంతరం ఎస్పీ నయీం అస్మీ నాగాయలంక కృష్ణానది తీరానికి వెళ్లి శ్రీరామపాదక్షేత్రం ఘాట్, పడవలరేవు పరిశీలించారు. పర్యాటక అవకాశాలు, నదీప్రయాణాల విధానం, చేపల వేట తీరు, దేవాలయాల ఆధ్యాత్మిక విశేషాలను స్థానిక పోలీసు అధికారులను అడిగితెలుసుకున్నారు. ఎస్పీ వెంట అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్, అవనిగడ్డ సీఐ పి.త్రినాథ్, ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం ఉన్నారు.

మాతాశిశు సేవల ప్రగతిపై సమీక్ష



వైద్యసిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): మాతాశిశు సంరక్షణ సేవలకు సంబంధించిన సమాచారాన్ని వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఎన్టీఆర్‌జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు.నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఆమె మాతాశిశు సంరక్షణ సేవల ప్రగతిపై వివిధ ప్రోగ్రామింగ్ అధికారులు, వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వైద్యాధికారులు ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణులు పొందిన సేవలు, గర్భిణి బ్యాంకు సమాచారం విధిగా నింపాలన్నారు. గర్భిణులు డెలివరీ కోసం ఆస్పత్రికి వెళ్లే సమయానికి ఏఒక్క సేవకి సంబంధించి ఖాళీ లేకుండా మాతాశిశు సంరక్షణ కార్డులలో పూర్తి సమాచారం ఉండాలన్నారు. రెండురోజుల్లో పూర్తిస్థాయి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ జూపూడి ఉషారాణి, డీఐఓ డాక్టర్ అమృత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ సమీర, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

6.3 కేజీల గంజాయి స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను కృష్ణలంక పోలీసులు శనివారం ఉదయం అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 6.3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంక సీఐ మురళీకృష్ణ తెలిపిన వివరాల మేరకు రాణిగారితోటకు చెందిన సాలి వెంకటేష్, పాగాల నాని, చెరుమల్ల జయరాజు గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించి రణదీవెనగర్‌లోని వారధి దిగువభాగంలో పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 6.3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం

గుంటూరు జిల్లా సీజీఎస్‌టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సాధు నరసింహారెడ్డి, పక్కన ఐసీఏఐ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్ర, దేశాభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్ల(సీఏ)పాత్ర ఎంతో కీలకమని గుంటూరు జిల్లా సీజీఎస్‌టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. మొగల్రాజపురంలోని ఓ హోటల్‌లో శనివారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడశాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ అనే అంశంపై ఎస్.వైద్యనాథ్ అయ్యర్ స్మారక ఉపన్యాసం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ 2047నాటికి జరిగే దేశంతోపాటు ఆంధ్రప్రదేశ్ కూడా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ అభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలకపాత్ర పోషించాలని సూచించారు. లక్ష్యసాధనకు భాష అవరోధం కాదని, తెలుగు మీడియంలో చదువుకున్న విద్యార్థులు కూడా చక్కటి నైపుణ్యాలను పెంపొందించుకుని ఆయా రంగాల్లో అత్యుత్తమ నైపుణ్యులుగా తయారుకావచ్చని తెలిపారు. కార్యక్రమానికి ఐసీఏఐ విజయవాడశాఖ మాజీ చైర్మన్ జీ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, విజయవాడ ఐసీఏఐ బ్రాంచి చైర్మన్ వీ.నరేంద్రబాబు, సెక్రటరీ కె. నారాయణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నిత్యాన్నదానానికి శనివారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. విజయవాడకు చెందిన బోయపాటి వీక్ష పేరిట వి.రఘురామరావు కుటుంబం రూ.1,00,116, కొండపల్లికి చెందిన శరత్ కేశనం కుటుంబం రూ.1,00,116, విజయవాడ కృష్ణలంక బాలాజీనగర్‌కు చెందిన పోరంకి కోటమరాజు కుటుంబం రూ.1,01,116లను విరాళంగా అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు, పాలకమండలి సభ్యురాలు బచ్చు మాధవీలత అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



దాతలకు ప్రసాదాలు అందజేస్తున్న ఏఈవో రమేష్ బాబు, పాలకమండలి సభ్యురాలు మాధవీలత



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

గురకవ్యాధి వైద్య విధానంపై సదస్సు నేడు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఫర్ స్లీప్ అప్నియా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం విజయవాడ సూర్యారావుపేటలోని సాగర్ ఈఎన్‌టీలో జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు వైద్యులు విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురకవ్యాధి చికిత్సలో అనేక పరిశోధనలు చేసిన పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ మోహన్‌కామేశ్వరన్, డాక్టర్ దీన్‌దయాల్ సహా దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన వందమందికి పైగా వైద్యనిపుణులు ఈ సదస్సులో పాల్గొని వారు చేసిన పరిశోధన అంశాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

విలన్ రోల్ చేయాలనేది నా ఆకాంక్ష

హీరోయిన్ ప్రియమణి



మీడియాతో మాట్లాడుతున్న హీరోయిన్ ప్రియమణి, పక్కన సిరత్, శరణ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈనెల 16వ తేదీన విడుదల కానున్న భామాకలాపం2 చిత్రం క్రైమ్, థ్రిల్లర్ సస్పెన్స్, కామెడీ సన్నివేశాలతో అందరినీ అలరిస్తుందని ఆచిత్ర హీరోయిన్ ప్రియమణి అన్నారు. హీరోయిన్లు ప్రియమణి, సిరత్, శరణ్య కాంబినేషన్‌లో నిర్మితమైన భామాకలాపం2 ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు శనివారం నగరంలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రియమణి మాట్లాడుతూ భామాకలాపం1 మాదిరిగానే 2ను కూడా ఆదరించాలని ప్రేక్షకులను కోరారు. తనకు పూర్తి విలన్‌రోల్ చేయాలన్న కోరిక ఉందని, ఆ పాత్ర కోసం ఎదురు చూస్తున్నానన్నారు. నరసింహా చిత్రంలో రమ్యకృష్ణ చేసిన పాత్ర అంటే తనకు ఎంతో ఇష్టమని, హీరోతో సమానంగా ఉండే విలన్ పాత్రని పోషించాలని అనుకుంటున్నట్లు తెలిపారు. తాను హిందీలో నటించిన ఆర్టికల్ 370 చిత్రం త్వరలో విడుదల కానుందని, అజయ్‌దేవగన్‌తో నటించిన మైదాన్ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో హీరోయిన్ సిరత్, నటి శరణ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఖురాన్ కంఠస్థ పోటీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్లో ఆదివారం 9వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహ్మద్ దావూద్, సిటీ ఇన్‌చార్జి షేక్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో మూడు నుంచి 12 ఏళ్ల లోపు బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు.

ఐఓబి సిబ్బంది రక్తదానం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబి) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని క్షేత్రీయ కార్యాలయంలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఉద్యోగులు బ్యాంకు వ్యవస్థాపకుడైన చిదంబరం చెట్టియార్‌కు నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు శిబిరం ఏర్పాటు చేయగా పలువురు సిబ్బంది రక్తదానం చేశారు. రెండు ప్రైవేటు ఆస్పత్రులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, సిబ్బందికి నేత్ర, దంత పరీక్షలు నిర్వహించారు. తొలుత ఉదయం ఎంజీరోడ్డులో 3కే వాక్ నిర్వహించగా, ఉద్యోగులు, బ్యాంకు పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారానికి కెనరా బ్యాంకు కృషి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునే వారు సద్వినియోగం చేసుకునేలా కెనరా బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో ఏర్పాటు చేసినట్లు ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ పి.రవివర్మ తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రిటైల్ ఎక్స్‌పోను శనివారం ఆయన ప్రారంభించారు. నిర్మాణ సంస్థలు 20 స్టాల్స్, వాహన డీలర్‌లు 8 స్టాల్స్ ఏర్పాటు చేశారు. బ్యాంకు వేలంలో ఉన్న ఆస్తులను కూడా ప్రదర్శించారు. కెనరా డిజిటల్, ఎంఎస్ఎంఇ ఉత్పత్తులనూ ప్రదర్శించారు. 104 మందికి రూ. 50 కోట్లు మేర వివిధ రుణాల మంజూరు పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డీజీఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేటితో మహిళా ఉత్సవ్ ముగింపు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు స్వయం ఉపాధి కోర్సులను నేర్చుకుని వస్తువులను ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా ఆదాయం సంపాదిస్తూ కుటుంబ అవసరాలను తీర్చుకోవచ్చునని పారిశ్రామికవేత్త పి.పల్లవి చెప్పారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా ఉత్సవ్-2024లో శనివారం సాయంత్రం మహిళలకు భాతిక్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ వస్త్రధారణ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 11 మంది పాల్గొన్నారు. మొదటి బహుమతిని బేబీ కేసవి తస్వికశ్రీ, ద్వితీయ బహుమతిని బి.రమణి గెలుపొందారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ విజేతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందచేశారు. సీనియర్ రిసోర్స్ పర్సన్ పి.వరలక్ష్మి పోటీల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బందితో పాటుగా మహిళా ఉత్సవ్‌లోని స్టాల్ హోల్డర్స్ పాల్గొన్నారు. ఆదివారంతో మహిళా ఉత్సవ్ ముగిస్తుందని పూర్ణిమ చెప్పారు.

12న ఇన్‌స్పైర్ పోటీలు

గుణదల (విజయవాడ తూర్పు) : విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీలు ఈ నెల 12వ తేదీన ఆంధ్ర లయోల కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు డీవైఈఓ కుమార్ తెలిపారు. ఈ మేరకు లయోల కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పాఠశాల విద్యార్థుల నుంచి ఇప్పటికే 143 ప్రాజెక్టులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని వివరించారు.

లబ్బీపేటలో అభివృద్ధి వెలుగులు

- 19వ డివిజన్‌లో రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.2 కోట్లతో షాదీఖానా నిర్మాణం
- నాలుగేళ్లలో అభివృద్ధిలో ముందుకు
- సీసీ, బీటీ రోడ్లుతో పాటు సైడు డ్రెయిన్‌ల నిర్మాణం



బందరు కాల్వ ఒడ్డున రజకుల కోసం నిర్మించిన షెడ్డు ప్రారంభోత్సవంలో కలెక్టర్ తదితరులు (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి చేసిన పనులు కనిపిస్తున్నాయి. మాటలు చెప్పడం కాదు, పనులు చేసి చూపించామని దమ్ముగా వాటిని చూపించి చెబుతున్నారు. అందుకు నిదర్శనంగా లబ్బీపేటలో షాదీఖానా నిర్మాణం నిలుస్తుంది. గత పాలకులు అదిగో ఇదిగో అంటూ చేతకాని తనంతో ముస్లిం మైనార్టీలను మోసం చేశారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దమ్ముగా విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అంతేకాదు రజకుల షెడ్డు ఏర్పాటు వంటి ఎన్నో సమస్యలు ఈ ప్రాంతాల్లో పరిష్కారమయ్యాయి. నాలుగున్నరేళ్ల కాలంలో ఏకంగా రూ.8.50 కోట్లుతో అభివృద్ధి పనులు చేశారు.

అభివృద్ధి చేసిన రోడ్లు ఇవే....

డివిజన్‌లోని అమెరికన్ ఆస్పత్రి సమీపంలోని కాలనీలో మూడు అంతర్గత రోడ్డు సీసీ రోడ్లు వేశారు. చెన్నుపాటి పెట్రోలు బంకు పక్క రోడ్డు, పిచ్చయ్యవీధిలోని చిన్నమసీదు రోడ్డు, బందరు కాల్వ ఒడ్డున ఆర్ అండ్ బి క్వార్టర్స్ రోడ్డు, గ్రీన్‌లాండ్స్ ప్రాంతంలో మూడు అంతర్గత రోడ్లను సీసీ, బీటీ రోడ్డుగా వేశారు. బృందావనకాలనీలోని నందమూరు రోడ్డు, సింధుభవన్‌రోడ్డు, ప్రగతినగర్ రోడ్డు వేశారు. దాదాపు 15 రోడ్లను సీసీ, బీటీ రోడ్లుగా తీర్చిదిద్దారు.

ఇతర అభివృద్ధి పనులు....

డివిజన్‌లో సైడు డ్రెయిన్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. లబ్బీపేట ఉర్దూ స్కూల్ వీధిలో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. దానితో పాటు పలు ప్రాంతాల్లో డ్రెయిన్‌లు నిర్మించారు. ముఖ్యంగా రజకులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పున్నమ్మతోటలో దోబీఖానా వద్ద రూ. 15 లక్షలతో షెడ్డు నిర్మాణం చేశారు. దీంతో వర్షాకాలంలో రజకులు పడుతున్న ఇబ్బందులు పరిష్కారమయ్యాయి. ఫకీరుగూడెంలో రూ.7 లక్షలతో చేపట్టే డ్రైనేజీ పనులను ప్రారంభించనున్నారు. డివిజన్‌లో రూ.22 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులు చేశారు.



లబ్బీపేటలో వేగంగా కొనసాగుతున్న షాదీఖానా నిర్మాణ పనులు

దమ్మున్న నాయకుడిగా నిరూపణ....

లబ్బీపేటలో షాదీఖానా నిర్మాణం ఎప్పటి నుంచో కలగానే ఉంది. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ నిర్మాణం చేస్తున్నానంటూ ప్రచారం చేసుకున్నాడే కానీ పనికాలేదు. ముస్లిం మైనార్టీలను నయవంచన చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జిగా ఉన్న దేవినేని అవినాష్ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. షాదీఖానా నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు ప్రారంభించారు.

వేగంగా అభివృద్ధి జరిగింది



మా డివిజన్‌లో నాలుగేళ్లలో అనేక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో సమస్యలు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. రోడ్లు సైతం వేయలేదు. కానీ నేడు ఏ సమస్య ఉన్నా నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కారం అవుతుంది.

– బుర్రి జగ్జీవన్‌రావు, జార్జిపేట

సమస్యలు పరిష్కరిస్తున్నాం



డివిజన్‌లో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించగలిగాం. నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో వేగంగా అభివృద్ధి చేయగలుగుతున్నాం. ఏ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లినా వెంటనే పరిష్కరిస్తున్నారు. కొన్ని సమస్యలు కార్పొరేషన్ అధికారుల ద్వారా పరిష్కరిస్తున్నాం.

– రెహానా నాహీద్, కార్పొరేటర్, 19 వ డివిజన్

జ్వరాలు సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మలేరియా, డెంగీ వంటి జ్వరాలు సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంటమాలజిస్ట్ కొండారెడ్డి అన్నారు. కృష్ణలంక, భ్రమరాంబపురంలోని డ్రైనేజీలను శనివారం ఆయన పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయి నుంచి మలేరియా, డెంగీ వంటి జ్వరాలను నివారించవచ్చన్నారు. వ్యాధులు సోకకుండా ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా పాటించాలని, అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. డోర్ టు డోర్ సర్వే నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యపర్చారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు గౌరీశంకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

విజయవాడస్పోర్ట్స్: రామలింగేశ్వర్‌నగర్‌లోని ఇద్దరు స్నేహితుల మధ్య జరిగినలో ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ సతీష్‌కు, అతని స్నేహితుడు ప్రభుదాస్‌కు మనస్పర్ధలతో శుక్రవారం అర్ధరాత్రి వివాదం జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సతీష్‌కు గాయాలయ్యాయని స్థానికుల సమాచారంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ఆసుపత్రికి తరలించామని పటమట సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పిల్లల్లో చెవి ఇన్ఫెక్షన్‌లపై అప్రమత్తత అవసరం

నియోనాటాలజిస్ట్ డాక్టర్ టీవీ విజయ్‌కుమార్



లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లల్లో తీవ్రమైన చెవి ఇన్‌ఫెక్షన్‌లను అక్యూట్ ఓటిటిస్ మీడియా ఏఓఎం) అని పిలుస్తారని, వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని అంకుర హాస్పటల్ నియోనాటాలజీ, పిడియాట్రిషియన్ డాక్టర్ టీవీ విజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల కాలంలో పిల్లల్లో తరచూ ఈ సమస్య చూస్తున్నట్లు తెలిపారు. నగరంలోని ఆస్పత్రిలో శనివారం మీడియాతో మాట్లాడారు. పిల్లల్లో సాధారణంగా కనిపించే రుగ్మతల్లో చెవి మధ్యలో మంట, ఇన్ఫెక్షన్ సంభవిస్తున్నాయన్నారు. చెవి ఇన్‌ఫెక్షన్‌లను నివారించడానికి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, ఇన్‌ఫ్లూయెంజా వ్యాక్సిన్, చెవి ఇన్‌ఫెక్షన్‌లకు దారితీసే అంటువ్యాధులను నిరోధించడం, ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వంటివి చేయాలని సూచించారు. తల్లిపాలలోని యాంటీబాడీల వలన చెవి ఇన్‌ఫెక్షన్‌ల ప్రమాదాన్ని తగ్గించవచ్చునన్నారు. ఇన్‌ఫెక్షన్ సోకిన చిన్నారులకు వైద్యుల సూచనల మేరకు మందులు వాడటంతో పాటు, వేడి కాపరం వంటివి తాత్కాలిక నొప్పి ఉపశమనాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. సరైన నివారణ చర్యలు, వైద్య సంరక్షణ ద్వారా పిల్లల్లో ప్రమాదకరమైన చెవి ఇన్‌ఫెక్షన్‌లను నివారించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

సమాజంలో మార్పు కోసం కృషి



ఆటోనగర్(విజయవాడతూర్పు): సమాజంలో మార్పు తీసుకురావడానికి, నైతిక విలువలను పెంపొందించేందుకు గాను జమాఅతె ఇస్లామి హింద్ విశేష కృషి చేస్తుందని విజయవాడ నార్త్ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ అన్నారు. జమాఅతె ఇస్లామి హింద్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అబ్దుల్ సత్తార్ మాట్లాడారు. ఈ నెల 18 వరకు జమాత్ ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ప్రచారం చేస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలకు వ్యతిరేఖంగా ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆటోనగర్, అశోక్‌నగర్, మురళీనగర్, సనత్‌నగర్, ఫారూఖ్‌నగర్ తో పాటు చెక్‌పోస్టు సెంటరులోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. నగర అధ్యక్షుడు ఖలీలుల్లాహ్, మీడియా కార్యదర్శి జహీరుద్దీన్, అబ్దుల్ సత్తార్, అబ్దుల్ కలాం, హబీబ్‌ఖాన్, సిద్ధిక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే ప్రజల అభీష్టం

ఎంపీ కేశినేని నాని

విజయవాడస్పోర్ట్స్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ కేశినేని నాని అన్నారు. సీఎం జగన్ సారథ్యంలోని సంక్షేమ రాజ్యం కచ్చితంగా వస్తుందని తెలిపారు. విజయవాడలోని కేశినేని భవన్‌లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులతో ఎంపీ కేశినేని శనివారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను చర్చించారు. అదేవిధంగా పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. బూటకపు సర్వేలతో ప్రజలను అయోమయానికి గురిచేసేందుకు టీడీపీ ప్రయత్నిస్తుందని, అయితే వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఎంపీ అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలను ముందుండి నడిపించడమే గురుతర బాధ్యతగా తీసుకోవాలని నాయకులకు సూచించారు. సమావేశంలో కాకర్ల వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లూరి నవీన్, టేకుల పల్లి పీఏసీఎస్ చైర్మన్ ముక్కామల సీతారామయ్య, తిరువూరు కౌన్సిలర్‌లు మోదుగ ప్రసాద్, పసుపులేటి శేఖర్‌బాబు, ఇనపనూరి చిన్నారిరవి, దుర్గారావు, పర్స సత్యనారాయణ, కాకర్లమూడి సుందర్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ అజీజ్, గోపాలరావు, నరసింహారావు పాల్గొన్నారు. తొలుత ఎంపీ కేశినేని నానికి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తిరువూరు నియోజకవర్గ నాయకులు బహూకరించారు.



ఎంపీ కేశినేనికి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని బహూకరిస్తున్న తిరువూరు నాయకులు

టెన్నిస్ టోర్నీ రన్నర్‌గా మల్లికార్జునరావు

విజయవాడస్పోర్ట్స్: ఆలిండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్(ఐస్టా) 17వ జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో విజయవాడ క్రీడాకారుడు ఎం.మల్లికార్జునరావు సత్తా చాటాడు. విశాఖపట్నంలోని వాల్తేరు ఆఫీసర్స్ క్లబ్‌లో ఇటీవల జరిగిన ఈ పోటీల 75 ఏళ్ల పైబడిన డబుల్స్ విభాగంలో రన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. జాతీయ టోర్నీలో ట్రోఫీ సాధించిన క్రీడాకారుడు మల్లికార్జునరావును టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న మల్లికార్జునరావు

పతకాలు పొందిన విద్యార్థులకు అభినందనలు

విజయవాడస్పోర్ట్స్: ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పతకాలు సాధించారని ఆంధ్రా లయోల కాలేజీ ప్రిన్సిపాల్ జె.ఎ.పి.కిషోర్ తెలిపారు. సాంస్కృతిక పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన బి.అభిలాష్, గుర్రపు స్వారీలో కాంస్య పతకాన్ని సాధించిన వి.భానుకృష్ణసాయిని కాలేజీ ప్రాంగణంలో శనివారం అభినందించారు. నైతికతను ప్రతిబింబించేలా, క్రమశిక్షణ, నాయకత్వ, దేశభక్తి విలువలు పెంపొందించేలా తమ కళాశాలలో శిక్షణ ఉటుందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కె.పరమేశ్వరరావు, బి.జాన్సన్, ఎస్.లక్ష్మీనిరంజన్, వై.సుబ్బారెడ్డి, డి.ఎలీషా పాల్గొన్నారు.



రిపబ్లిక్ డే వేడుకల్లో పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న దృశ్యం

అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన పోలవరపు సాయికుమార్ అలియాస్ అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేటకు చెందిన అగ్గిపుల్ల సాయి గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించినా అతని ప్రవర్తలో మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. నగర బహిష్కరణ జరిగినా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. నగరంలోకి ప్రవేశిస్తే అల్లర్లు సృష్టించి ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు సమాయత్తమవుతున్నాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించినట్లు స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్న, చెడు నడత కలిగిన వ్యక్తులను ఉపేక్షించకుండా నగరం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులపై వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర విస్తృత ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో ఆమె నిర్వహిస్తున్న గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం శనివారం 3వ డివిజన్‌లో బైబిల్ స్కూల్ ప్రాంతంలో కొనసాగింది. సుధీర ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఆ ప్రాంతంలో ఏమి పనులు చేస్తాం, ఎలాంటి అభివృద్ధి చేస్తారో వివరిస్తూ ముద్రించిన డివిజన్ మ్యానిఫెస్టో కరపత్రాలను వారికి అందచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కో ఆప్షన్ సభ్యులు మునునూరు సుబ్బారావు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



గుణదలలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్న దేవినేని సుధీర

భక్తి తత్వాన్ని చాటిన కబీర్ నాటకం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ప్రదర్శించిన కహాన్ కబీర్ హిందీ నాటకం భక్తి తత్వాన్ని చాటింది. కబీర్‌దాస్ భారతీయుల ఆధ్యాత్మిక గురువు. కబీర్ కాలం నాటి మనుషుల జీవన విధానం, సామాజిక పరిస్థితులను నాటకంలో పొందుపరిచారు. రచన, దర్శకత్వం బన్సీకౌల్ వ్యవహరించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్. మల్లికార్జునరావు, సాంస్కృతిక శాఖ మేనేజర్లు సీహెచ్ శ్రీనివాస్, సుమన్, ఫ్యాకల్టీ వినయ్ పాల్గొన్నారు.

తోపుడు బండ్లు పంపిణీ



తోపుడు బండ్లు అందిస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పటమట 14వ డివిజన్‌లో ఏడు కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం రూ. 2లక్షల విలువైన రెండు టిఫెన్ బండ్లు, 5 తోపుడు బండ్లను అందించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో రూ.650 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించామని చెప్పారు. దేవినేని నెహ్రూ పేరుపై పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. జీవనోపాధి నిమిత్తం పేద ప్రజలకు సహాయాన్ని అందిస్తున్నామన్నారు. 14వ డివిజన్‌లో రూ.6 కోట్లుతో ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 14వ డివిజన్ కార్పొరేటర్ చింతల సాంబయ్య, పార్టీ నాయకులు సుబ్బరాజు, శెట్టికం దుర్గ ప్రసాద్, రిజ్వాన్, సన్నీ, మల్లి, ఉమా, సిద్దయ్య, శేషగిరి, ఎస్.వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. నూరు వసంతాల మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. పుణ్యక్షేత్ర ప్రాంగణమంతా యాత్రికులతో నిండిపోయింది. ఏలూరు రోడ్డులోని మేరీమాత ఆర్చివద్ద నుంచి పుణ్యక్షేత్ర ప్రధానాలయం, మేరీమాత స్వరూపం, కొండ శిఖరాగ్రం వరకు భక్త జనం బారులు తీరారు. దీంతో కొండ పై గల మెట్ల మార్గాలు, కాలిబాటలు కిక్కిరిసిపోయాయి. శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుణదల కొండ రాత్రి సమయాల్లో విద్యుద్దీప కాంతులతో కాంతులీనుతోంది. ఆదివారం ఉదయం 6:30 నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఉదయపు ప్రార్థనలో పాల్గొన్న ఫాదర్లు



భక్తులకు సత్రసాదం అందిస్తున్న ఫాదర్



గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

ఘనంగా వార్షికోత్సవం

మొగల్రాజపురం: విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటుగా సమాజంలో జరుగుతున్న సంఘటనలను తెలుకోవడానికి దినపత్రికలు రోజూ చదువుతుండాలని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పర్వతనేని సంతోష్‌కుమార్ చెప్పారు. పీబీ సిద్ధార్థ జూనియర్, డిగ్రీ కళాశాల 49వ వార్షికోత్సవం శనివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా బాబు

ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి



మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చంద్రబాబు చిత్తూరు జిల్లా వాసి అయినప్పటికీ ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ రెడ్డి అన్నారు. సీఎం జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. శనివారం చిత్తూరులో ఆ యూనియన్ అనుబంధమైన చిత్తూరు నగర ట్రేడ్ యూనియన్ ప్రథమ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. చిత్తూరులోని విజయ డెయిరీ, షుగర్ ఫ్యాక్టరీలను మూసివేయించిన చంద్రబాబు.. స్థానికులకు ఉద్యోగాలు లేకుండా చేశారన్నారు. జగనన్న అధికారం చేపట్టిన రోజు ఖజానాలో పెద్దగా డబ్బులు లేవని, పైగా కరోనా వచ్చి దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం స్తంభించిందన్నారు. అయినా సీఎం జగన్ సంక్షేమ పథకాలు ఆపలేదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 6 పోర్టులు, 3 ఎయిర్‌పోర్టులు నిర్మిస్తున్నారని, అచ్యుతాపురంలో 2,272 పరిశ్రమలు వచ్చాయన్నారు. సచివాలయాల ద్వారా ఉద్యోగులు, వలంటీర్లు కలిపి మొత్తం 4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు.

సీఎం జగన్, బాబు మధ్య తేడా గమనించండి

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు సాగించిన దుష్టపాలనను ప్రజలు చూశారని.. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అవినీతి రహిత పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పనితీరునూ ప్రజలు చూస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఎవరి పాలనలో ప్రజలు బాగున్నారో బేరీజు వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. అక్కచెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేస్తే, ప్రజాసంకల్ప యాత్రలో పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మాఫీపై మహిళలు అడిగిన మేరకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సీఎం జగన్ నాలుగు విడతల్లో రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రజా సొకర్యానికి చంద్రబాబు అండ్ కో, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అడ్డంకిగా మారారని దుయ్యబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన, వలంటీర్ వ్యవస్థ వద్దన్నారని, అయినప్పటికీ సీఎం వైఎస్ జగన్ చెక్కుచెదరకుండా వాటన్నింటినీ అమలు చేస్తున్న విషయాన్ని గమనించాలని కోరారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయండి

కేంద్రాన్ని కోరిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కొత్త పార్లమెంట్ భవనంలో సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కేంద్రాన్ని కోరారు. శనివారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీలు ఒకరినొకరు కలుసుకోవాలంటే సెంట్రల్ హాల్ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. కరోనా సమయంలో ప్రధాని మోదీ అద్భుతంగా పని చేశారన్నారు. ప్రపంచ యవనికపై భారతదేశ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేలా కృషి చేశారన్నారు. దేశానికి అద్భుతమైన ప్రధాని వచ్చారని వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం జగన్ అనేక సందర్భాల్లో పార్టీ నేతలతో చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. కరోనా కారణంగా స్తంభించిన 17వ లోక్‌సభ కాలవ్యవధి పెంచాల్సిందిగా పలువురు సభ్యులు సరదాగా మాట్లాడుకునేవారమన్నారు. ఈ మేరకు నూతన చట్టం చేయాల్సిందని అనుకునేవాళ్ల మనడంతో సభంతా నవ్వులమయమైంది.


ఏపీకి అన్యాయం జరిగింది

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

సాక్షి, పాడేరు: రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి అన్యాయం జరిగిందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై తొలి సంతకం ఉంటుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో శనివారం ఆమె రచ్చబండ నిర్వహించారు. గిరిజన యువతులతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో షర్మిల మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో గిరిజన ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక హోదాను మరిచిపోయారని ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ మద్దతు నిచ్చే ప్రయత్నాల్లో ఉందన్నారు.

సంస్కరణలు వద్దట.. వెనుకబాటే ముద్దట

- ప్రభుత్వ విద్యా సంస్కరణలపై ఈనాడు తప్పుడు ప్రచారం
- ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తుంటే తట్టుకోలేని రామోజీ
- చంద్రబాబు హయాంలో కుదేలైన ప్రభుత్వ విద్యా వ్యవస్థ
- 1,785 పాఠశాలలను మూసేసిన బాబు ప్రభుత్వం
- పేద పిల్లలూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నది సీఎం జగన్ ఆకాంక్ష
- 2021లో సమగ్ర అధ్యయనం తర్వాత ప్రభుత్వ విద్యా రంగంలో సంస్కరణలు అమలు
- ఉన్నత స్థాయి ప్రమాణాలతో పాఠశాలల్లో సదుపాయాలు
- బాబు మూసేసిన స్కూళ్లనూ తెరిచిన సీఎం జగన్
- కేవలం 4943 ప్రైమరీ, యూపీ స్కూళ్లు 3557 ప్రీ–హైస్కూల్స్, హైస్కూళ్లతో మ్యాపింగ్
- కిలోమీటరు లోపు దూరం ఉన్న స్కూళ్లే మ్యాపింగ్
- దీని ద్వారా 3 వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన
- విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు



సాక్షి, అమరావతి: విద్యా వ్యవస్థలో మార్పును, సంస్కరణలను స్వాగతించకపోతే వర్తమానంలో యువత రాతియుగంలోనే ఆగిపోతుందన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాటలు కూడా ఎల్లో మీడియాకు ఎక్కవు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యా రంగంలో తెచ్చిన మార్పులు, సంస్కరణలు ఓవైపు మన పిల్లలను బంగారు భవిత వైపు నడిపిస్తుంటే, రామోజీరావుకు కంటగింపుగా ఉంది. ఇలాంటి మార్పు, సంస్కరణలు వద్దనే రీతిలో ఈనాడులో తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారు. పేదింటి పిల్లలు అరకొర చదువులతో నిరుద్యోగులుగా, పెత్తందారుల వద్ద బానిసలుగా బతకాలన్నదే రామోజీ కోరిక. పేదింటి పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగితే తమ బూర్జువా వ్యవస్థ కూలిపోతుందని, చై–నా స్కూళ్ల ప్రాధాన్యం తగ్గిపోతుందన్న భయంతో 'వినాశకాలే ౦.విలీనబుద్ధి' అంటూ విషం చిమ్మారు. అసలు వాస్తవాలను పరిశీలిస్తే..

బాబు హయాంలో కుప్పకూలిన విద్యా వ్యవస్థ

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా చేపట్టిన చర్యలతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ కుప్పకూలింది. ప్రభుత్వ బడుల్లో కనీస సదుపాయాలూ కల్పించలేక సరిపడినంత మంది విద్యార్థులు లేరన్న సాకుతో 2014–2019 మధ్య 1,785 పాఠశాలలను మూసివేశారు. విద్యా బోధన ప్రమాణాలు దెబ్బ తిన్నాయి. పిల్లలు వయసుకి తగిన అభ్యాస ఫలితాలను సాధించలేకపోయారు. ఆరో తరగతికి వచ్చే విద్యార్థులు తక్కువ స్టాండర్డ్స్‌తో వస్తున్నారని, బేసిక్స్ కూడా తెలియక సిలబస్‌ను అర్థం చేసుకోలేకపోతున్నారని ఉపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఎంతసేపూ ప్రైవేటు విద్యా రంగానికి నిచ్చెనలు వేసిన చంద్రబాబు ప్రభుత్వం.. ప్రభుత్వ విద్యా రంగాన్ని పాతళంలోకి తోసేసింది. దీంతో పేదింటి పిల్లలు చదువులు మానేసే పరిస్థితి ఏర్పడింది.

పేద పిల్లలపై సీఎం జగన్ మమకారం


పేద పిల్లలు కూడా కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో సమానంగా ఎదగాలన్నది సీఎం జగన్ ఆకాంక్ష. దీనికి అనుగుణంగా వైఎస్ జగన్ ప్రభుత్వం విద్యా సంస్కరణలపై అధ్యయనం చేసింది. ఎంతోమంది ఉపాధ్యాయుల సూచనలతో 'నాడు–నేడు' పథకంతో సంస్కరణలు చేపట్టింది. చంద్రబాబు హయాంలో మూతపడిన స్కూళ్లన్నింటినీ తిరిగి తెరిచింది. 2022–23 విద్యా సంవత్సరంలో కిలోమీటరు లోపు ఉన్న 8,643 ప్రాథమిక, యూపీ పాఠశాలలను గుర్తించింది. వీటిలో కేవలం 4,943 పాఠశాలలను సమీపంలోని 3,557 ప్రీ–హై స్కూల్స్, హైస్కూళ్లతో మ్యాపింగ్ చేసింది. ఫలితంగా 3 నుంచి 5 తరగతులకు చెందిన 2,43,540 మంది విద్యార్థులకు బీఈడీ అర్హత గల సబ్జెక్టు టీచర్ల ద్వారా విద్యాబోధన అందిస్తున్నారు. దీనివల్ల పిల్లల్లో అభ్యాసన సామర్థ్యాలు బలోపేతమవుతున్నాయి. సబ్జెక్టు టీచర్ల పర్యవేక్షణ ఉండడంతో దీర్ఘకాలంలో 3వ తరగతి నుంచి పిల్లల పనితీరు మెరుగుపడుతుంది. ఈ సంస్కరణలను ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సైతం స్వాగతించారు. మౌలిక సదుపాయాలు, సరిపడినన్ని తరగతి గదులు ఉన్నచోట మాత్రమే ఈ నిర్ణయం తీసుకున్నారు. మ్యాపింగ్ కారణంగా ఏ పాఠశాలనూ మూసివేయలేదు. మ్యాపింగ్ చేసిన ఉన్నత పాఠశాలల్లో 66,245 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు 3–10 తరగతుల్లో బోధన చేయాలి. ఇందులో 59,663 మంది ఉపాధ్యాయులు ఇప్పటికే పనిచేస్తున్నారు. పదోన్నతి ద్వారా ఈ విద్యా సంవత్సరంలో 6,582 మంది సబ్జెక్ట్ టీచర్లను మ్యాప్ చేసిన హైస్కూళ్లకు పంపించారు. నాడు–నేడు ఫేజ్–2లో 13,868 అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు.

- ప్రభుత్వ విద్యలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 1, 2 తరగతుల బోధన, అభ్యాసంపై దృష్టి కేంద్రీకరించి, తదుపరి అభ్యాసానికి పునాది వేసింది. పైగా అంగన్వాడీలను పీపీ–1, పీపీ–2 బోధన స్థాయికి పెంచింది. 1, 2 తరగతుల నమోదు ఆధారంగా అన్ని ఫౌండేషన్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించారు. ప్రాథమిక పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీలు, హైస్కూళ్లల్లో 62 వేల ఐఎఫ్‌పీ స్క్రీన్లతో డిజిటల్ బోధన సాగుతోంది.

ఏపీలో పొత్తులపై త్వరలోనే స్పష్టత

పెద్ద కుటుంబం ఉండాలన్నదే మా విధానం

- కొన్ని ఘటనల్లో, రాష్ట్రాల్లో పరిస్థితులవల్లో మిత్రపక్ష పార్టీలు బయటకు వెళ్తాయి
- ఏ పార్టీనీ ఎన్డీఏలోంచి గెంటేయలేదు
- ఎకనామిక్స్ టైమ్స్ సమ్మిట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పొత్తులపై మరికొన్ని రోజుల్లో స్పష్టత వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. పొత్తులపై కొద్ది రోజులు వేచి చూడాలని అన్నారు. ఎకనామిక్స్ టైమ్స్ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 'దక్షిణాదిలో టీడీపీ అధినేత చంద్రబాబు, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని మోదీ సహా మీతో చర్చలు జరిపారు. ఏపీలో ఎన్డీఏ విస్తరణ జరుగుతోందా' అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'కూటమిలు, ప్రభుత్వాల ఏర్పాటు వేదికలపై జరగవు. సరైన సమయం రావాలి. కొద్ది రోజుల్లోనే దీనిపై స్పష్టత వస్తుంది' అని చెప్పారు. అకాలీదళ్‌ని కలుపుకొనే విషయంపై చర్చలు సాగుతున్నాయని, ఇంకా నిర్ణయం జరుగలేదని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలు, అజెండాలపై ఓ స్థిరాభిప్రాయంతో నిలకడగా ఉందని, దీనికి అనుగుణమైన కొందరు మిత్రులు వస్తారు, మరికొందరు బయటకు వెళతారని అన్నారు. కొన్ని సంఘటనల కారణంగానో లేక రాష్ట్రాల్లోని ప్రత్యేక రాజకీయ పరిస్థితుల దృష్ట్యానో మిత్రపక్ష పార్టీలు బయటకు వెళ్తాయన్నారు. ఇంతవరకు ఏ పార్టీనీ బీజేపీ ఎన్డీఏలోంచి బయటకు గెంటెయ్యలేదని స్పష్టం చేశారు. ప్రతి సందర్భంలోనూ బీజేపీ కూటమి ధర్మాన్ని పాటించిందని అన్నారు. చాలా చోట్ల మహా కూటమిలు కట్టి విజయం సాధించాక కూడా చిన్న కూటమిల నుంచి ముఖ్యమంత్రులను చేశామని చెప్పారు. కొన్ని చోట్ల పార్టీ పూర్తి సంఖ్యలో సీట్లు గెలిచినా, మిత్రపక్షాలకు సముచితమైన స్థానం కల్పించామన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని పోయేందుకే ప్రయత్నించామని తెలిపారు. కుటుంబ పరంగా ఫ్యామిలీ ప్లానింగ్ బావుంటుంది కానీ, రాజకీయంగా ఎంత పెద్ద కుటుంబం ఉంటే అంత మంచిదని తాము నమ్ముతున్నామని, పెద్ద కుటుంబం ఉండేందుకు ప్రయత్నం చేస్తామని, అందులోకి అందరినీ స్వాగతిస్తామని అమిత్ షా వివరించారు. పొత్తులపై పార్టీ రాజనీతి ఎలా ఉంటుందన్న ప్రశ్నకు స్పందిస్తూ.. 'జన్‌సంఘ్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు మా మౌలిక సిద్ధాంతం ఒక్కటే. ఇందులో ఎలాంటి మార్పు లేదు. ఒకవేళ భవిష్యత్తులో మా సిద్ధాంతంలో మార్పులు వస్తే దానికి సరిపోయే వాళ్లు మాత్రమే మాతో వస్తారు, వారందరినీ స్వాగతిస్తాం' అని అమిత్ షా స్పష్టం చేశారు.

జనసేన తరఫున వీరికి ఎంపీ సీట్లివ్వండి

మాజీ ఎంపీ హరిరామజోగయ్య లేఖ



పాలకొల్లు సెంట్రల్: వచ్చే ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసేందుకు సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆ పార్టీకి కాపు సంక్షేమ సేన నాయకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య సూచించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన ద్వారా లేఖను విడుదల చేశారు. పొత్తులో భాగంగా విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, తిరుపతి, రాజంపేట లోక్‌సభ స్థానాలను జనసేనకు కేటాయించాలన్నారు. విజయనగరం నుంచి గేదెల శ్రీనివాస్(తూర్పు కాపు), అనకాపల్లి నుంచి కొణిదెల నాగబాబు, బొలిశెట్టి సత్యనారాయణ (కాపు), కొణతాల రామకృష్ణ (గవర), కాకినాడ నుంచి సానా సతీశ్(కాపు), నరసాపురం నుంచి మల్లినీడి తిరుమలరావు(కాపు), మచిలీపట్నం నుంచి బాలశౌరి (కాపు), తిరుపతి నుంచి వరప్రసాద్ (ఎస్సీ), రాజంపేట నుంచి ఎస్.బాల సుబ్రహ్మణ్యం, ఎంవీ రావు(బలిజ)కు సీట్లు కేటాయించాలని సూచించారు.

ఇన్‌చార్జులపై 'రూకలు'పోటు

- ఆదోని డివిజన్‌లో టీడీపీ కుతంత్రం

సాక్షి ప్రతినిధి కర్నూలు: కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో టీడీపీ మసిబూసి మారేడు కాయ చేసి ప్రస్తుత ఇన్‌చార్జులను వంచించేందుకు యత్నిస్తోంది. ఇప్పటివరకు వారిచేత డబ్బులు ఖర్చుచేయించి ఇప్పుడు రోకలిపోటుకు సిద్ధమైంది. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోనిలో అభ్యర్థులను మార్చేందుకు యోచిస్తోంది. ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పుపై టీడీపీ జోన్–4 ఇన్‌చార్జ్ బీద రవిచంద్రయాదవ్ పలువురితో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రస్తుత ఇన్‌చార్జ్‌లు డైలమాలో పడ్డారు. ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆయనను కాదని మాచాని సోమనాథ్‌ను బరిలోకి దించే యోచనలో టీడీపీ ఉంది. శనివారం కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, సోమనాథ్‌ను కలిశారు. టికెట్ విషయం ప్రస్తావించారు. అయితే సమయం ఇవ్వాలని ఆలోచించి చెబుతామని సోమనాథ్ చెప్పినట్లు తెలుస్తోంది. సోమనాథ్‌కు టికెట్ ఇస్తే జయనాగేశ్వరరెడ్డి రాజకీయ ప్రయాణం ముగిసినట్లే! ఆదోని ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నాయుడు కొనసాగుతున్నారు. పొత్తులో భాగంగా జనసేన తరఫున సినీ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ టికెట్ దక్కించుకోవాలని భావిస్తున్నారు. కుదరకపోతే తానే టీడీపీ తరఫున బరిలోకి దిగాలనే యోచన కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. టీజీ వెంకటేశ్‌కు బంధువు కావడంతో విశ్వప్రసాద్‌కు టికెట్ ఇప్పించేందుకు వెంకటేశ్, భరత్ కూడా యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మీనాక్షినాయుడు శుక్రవారం ఆదోనిలో సదస్సు నిర్వహించారు. 'ఎవరంటే వారు టికెట్ అడుగుతున్నారని, ఇదేమైనా సినిమా టికెట్టా? అంటూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తనకేనా లేదా తన కుమారుడు భూపాల్ నాయుడుకైనా టికెట్ వస్తుందని,లేనిపక్షంలో ఏం చేయాలో ఆలోచిస్తానని చెప్పినట్లు సమాచారం.

మంత్రాలయంలో రాఘవేంద్ర జపం

మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్‌గా తిక్కారెడ్డి ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో తిక్కారెడ్డి ఓడారు. ఈ ఎన్నికల్లో ఆయనకు కాకుండా బీసీ వర్గానికి చెందిన రాఘవేంద్రని బరిలోకి దించాలని టీడీపీ యోచిస్తోంది. ఇటీవల టీడీపీలో చేరిన రాఘవేంద్ర.. చంద్రబాబును కలిశారు. కచ్చితంగా బీసీలకే టిక్కెట్ ఇస్తామని, డబ్బులు సిద్ధం చేసుకోవాలని రాఘవేంద్రకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో 2 ఎన్నికల్లో టీడీపీ కోసం భారీగా ఖర్చు చేశానని, తనకు టికెట్ ఇవ్వకపోతే పార్టీలో కొనసాగనని తిక్కారెడ్డి తన వర్గీయులతో చెప్పినట్లు సమాచారం.

రండి టికెట్టిస్తాం..

- ఏలూరు టీడీపీలో అభ్యర్థుల వేట



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా టీడీపీ సీట్ల పంచాయతీలో కులపోరు తారాస్థాయికి చేరింది. ఏలూరు ఎంపీ సీటు ఏ సామాజిక వర్గానికి అనేది ఇప్పటికీ తేల్చుకోలేక సతమతమవుతోంది. వైఎస్సార్‌సీపీ బడుగు వర్గాలకు పెద్దపీట వేస్తూ ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను ప్రకటించడంతో టీడీపీలో గందరగోళం నెలకొంది. టీడీపీ ఆవిర్భావం నుంచి కమ్మ సామాజిక వర్గానికే టికెట్ ఇస్తున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లోను ఇదే గందరగోళం కొనసాగుతోంది.కైకలూరు, చింతలపూడి నియోజకవర్గాలకు ఇన్‌చార్జులనూ నియమించలేదు. నూజివీడు, దెందులూరులో టికెట్ ఆశిస్తున్న వారిపై అసమ్మతి ఉంది.

కమ్మ వర్సెస్ బీసీ

మాగంటి బాబు ఏలూరు ఎంపీ స్థానానికి ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన క్రియాశీలకంగా లేకపోయినా.. 6 నెలలుగా టికెట్ కోసం హడావుడి చేస్తున్నారు. అతని ఆర్థిక పరిస్థితి బాగా లేదని, ఇతర కారణాలు చెప్పి టీడీపీ అధిష్టానం టికెట్ ఇవ్వలేనని పరోక్షంగా సంకేతాలిచ్చింది. అయినప్పటికీ కడదాకా లాబీయింగ్ చేస్తున్నారు. అదే సామాజిక వర్గం నుంచి మరో ఇద్దరు వ్యాపారులు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇంతలో బీసీ కార్డు తెర మీదకు తేవడంతో కమ్మ సామాజికవర్గంలో అసంతృప్తి మొదలైంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ప్రకటించకముందు.. డబ్బే ప్రామాణికంగా రూ.50 కోట్లు ఖర్చు పెట్టేవారు సంప్రదించవచ్చని సంకేతాలు పంపారు. సొంత సామాజిక వర్గం నుంచి ఇద్దరు వ్యాపారులు బరిలోకి దిగగా వారిలో ఒకరికి టికెట్ ఇస్తామని సంకేతాలిచ్చారు. ఇప్పుడు బీసీలకు టికెట్ ఇస్తామని ఇన్‌చార్జులకు పరోక్షంగా చెప్పడంతో ఆ ఇద్దరు వ్యాపారులు తెరమరుగయ్యారు. ఓ బీసీ అభ్యర్థి టికెట్‌పై ఆశలు పెట్టుకున్నాడు. పార్టీ కోసం డబ్బు ఖర్చు పెట్టడంతో అతనికే అవకాశం ఇస్తామని ప్రచారం జరిగింది. 20 రోజులుగా ఆ ఎన్నారై అందుబాటులో లేడు.

నియోజకవర్గాల్లోనూ రగడ

దెందులూరులో మాజీ ఎమ్మెల్యే చింతమనేనిని సొంత సామాజిక వర్గ నేతలే వ్యతిరేకించి సమావేశాలు నిర్వహిస్తున్నారు. చింతమనేని వద్దు–ఎవరైనా ముద్దు అనే నినాదంతో అధిష్టానానికి చింతమనేనిపై ఫిర్యాదు చేశారు. 2019 నుంచి ఇప్పటివరకు చింతలపూడి నియోజకవర్గంలో ఇన్‌చార్జి కూడా లేరు. 2019లో మాజీ మంత్రి పీతల సుజాత ఓడిపోయిన తర్వాత ఎవరినీ ఇన్‌చార్జ్‌గా నియమించలేదు. కైకలూరు నియోజకవర్గంలో జయమంగళ వెంకట రమణ వైఎస్సార్‌సీపీలో చేరడంతో అక్కడ ఇన్‌చార్జ్‌ను నియమించకుండా ఇన్నాళ్లూ సాగదీశారు. పొత్తుల్లో అవసరమైతే కైకలూరును వదులుకుంటారని టీడీపీ నేతలే ప్రచారం చేస్తున్నారు.

• తెలంగాణ

6 గ్యారెంటీలకు కావాల్సింది రూ.80 వేల కోట్లు.. ఇచ్చింది రూ. 53,196 కోట్లే

- శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రేవంత్ సర్కార్
- ఏ హామీకి ఎంత కేటాయించారో స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- 100 రోజుల్లోగా పూర్తి స్థాయిలో ఆరు గ్యారెంటీల అమలు అనుమానమే
- రూ.2 లక్షల రైతు రుణమాఫీకి నిధుల కేటాయింపుపై ప్రస్తావనే లేదు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లోగా పూర్తిస్థాయిలో అమలు చేయడం కష్టమేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే.. పూర్తిస్థాయిలో 6 గ్యారెంటీల అమలుకు కనీసం రూ.80 వేల కోట్లు అవసరమని అంచనా. శనివారం శాసనసభలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.2,75,891 కోట్లను ప్రతిపాదించగా అందులో 6 గ్యారెంటీల అమలుకు రూ. 53,196 కోట్లనే చూపింది. అందులోనూ ఏ హామీ అమలుకు ఎన్ని నిధులు కేటాయించిందీ స్పష్టత ఇవ్వలేదు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీని త్వరలోనే అమలు చేస్తామని ప్రకటించినా పథకానికి నిధుల కేటాయింపులు ఎంతో ప్రకటించలేదు.

ఒక్క రైతు భరోసాకే రూ.29 వేల కోట్లపైన..

- మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 చొప్పున ఆర్థిక సాయం అందించడానికి ఏడాదికి రూ.6 వేల కోట్లు
- రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందించడానికి ఏటా కనీసం రూ. 2,923.65 కోట్లు
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడానికి సుమారు రూ. 2,200 కోట్ల వ్యయం కానుందని అంచనా.
- ఇక రైతు భరోసా పథకం కింద రైతులు, కౌలు రైతులకు ఎకరానికి ఏటా రూ.15 వేల చొప్పున, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల చొప్పున ఆర్థిక సాయం, వరి పంటకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడానికి ఏటా రూ. 29 వేల కోట్లు అవసరం.
- గృహజ్యోతి పథకం కింద ఇళ్లకు ప్రతి నెలా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరాకు ఏటా రూ. 4,164.29 కోట్లు అవసరం.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం, రూ. 5 లక్షల ఆర్థిక సాయం, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకానికి ఏటా రూ. 15 వేల కోట్ల నిధులు అవసరం.
- విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు విషయంలో ఏ స్థాయి విద్య కోసం ఎందరు విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారనే అంశంపై స్పష్టత వస్తేనే ఈ పథకం అమలుకు అవసరం కానున్న నిధులను అంచనా వేయడానికి వీలుంది. ఏటా 2 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం వర్తింపజేస్తే రూ. 10 వేల కోట్ల నిధులు అవసరం అవసరమవుతాయని చెబుతున్నారు.
- చేయూత పథకం కింద నెలకు రూ. 4 వేల పెన్షన్, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఆసరా పథకం కింద మొత్తం 43,68,784 మంది ప్రతి నెలా పెన్షన్లు అందుకుంటున్నారు. వారికి రూ. 4 వేల పెన్షన్ చెల్లిస్తే ఏటా రూ. 20,970 కోట్లు అవసరం అవుతాయి. రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా అమలుకు అదనంగా నిధులు అవసరమవుతాయి.

విభజన హామీలెన్నో ఇప్పటికీ అమలు చేయలేదు

- ప్రత్యేక హోదా ప్రకటన లేదు.. పోలవరం సవరించిన అంచనాలు ఆమోదం కాలేదు
- రాజ్యసభలో ఎంపీ అయోధ్యరామిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: విభజన తర్వాత ఆర్థికంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలెన్నో ఇప్పటికీ అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విభజన తర్వాత రాష్ట్రం కోలుకోవడానికి ఇచ్చిన హామీల్లో ప్రధానమైన హామీలు అమలు కాకపోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపిందన్నారు. రాజ్యసభలో శనివారం 'దేశ ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం'పై జరిగిన చర్చలో ఎంపీ అయోధ్యరామిరెడ్డి వివిధ అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం వద్ద అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర సమస్యలు, ఏపీ ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన గురించి శ్వేతపత్రంలో ప్రస్తావించలేదన్నారు. ఏపీ విభజన చట్టాన్ని తుచ తప్పకుండా అమలు చేయకపోవడం రాష్ట్ర ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తోందన్నారు. సెక్షన్–93 ప్రకారం ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, కడపలో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ హామీలు ఇంకా అమలు కాలేదన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ఈ ప్రాజెక్టు చాలా కీలకమని కేంద్రానికి వివరించారు.

పోలవరంపై జాప్యమెందుకు..

ఫిబ్రవరి 2019లో సాంకేతిక సలహా సంఘం ఆమోదించిన పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు కేంద్రం ఆమోదం తెలపడానికి కేంద్రం ఎందుకు జాప్యం చేస్తోందో అర్థం కావడం లేదని అయోధ్యరామిరెడ్డి అన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కావడంతో సకాలంలో నిధులు కేటాయించి గడువులోగా పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ పదే పదే ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకొస్తున్నా ఎలాంటి కదలిక లేకపోవడం శోచనీయమన్నారు. ప్రాజెక్టు వ్యయం రీయింబర్స్‌మెంట్‌లోనూ జాప్యం చేస్తున్నారన్నారు. పునరావాసం, పరిహారం ప్రక్రియ భారీ స్థాయిలో జరుగుతున్నందున కేంద్రం తక్షణ సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

దేశాభివృద్ధిలో ఏపీ పాత్ర ప్రముఖం

దేశాభివృద్ధిలో ఏపీ ఎంతో ప్రముఖమైన పాత్ర పోషించిందని అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. ఎస్‌బీఐ నివేదికల ప్రకారం 2027 నాటికి ఆంధ్రప్రదేశ్ సుమారు రూ.20 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందన్నారు. ఆరేళ్లలో 10 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు నమోదు చేసిందన్నారు. 2018–19లో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 11 శాతంతో 14 స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ 2022–23 నాటికి జీఎస్‌డీపీ వృద్ధి రేటు 16.2 శాతం సాధించి నాలుగో స్థానానికి చేరిందన్నారు. సముద్ర ఎగుమతుల్లో 40 శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్ పాత్ర ఉందన్నారు. తీర ప్రాంత అభివృద్ధి, ఎగుమతి ఆధారిత పెట్టుబడుల్లో గణనీయమైన మూలధన పెట్టుబడిలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

అంజనాద్రి, లేపాక్షిని అభివృద్ధి చేయండి

- తిరుపతికి విమాన సర్వీసులు, రైళ్లు పెంచండి
- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని అంజనాద్రి, లేపాక్షి క్షేత్రాల అభివృద్ధికి కేంద్రం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎం.గురుమూర్తి కోరారు. రామాయణ ఘట్టాలకు ఈ క్షేత్రాలు నిలువెత్తు సాక్ష్యాలని.. వీటి అభివృద్ధి ద్వారా రాముడి స్ఫూర్తి, ఆధ్యాత్మికత మరింత బలపడుతుందన్నారు. శనివారం లోక్‌సభలో అయోధ్య రామమందిర నిర్మాణంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. ఏడు కొండల్లోని అంజనాద్రి కొండను హనుమంతుని జన్మస్థలంగా పరిగణిస్తారని.. సీతాదేవి అపహరణ సమయంలో రావణుడి దాడిలో తీవ్రంగా గాయపడి జటాయువు పడిపోయిన ప్రదేశాన్ని లేపాక్షిగా పిలుస్తారని వివరించారు. ఈ క్షేత్రాలను అభివృద్ధి చేస్తే.. దేశ సాంస్కృతిక వారసత్వ పర్యాటకం మరింతగా పెరుగుతుందన్నారు. అలాగే నిత్యం లక్షలాది మంది శ్రీవారి ఆలయాన్ని సందర్శిస్తారని చెప్పారు. దేశంలోని ప్రధాన నగరాల నుంచి నేరుగా తిరుపతికి విమాన సర్వీసులు లేవని.. ఈ సంఖ్యను పెంచాలని కోరారు. రైళ్ల సర్వీసుల సంఖ్యను పెంచేందుకు కూడా కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న తిరుపతి బస్ టెర్మినల్‌ను ఇంటర్ మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని కోరారు.

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకుడు జగన్

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కొనియాడారు. శనివారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన 'యాత్ర–2' సినిమాను వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'సీఎం జగన్ ఎదుర్కొన్న రాజకీయ కుతంత్రాలను 'యాత్ర–2' సినిమా ద్వారా దర్శకుడు మహి వి రాఘవ ప్రజలకు చక్కగా చూపించారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురి చేస్తుంది. శ్రీకాళహస్తి ప్రాంతంలో పాదయాత్ర చేస్తున్న సమయంలో ఒక రోజు కాలుష్యం వల్ల వైఎస్ జగన్‌కు ముక్కులో నుంచి రక్తం కారింది. విపరీతమైన జ్వరం, కాళ్లకు పుండ్లతో బాధపడ్డారు. ఈ ఒక్క రోజు రెస్ట్ తీసుకోండి, శరీరానికి విశ్రాంతి లేకపోతే మరింత అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని నేనూ, నాతో పాటు ఉన్న డాక్టర్ హరికృష్ణ, మరో ఇద్దరు వైద్యులు సూచించారు. అయినా కూడా ఆయన వెనక్కి తగ్గలేదు. తన కోసం ఎంతో మంది ప్రజలు ఎదురు చూస్తున్నారని.. ఆరోగ్యం బాగాలేదని తాను విశ్రాంతి తీసుకుంటే ప్రజల్ని ఇబ్బంది పెట్టినవాడిని అవుతానంటూ.. అనారోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా యాత్ర చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్' అని గురుమూర్తి చెప్పారు.

క్లుప్తంగా...

జనసేనకు క్యాడర్ లేదు

- టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి
- గతంలో బీజేపీకి వచ్చిన ఓటింగ్ శాతం బట్టే సీట్లు



మాట్లాడుతున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: జనసేన పార్టీకి క్యాడర్ లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడారు. క్యాడర్ పరంగా జనసేన ఇంకా బలపడాల్సి ఉందని, ఎప్పటికైనా నా రాజ్యాధికారం చేపట్టాలని పవన్‌కళ్యాణ్ కోరుకుంటున్నారని చెప్పారు. బీజేపీతో పొత్తు ఇంకా ఖరారు కాలేదని, ఆ పార్టీతో కలవడమా లేక బయటి నుంచి మద్దతు ఇవ్వడమా అనేది ఇంకా నిర్ణయించలేదని స్పష్టం చేశారు. గతంలో బీజేపీకి వచ్చిన ఓటింగ్ శాతం ప్రకారం సీట్ల కేటాయింపు ఉండవచ్చునన్నారు. మొత్తం 175 సీట్లలో తెలుగుదేశం పార్టీనే ఎక్కువగా త్యాగం చేయాల్సి ఉంటుందని గోరంట్ల చెప్పారు.

విచారణపై స్టే ఎత్తివేయండి

టీడీపీ నేత బొల్లినేని భార్య తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు



సాక్షి, హైదరాబాద్: ఏపీలోని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు బొల్లినేని కృష్ణయ్యపై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో దాఖలైన కేసు విచారణపై స్టేను ఎత్తివేసి, దర్యాప్తు జరిపేలా ఆదేశాలివ్వాలని తెలంగాణ హైకోర్టును కృష్ణయ్య భార్య బొల్లినేని కృష్ణవేణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె తరపున సీనియర్ న్యాయవాది రఘునాథ్ పిటిషన్ దాఖలు చేశారు. 'బొల్లినేని కృష్ణయ్య, అతని తరపు బంధువులు డాక్టర్ హేమమాలిని, డాక్టర్ వంకాయలపాటి శ్రీప్రసాద్.. అమాయకులమని పేర్కొనడం, తప్పుడు కేసులో ఇరికించానని పిటిషన్‌లో పేర్కొనడం అసత్యం. నా పెద్ద కూతురిని దత్తత తీసుకున్నట్లు చెబుతున్న హేమమాలిని దాని డాక్యుమెంట్‌ను మాత్రం కోర్టుకు సమర్పించలేదు. నా అనుమతి లేకుండా దత్తత తీసుకోవడం ఎలా సాధ్యం? నా భర్త ఓ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే. ఆర్థికంగా తన కున్న బలంతో ఏమైనా చేయగలరు. నా వద్ద నుంచి తీసుకెళ్లిన పిల్లల(కొడుకు, పెద్ద కూతురు)ను వెనక్కు తీసుకురావాలని ఆయన్ను ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తూనే వస్తున్నా. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని స్టే ఎత్తివేసి, విచారణ పారదర్శకంగా జరిపేలా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను 16కు వాయిదా వేశారు. కాగా, తన భర్త, అతని తరపు బంధువుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని కోరుతూ కృష్ణవేణి ఇదే కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలిస్తూ విచారణను 15వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే.


రామానాయుడు కుటుంబానికి హైకోర్టులో ఊరట

గోపనపల్లి భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన డిక్లరేషన్ రద్దు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి భూముల వ్యవహారంలో నిర్మాత రామానాయుడు కుటుంబానికి హైకోర్టులో ఊరట లభించింది. ఐటీ పార్క్ నిర్మాణం కోసం గోపనపల్లిలోని వీరి భూ సేకరణకు సెక్షన్ 6 (1) ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన డిక్లరేషన్‌ను కొట్టివేసింది. గోపనపల్లిలో భూ సేకరణకు సెక్షన్ 6 (1) ప్రకారం అధికారులు డిక్లరేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ 2005లో నిర్మాత డి.రామానాయుడు ఆయన కుటుంబ సభ్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గ్రామంలో వివిధ సర్వే నంబర్లలోని సుమారు 26 ఎకరాల భూమి తమదేనని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై వాదనలు పూర్తి కావడంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం తీర్పు వెలువరించింది. చట్టంలోని సెక్షన్ 4 (1) ప్రకారం భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించే నోటిఫికేషన్ 2005, మార్చి 10న అధికారులు జారీచేశారు. అభ్యంతరాలను ఏప్రిల్ 4 వరకు ఆహ్వానించారు. తర్వాత.. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఈ అంశంపై విచారణ జరిపారు. సెక్షన్ 5–ఏ మేరకు నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తారు. అయితే డిప్యూటీ కలెక్టర్ విచారణ నివేదికను పిటిషనర్లకు కూడా ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారని పేర్కొంది. వాదనలు, రికార్డులను పరిశీలించామని.. చట్టప్రకారం డిక్లరేషన్ జారీలో విధానపరమైన లోపాలున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది.

శ్రీరస్తు.. శుభమస్తు!

పెళ్లి కళ మోసుకొచ్చిన మాఘమాసం



పెళ్లిళ్లపై ఆధారపడ్డ వర్గాలకు డిమాండ్

ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): శుభ ముహూర్తాల మాఘమాసం వచ్చేసింది. పెళ్లి కళను వెంటబెట్టుకొచ్చింది. 'శ్రీరస్తు.. శుభమస్తు.. అవిఘ్నమస్తు' అనుకుంటూ శుభముహూర్తాలు నిశ్చయించుకున్న కుటుంబాలన్నీ వధూవరులను పెళ్లి పీటలెక్కించి చిద్విలాసాల నడుమ వేదమంత్రాల సాక్షిగా దంపతుల్ని చేసేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మాఘ మాసం నుంచి చైత్రమాసం వరకు మూడు నెలల పాటు శుభకార్యాలకు మంచి ఘడియలు ఉన్నాయని పండితులు పేర్కొంటున్నారు. మాఘమాసం ప్రారంభం కావటంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వివాహాలు జరిపించేందుకు భారీగా ముహూర్తాలు నిశ్చయిస్తున్నట్టు పురోహితులు పేర్కొంటున్నారు. శుభకార్యాలకు ఉత్తరాయణం చాలా విశిష్టమైనదిగా భావిస్తారు. ఆ క్రమంలో మాఘమాసంలో ఈ నెల 13 నుంచి మంచి ముహూర్తాలు మొదలవుతున్నాయి.



మూడు మాసాల్లో కల్యాణ ఘడియలు

మాఘ మాసం (ఫిబ్రవరి)లో 13, 14, 17, 18, 24, 28, 29, మార్చి 2, 3 తేదీలు, ఫాల్గుణ మాసం (మార్చి)లో 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4 తేదీలు, చైత్ర మాసం (ఏప్రిల్)లో 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీల్లో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆయా శుభ ఘడియల్లో వివాహాలు జరిపించేందుకు చాలా మంది తల్లిదండ్రులు ముహూర్తాలను నిర్ణయించుకున్నారు.

మార్కెట్‌కు పెళ్లి కళ



వివాహాలపై ఆధారపడ్డ వర్గాలకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా పురోహితులు, కేటరింగ్, డెకరేషన్, మంగళ వాయిద్యాలు, ఆర్కెస్ట్రా, వస్త్ర దుకాణాలు, బంగారు నగల దుకాణాలు, కల్యాణ మండపాలు వంటి 20 రంగాలు వివాహాలపై ఆధారపడి కొనసాగుతున్నాయి. వీటిని సమన్వయం చేస్తూ ఈవెంట్ మేనేజర్లు వివాహాలను గ్రాండ్‌గా జరిపేందుకు రాష్ట్రంలో ఉన్నారు. ఈ మూడుఎ మాసాలు ఆయా రంగాల వారంతా బిజీ కానున్నారు.

రాష్ట్రంలో లక్షకుపైగా వివాహాలు



రాష్ట్రంలో వచ్చే మూడు నెలల్లో సుమారు లక్ష వరకూ వివాహాలు జరిగే అవకాశం ఉందని పండితులు పేర్కొంటున్నారు. ప్రధానంగా తిరుపతి, విజయవాడ, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం, శ్రీకాళహస్తి వంటి పుణ్యక్షేత్రాల్లో వారి వారి నమ్మకాలు, మొక్కులతో వేలాది జంటలు వివాహంతో ఒక్కటి కానున్నాయి. ఆ పుణ్యక్షేత్రాలతో పాటుగా రాష్ట్రంలోని కల్యాణ మండపాలు ఆయా ముహూర్తాల్లో అధిక శాతం ఇప్పటికే బుక్కయ్యాయి. కల్యాణ మండపాలతో పాటుగా హోటల్స్‌లోనూ వివాహాలను జరుపుకోవటానికి ఆసక్తి చూపుతున్నారు.

ఏప్రిల్ 28 నుంచి మూఢం

ఏప్రిల్ 28వ తేదీ నుంచి మూఢం ప్రారంభమవుతుంది. మూఢం శుభకార్యాలకు మంచిది కాదని, అందువల్ల ఏ ముహూర్తాలూ ఉండవని పండితులు చెబుతున్నారు. ప్రధానంగా మే, జూన్, జూలై మాసాల్లో మూఢంతో పాటు ఆషాఢ మాసం సైతం ప్రారంభం కానుంది. భాద్రపద మాసంలోనూ ముహూర్తాలు ఉండవు. తిరిగి ఆగస్టులో శ్రావణం వచ్చే వరకూ ముహూర్తాలు లేవు. ఏప్రిల్ తరువాత వివాహాలు జరుపుకోవాలనుకునే వారు శ్రావణ మాసం వరకూ ఆగాల్సిందేనని పండితులు చెబుతున్నారు.

మాఘం నుంచి చైత్రం వరకు..



మాఘమాసం నుంచి చైత్ర మాసం వరకూ మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ ఏడాది ఎక్కువ మంది ఈ ముహూర్తాల్లో వివాహాలు జరుపుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. చైత్రం చివరిలో మూఢం ప్రారంభమవుతుంది. శ్రావణం వచ్చే వరకు ముహూర్తాలు లేవు.

– పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, పండితుడు, విజయవాడ

సీఎం జగన్ మేలును ముస్లింలు ఎప్పటికీ మర్చిపోరు

- ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్‌మీరా

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్ తర్వాత అత్యధిక మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముస్లిం ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'నా ముస్లిం మైనార్టీలు' అంటూ వారిని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. లంచాలు, వివక్షకు తావు లేకుండా, సిఫారసుల అవసరం లేకుండా నవరత్నాల ద్వారా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, షాదీ తోఫా, సున్నా వడ్డీ వంటి అనేక పథకాలను అందించారన్నారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో ముస్లింలకు కేవలం రూ.2,665 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా.. సీఎం వైఎస్ జగన్ 57 నెలల కాలంలో ముస్లింలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా దాదాపు రూ.29 వేల కోట్లు లబ్ధి చేకూర్చి తన గొప్ప మనసు చాటుకున్నారన్నారు. టీడీపీ హయాంలో వక్ఫ్ ఆస్తులను దొరికినంత దోచుకున్నారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సుమారు 900 ఎకరాల వక్ఫ్ భూములను ఆక్రమణ చెర నుంచి రక్షించారని వివరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేసిన వైఎస్సార్‌సీపీని 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

'యాత్ర-2' ఫేక్ జీవోపై సీఐడీ కేసు నమోదు

- తప్పుడు జీవోను సృష్టించి ప్రభుత్వంపై బురద జల్లే యత్నం
- యాత్ర–2 సినిమా చూపించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు తప్పుడు ప్రచారం
- సోషల్ మీడియాలో ప్రభుత్వం, సీఎం జగన్‌పై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఫేక్ జీవోను సృష్టించిన వ్యవహారంపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. యాత్ర–2 సినిమాకు జనాన్ని తీసుకెళ్లాలంటూ కలెక్టర్లు, అన్ని శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చినట్టు గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు జీవోను కొందరు దురుద్దేశపూర్వకంగా వైరల్ చేశారు. ఫేక్ జీవోను సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ వి.నాని ఇందిరా.. సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాన్ని అభాసుపాల్జేయాలనే ఉద్దేశంతో కొందరు కావాలనే జీవో నంబర్ 483 పేరుతో ఈ నెల 7వ తేదీన నకిలీ జీవోను సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఖాతాలు సృష్టించి కొందరు తప్పుడు జీవోను పోస్టు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎప్పుడో పదవీ విరమణ చేసి ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నీలం సాహ్ని పేరుతో నకిలీ జీవో సృష్టించినట్టు గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం కేఎస్ జవహర్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారని అందరికీ తెల్సిందే. రాష్ట్ర ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేక్ జీవోను వైరల్ చేసిన సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై మంగళగిరిలోని ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. ఐపీసీ 153–ఎ, 505(2) సెక్షన్లతో కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలను సీఐడీ డీఎస్పీ వీవీ రమణకుమార్‌కు అప్పగించారు.

సింగపూర్, ఆస్ట్రేలియాల్లో యాత్ర–2 విజయోత్సవాలు



ప్రవాసాంధ్రులతో కలసి యాత్ర–2 విజయోత్సవాల్లో సందడి చేస్తున్న మేడపాటి షర్మిలారెడ్డి, దువ్వూరి మురళీకృష్ణారెడ్డి



జై జగన్ నినాదాలతో మార్మోగిన థియేటర్లు

సాక్షి, అమరావతి : యాత్ర–2 సినిమా విజయోత్సవాలను శనివారం సింగపూర్, ఆస్ట్రేలియాల్లో ఘనంగా నిర్వహించారు. దర్శకుడు మహి వి రాఘవ రూపొందించిన ఈ సినిమా విడుదల సందర్భంగా సింగపూర్‌లో నిర్వహించిన ప్రీమియర్ షోకి వందలాది మంది ప్రవాసాంధ్రులు తరలివచ్చారు. ఆస్ట్రేలియాలో భారీ కారు ర్యాలీ నిర్వహించారు. ఏ ముఖ్యమంత్రి అయినా ఎన్నికలొస్తే ప్రజలంతా కలిసి వచ్చి ఎన్నికల్లో పాల్గొని గెలిపించాలని కోరతారని, ఏపీలో చంద్రబాబు మాత్రం ప్రజలను కాదు, పార్టీలను కదిలి రండంటూ వేడుకొంటున్నారని వైఎస్సార్‌సీపీ సింగపూర్ కన్వీనర్ దువ్వూరి మురళీకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. సింగపూర్ బీచ్ రోడ్ గోల్డెన్ మైల్ టవర్ సింగపూర్ కార్నివాల్ సినిమాస్‌లో యాత్ర–2 సినిమా ప్రీమియర్ షో నిర్వహించారు. షో అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొన్నారు. జై జగన్ .. జైజై జగన్ అంటూ నినదించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఏపీఎన్‌ఆర్‌టీ కోఆర్డినేటర్ సందీప్, మలేషియా కన్వీనర్ విజయభాస్కర్, సలహాదారు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆస్ట్రేలియాలోని అన్ని ప్రధాన నగరాల్లో అభిమానులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆస్ట్రేలియాలోని వివిధ నగరాల్లో భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకునేందుకు తనవంతు సహాయ సహకారాలు అందించటానికి వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా టీం సిద్ధంగా ఉందని ఆస్ట్రేలియా ప్రవాసాంధ్రులు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా కన్వీనర్ సి. సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్‌తో భూ వివాదాలకు తెర

ఈ చట్టంపై అపోహలు వద్దు

- ప్రైవేటు భూములకు ఎలాంటి ధోకా లేదు
- నూతన రిజిస్ట్రేషన్ల విధానంతో నష్టం లేదు
- 'సాక్షి'తో సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ చట్టం–2022 వల్ల భూ వివాదాలు, మోసాలను అరికట్టి యాజమాన్య హక్కుపై పూర్తి భరోసా కల్పించే అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. వాస్తవాలను గమనించకుండా కొన్ని రాజకీయ పార్టీలు, కొంత మంది న్యాయవాదులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు దేశంలోని 12 రాష్ట్రాలు ఆసక్తి చూపిస్తున్నాయని, భూములకు శాశ్వత హక్కు రావాలంటే ఈ చట్టం అమలు జరగాలని అన్నారు. యజమాని ఎక్కడున్నా భూమికి రక్షణ అవసరమని, ప్రతి మూడు నెలలకోసారి మొబైల్ ఫోన్‌లో భూమి వివరాలను చెక్ చేసుకునే సౌలభ్యం ఉంటుందని వివరించారు. ఎవరైనా మార్పులు, చేర్పులకు ప్రయత్నిస్తే మనకు సమాచారం కూడా వస్తుందన్నారు. న్యాయ వ్యవస్థలో 66 శాతం కేసులు, 24 శాతం హత్యలు భూ తగాదాలకు సంబంధించినవే ఉన్నాయని చెప్పారు. ఆయన శుక్రవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇందుకు సంబంధించిన పలు విషయాలు వెల్లడించారు. వివరాలు ఇలా..

సాక్షి: ఈ చట్టం వల్ల భూ యజమానులకు ప్రయోజనాలేమిటి?

కల్లం: ఈ చట్టం కింద నిర్వహించే టైటిల్ రిజిస్టర్‌లో పేరు నమోదయితే ఆ భూమికి అతనే యజమాని అనే హామీని ప్రభుత్వం ఇస్తుంది. ఆ భూమిపై హక్కుకు ఈ రికార్డే సాక్ష్యం. ఒకవేళ రికార్డుల్లో ఏదైనా పొరపాటు వల్ల భూమి హక్కులకు భంగం కలిగితే ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లిస్తుంది. ఇందుకోసం టైటిల్ ఇన్సూరెన్సు వ్యవస్థ ఏర్పాటవుతుంది.

సాక్షి: ఈ చట్టం వల్ల ఎలాంటి మార్పులు వస్తాయి?

కల్లం: వ్యవసాయ భూమి కొనుగోలు చెయ్యాలంటే రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ చెల్లించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు చేయించుకోవాలి. ఆ తరువాత ఆర్‌వోఆర్ చట్ట రిజిస్ట్రేషన్ ప్రకారం తహసీల్దార్ విచారణ చేసి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చెయ్యాలి. కొత్త చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేచోట, ఒకేసారి జరుగుతాయి. భూమి కొనుగోలు చేసిన వ్యక్తికి సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటే హక్కులకు సంపూర్ణ హామీ ఉన్నట్లే.

సాక్షి: రెవెన్యూ రికార్డుల్లో ఎలా నమోదు చేసుకోవాలి?

కల్లం: తహసీల్దార్‌కు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్ విచారణ చేసి నమోదు చేస్తారు. పట్టాదారు రికార్డుల్లో పాస్ పుస్తకం జారీ చేస్తారు. కొత్త విధానంలో టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేసి, సర్టిఫికెట్ జారీ చేస్తారు. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి ప్రాథమిక పరిశీలన చేసి, రికార్డుల వివరాలు, దరఖాస్తుదారు అర్జీల్లో పొందుపరిచి నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తారు.

సాక్షి: టైటిల్ రిజిస్టర్‌లో ఏర్పడే భూ వివాదాలను ఎవరు పరిష్కరిస్తారు?

కల్లం: భూమి రికార్డులను రూపొందించిన ఆ రికార్డుల్లో పొరపాట్లను సరి చెయ్యడానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటయ్యింది. భూమి యజమానుల రికార్డు అయినా రిజిస్టర్ 1, 1బిలో తప్పులుంటే సవరణ కోసం ఆర్‌వోఆర్ చట్టం కింద రెవెన్యూ డివిజనల్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చు. జాయింట్ కలెక్టర్ దగ్గర రివిజన్ పిటిషన్ దాఖలు చెయ్యవచ్చు. కొత్త చట్టం కింద నిర్వహించే టైటిల్ రిజిస్టర్‌లో తప్పులుంటే జిల్లా స్థాయిలోని ల్యాండ్ టైటిలింగ్ అప్పిలేట్ ఆఫీసర్ దగ్గర దరఖాస్తు చేసుకోవచ్చు.టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలకు సంబంధించి వివాదాలుంటే జిల్లా స్థాయిలో ల్యాండ్ టైటిలింగ్ అప్పిలేట్ ఆఫీసర్ దగ్గర అప్పీల్ చేసుకోవాలి. ఇక్కడ ఇచ్చే తీర్పుపై అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాక్షి: ఈ చట్టం కింద ఏర్పడే నూతన వ్యవస్థలు ఏమిటి?

కల్లం: కొత్త చట్టం అమలులోకి వస్తే భూమి హక్కుల రిజిస్టర్‌కు భూమి టైటిలింగ్ ఆఫీసర్లను నియమిస్తారు. టైటిల్ రిజిస్టర్‌పై వివాదాలుంటే పరిష్కరించడానికి జిల్లా స్థాయిలో ల్యాండ్ టైటిలింగ్ అప్పిలేట్ ఆఫీసర్లను నియమిస్తారు. ఇప్పుడున్న రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు అనుబంధ సంస్థలుగా పని చేస్తాయి.

సాక్షి: కొత్త చట్టంలో సివిల్ కోర్టుల పాత్ర ఏమిటి?

కల్లం: ఆర్‌వోఆర్ చట్టం కింద నిర్వహించే 1బి రిజిస్టర్‌లో నమోదు, తప్పొప్పుల సవరణ బాధ్యత సివిల్ కోర్టులకు లేనట్లే. ఈ కొత్త చట్టం కింద నిర్వహించే టైటిల్ రిజిస్టర్‌లో తప్పులను సవరించే బాధ్యత కూడా సివిల్ కోర్టులకు ఉండదు. వారసత్వ/ఆస్తి పంపకాల వివాదాలు, ప్రస్తుతం కోర్టుల్లో పెండింగులో ఉన్న వివాదాలు, టైటిల్ రిజిస్టర్ తయారీకి సంబంధం లేని ఇతర భూ వివాదాలు సివిల్ కోర్టు పరిధిలోనే ఉంటాయి. కొత్త చట్టం అమలులోకి వచ్చినప్పటికీ, ప్రస్తుతం కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాల వివరాలు టీఆర్‌లో నమోదు చేయించుకోవాలి. అంతిమంగా ఉత్తర్వుల ప్రకారం చర్య తీసుకుంటారు. టీఆర్ నమోదైన వివరాలపై అభ్యంతరాలుంటే హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు.

సాక్షి: కొత్త చట్టంలో రికార్డులు ఎవరు నిర్వహిస్తారు?

కల్లం: ఈ చట్టం కింద మూడు రికార్డులుంటాయి. 1. భూమి హక్కులకు అంతిమ సాక్ష్యంగా ఉండే టైటిల్ రిజిస్టర్, 2. భూ సమస్యలుంటే నమోదు చేసే వివాదాల రిజిస్టర్, 3. భూమిపై ఇతర హక్కులను నమోదు చేసే చార్జెస్ అండ్ కొవనెంట్స్ రిజిస్టర్. ఈ మూడు రిజిస్టర్లను కలిపి రికార్డ్ ఆఫ్ టైటిల్స్ అంటారు. ఈ రికార్డులను ల్యాండ్ అథారిటీ, సంబంధిత అధికారులు నిర్వహిస్తారు.

సాక్షి: అభ్యంతరాలుంటే ఎంత కాలంలో తెలపాలి?

కల్లం: టైటిల్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలపై అభ్యంతరాలు ఉంటే ఆ వివరాలు నమోదైన రెండు సంవత్సరాల లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆర్‌వోఆర్ చట్ట ప్రకారం రూపొందిన రిజిస్టర్–1లో అభ్యంతరాలుంటే సంవత్సరంలోగా దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్ 1బిలో నమోదు చేసిన వివరాలపై అభ్యంతరాలుంటే 90 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి. కానీ ఈ చట్టంలో అత్యధికంగా రెండేళ్ల కాల వ్యవధి ఇచ్చారు.

సాక్షి: కొత్త చట్టం హక్కులకు భద్రతా? భంగమా?

కల్లం: హక్కులకు పూర్తి భద్రత చేకూర్చడం, భూ యజమానులకు ప్రభుత్వమే భరోసాగా ఉండడమే ఈ చట్టం ఉద్దేశం. భూములన్నింటికీ ఒకే రికార్డు ఉండటం, ఈ రికార్డును ఆన్‌లైన్‌లో పూర్తి రక్షణతో అందరికీ అందుబాటులో ఉంచడం వలన పారదర్శకత వస్తుంది. తారుమారు చేసే అవకాశం లేకుండా రికార్డులు నిర్వహిస్తారు. ఈ చట్టం వలన భూ వివాదాలు భారీగా తగ్గుతాయి. కొత్తగా భూ యాజమాన్య వివాదాలు ఏర్పడే అవకాశాలు కూడా తగ్గుతాయి. కోర్టులు ఇచ్చిన తీర్పులను ఈ చట్టం కింద నమోదు చేసుకోవాలి. ఆ వివరాలకు ప్రభుత్వ గ్యారెంటీ లభిస్తుంది. టైటిల్ రిజిస్టర్‌లో క్లరికల్ తప్పిదాలుంటే టీఆర్‌ఓ వద్ద అప్పీలు చేసుకోవాలి.

సాక్షి: ఇలాంటి చట్టం ఎక్కడైనా ఇప్పటికే అమలులో ఉందా?

కల్లం: టైటిల్ గ్యారెంటీ చట్టం ఆస్ట్రేలియా, రష్యా, అమెరికా, కెనడా, బ్రిటన్, కామన్వెల్త్, తదితర వంద దేశాల్లో అమల్లో ఉంది.

సాక్షి: కొత్త చట్టంలో భూమి కొనుగోలు చేస్తే కలిగే ప్రయోజనాలేమిటి?

కల్లం: ఈ కొత్త చట్టం అమలులోకి వస్తే భూమి కొనుగోలు చేసే ముందు టైటిల్ రిజిస్టర్‌లో వివరాలు చూసుకుంటే చాలు. పాత విధానంలో ఆర్‌ఎస్‌ఆర్ నుంచి ప్రస్తుత అడంగల్ వరకూ ప్రతి సంవత్సరం రికార్డు పరిశీలించాల్సిన అవసరం ఉండదు. టైటిల్ రిజిస్టర్‌లో పేరుంటే ప్రభుత్వ భరోసాతో భూమి కొనుగోలు చెయ్యవచ్చు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేసారి సులభంగా జరిగిపోతాయి. రిజిస్ట్రేషన్ జరిగిందంటే భూమి హక్కుల బదిలీ జరిగినట్టే. అన్ని రకాల భూములకూ ఈ చట్టం వర్తిస్తుంది. అన్ని రకాల భూములకు ఒకటే రిజిస్టర్ ఉంటుంది.

సాక్షి: తగాదాలు వస్తే ఎవరు పరిష్కరిస్తారు?

కల్లం: వివాదాలుంటే సర్వే, హద్దుల చట్టం కింద సంబంధిత అధికారులను కానీ, సివిల్ కోర్టును కానీ ఆశ్రయించవచ్చు. కుటుంబ సభ్యుల మధ్య భాగ పంపిణీ, వారసత్వ తగాదాలు ఉంటే సివిల్ కోర్టులు పరిష్కరిస్తాయి. ఆస్తి పన్నులు, ఇతర వివాదాలు, కేసులు ఉంటే న్యాయస్థానాలు పరిష్కరిస్తాయి.రికార్డుల వివరాలపై అభ్యంతరాలుంటే చట్టంలో పేర్కొన్న కాల వ్యవధిలో ఎల్‌టీఏఓ, అప్పీలు వేసి, వివరాలు టీఆర్‌ఓ వద్ద నమోదు చేసుకోవాలి. అప్పీల్ చేసుకోకపోతే ఆ భూమిపై హక్కులకు ప్రభుత్వ గ్యారెంటీ లభించదు. ప్రస్తుతం సివిల్ కోర్టులో ఉన్న వివాదాల్లో వచ్చే అంతిమ తీర్పు ప్రకారమే టైటిల్ రిజిస్టర్‌లో హక్కుల నమోదు జరుగుతుంది. కానీ కోర్టుల్లో వివాదంలో ఉన్న వివరాలు టీఆర్‌ఓ వద్ద నమోదు చేయించుకుని, ఆ సర్టిఫైడ్ కాపీని సంబంధిత కోర్టుకు తెలియజేయాలి.

రబీ దిగుబడులు 78.43 లక్షల టన్నులు

- వర్షాభావ పరిస్థితులతో సాగు కాస్త తగ్గినా దిగుబడులు ఆశాజనకం
- రెండో ముందస్తు అంచనా దిగుబడులు వెల్లడించిన వ్యవసాయశాఖ
- తుది అంచనా దిగుబడుల్లో మరింత పెరిగే అవకాశం



సాక్షి, అమరావతి: ప్రతికూల పరిస్థితుల్లో రబీ సాగుచేసిన రైతులు దిగుబడులపై ఆశాజనకంగా ఉన్నారు. వ్యవసాయశాఖ విడుదల చేసిన రెండో ముందస్తు అంచనా నివేదిక ప్రకారం ఈసారి 78.43 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయి. దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రాష్ట్రంలో ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా కొనసాగడంతో ఆ ప్రభావం సాగు విస్తీర్ణంపై పడుతోంది. రబీ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 55.95 లక్షల ఎకరాలు కాగా గతేడాది 49.72 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 43.75 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. వీటిలో ఆహార పంటలు గతేడాది 43.75 లక్షల ఎకరాల్లో సాగవగా, ఈ ఏడాది ఇప్పటికే 32.50 లక్షల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. నూనెగింజల పంటలు గతేడాది 3.50 లక్షల ఎకరాల్లో సాగవగా, ఈ ఏడాది ఇప్పటికే 1.87 లక్షల ఎకరాల్లో వేశారు. అపరాలు గతేడాది 18.72 లక్షల ఎకరాల్లో సాగవగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 14.58 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. మరికొన్ని రోజులు రబీ పంటలు వేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

దిగుబడులు ఆశాజనకం

గత ఏడాది మొత్తం రబీ దిగుబడులు 89.17 లక్షల టన్నులు వచ్చాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో 78.43 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని రెండో ముందస్తు అంచనా వేశారు. గతేడాది 82.98 లక్షల టన్నులున్న ఆహారపంటల దిగుబడులు ఈ ఏడాది 73.45 లక్షల టన్నులు ఉంటాయని అంచనా. గతేడాది 24.92 లక్షల టన్నులున్న చిరుధాన్యాల దిగుబడులు ఈ ఏడాది 20.07 లక్షల టన్నులు ఉంటాయని అంచనా వేస్తున్నారు. గతేడాది 9.74 లక్షల టన్నులున్న అపరాల దిగుబడులు ఈ ఏడాది 8.94 లక్షల టన్నులు ఉంటాయని, గతేడాది 2.97 లక్షల టన్నులున్న నూనెగింజల దిగుబడులు ఈ ఏడాది 1.92 లక్షల టన్నులు ఉంటాయని అంచనా.



సాకేత్-రామ్‌కుమార్ జోడీకి టైటిల్

ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ స్టార్, భారత డేవిస్‌కప్ ప్లేయర్ సాకేత్ మైనేని ఖాతాలో 16వ ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ చేరింది. రామ్‌కుమార్ రామనాథన్‌తో జోడీ కట్టిన సాకేత్ చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నమెంట్‌లో డబుల్స్ విజేతగా నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ జంట 3-6, 6-3, 10-5తో భారత్‌కే చెందిన రిత్విక్ చౌదరి- నిక్కీ పునాచా ద్వయంపై గెలుపొందింది. సాకేత్ జోడీ ఒక ఏస్ సంధించగా, 2 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ఆఖరిదాకా పోరాడిన రిత్విక్-నిక్కీ జంట 2 ఏస్‌లు సంధించి ఒకసారి డబుల్ ఫాల్ట్ చేసింది. మరో వైపు ఇదే టోర్నీ సింగిల్స్‌లో భారత స్టార్ ప్లేయర్ సుమిత్ నగాల్ టైటిల్ పోరుకు అర్హత సంపాదించాడు. సెమీఫైనల్లో 26 ఏళ్ల నగాల్ 6-3, 6-4తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన డలిబర్ విర్సినాపై విజయం సాధించాడు. నేడు జరిగే ఫైనల్లో సుమిత్... ఇటలీ ఆటగాడు లుకా నర్డితో తలపడతాడు. మరో సెమీస్‌లో లుకా నర్డి 6-4, 4-6, 7-6 (8/6)తో చున్ సిన్ సెంగ్ (చైనీస్ తైపీ)పై చెమటోడ్చి నెగ్గాడు.

కోహ్లి ఆడటం లేదు!

- టెస్టు సిరీస్‌కు పూర్తిగా దూరం
- శ్రేయస్ అయ్యర్‌పై వేటు
- కొత్తగా ఆకాశ్‌దీప్‌కు అవకాశం
- ఇంగ్లండ్‌తో తర్వాతి 3 టెస్టులకు భారత జట్టు ప్రకటన


ఆకాశ్‌దీప్




శ్రేయస్

న్యూఢిల్లీ: భారత స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లి 13 ఏళ్ల టెస్టు కెరీర్‌లో క్రికెటేతర కారణాలతో తొలిసారి పూర్తిగా ఒక టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. వ్యక్తిగత సమస్యల కారణంగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు టెస్టుల్లో ఆడని కోహ్లి ఇప్పుడు మిగిలిన మూడు టెస్టులనుంచి కూడా తప్పుకున్నాడు. అతను చివరి మూడు టెస్టులు ఆడటంపై మొదటినుంచీ సందేహంగానే ఉన్నా శనివారం బీసీసీఐ సెలక్షన్ కమిటీ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. కోహ్లి సమస్య ఏమిటనేది బయటకు తెలియకపోయినా బోర్డు ఉన్నతాధికారులకు అతని గైర్హాజరుపై స్పష్టత ఉంది. అయితే జట్టును ఎంపిక చేసే ముందు మరోసారి అతనితో మాట్లాడిన తర్వాతే సెలక్టర్లు టీమ్‌ను ప్రకటించారు. రోహిత్ శర్మ నాయకత్వంలో 17 మంది సభ్యుల బృందాన్ని మిగిలిన మూడు టెస్టుల కోసం అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ ప్రకటించింది. గాయాల కారణంగా వైజాగ్ టెస్టుకు దూరమైన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాలను జట్టులోకి ఎంపిక చేశారు. అయితే వీరు ఆడటం ఫిట్‌నెస్‌కు లోబడి ఉంటుందని సెలక్టర్లు స్పష్టం చేశారు. రాహుల్ ఇప్పటికే పూర్తిగా కోలుకున్నాడని సమాచారం ఉండగా జడేజా తన సొంత మైదానంలో మ్యాచ్ ఆరంభ సమయానికి కోలుకుంటాడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

వరుస వైఫల్యాలతో...

టీమ్ ఎంపికలో కీలక మార్పు శ్రేయస్ అయ్యర్‌ను పక్కన పెట్టడమే. అతను వెన్ను నొప్పితో బాధపడుతూ మూడో టెస్టుకు దూరమయ్యే అవకాశం ఉందని రెండు రోజుల క్రితం వినిపించింది. అయితే అంతర్గత సమాచారం ప్రకారం శ్రేయర్ పూర్తి ఫిట్‌గా సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నాడని... అతని పేలవ ఫామ్ కారణంగానే వేటు పడినట్లు తెలిసింది. ఈ సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌లలో అతను వరుసగా 35, 13, 27, 29 పరుగులు మాత్రమే చేశాడు. స్పిన్‌ను చాలా బాగా ఆడగలడని పేరున్న అయ్యర్ సొంత గడ్డపై ఇలా విఫలం కావడంతో సెలక్టర్లు పక్కన పెట్టక తప్పలేదు. గత 13 ఇన్నింగ్స్‌లలో అతను ఒక్క అర్ధసెంచరీ కూడా చేయలేదు.

సిరాజ్ వచ్చేశాడు...

పనిభారం కారణంగా గత టెస్టులో విశ్రాంతినిచ్చిన హైదరాబాదీ పేసర్ సిరాజ్‌ను మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. మరో పేసర్ ముకేశ్ కుమార్ కూడా తన స్థానం నిలబెట్టుకున్నాడు. ముగ్గురు పేసర్లు అందుబాటులో ఉన్నా... సెలక్టర్లు మరో పేసర్ ఆకాశ్‌దీప్‌ను ఎంపిక చేశారు. బెంగాల్‌కు చెందిన ఆకాశ్ 29 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 103 వికెట్లు తీశాడు. ఇటీవల దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌కు ఎంపికైనా...మ్యాచ్ అవకాశం రాలేదు. శనివారం ప్రకటించిన జట్టునుంచి ఆవేశ్, సౌరభ్ కుమార్‌లను తప్పించగా...జురేల్, రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ తమ స్థానాలు నిలబెట్టుకున్నారు. రాహుల్ మైదానంలోకి దిగినా...అయ్యర్ స్థానంలో వీరిద్దరిలో ఒకరు ఆడటం ఖాయం. భారత్, ఇంగ్లండ్ మధ్య ఈ నెల 15నుంచి రాజ్‌కోట్‌లో, 23నుంచి రాంచీలో, మార్చి 7నుంచి ధర్మశాలలో మూడు, నాలుగు, ఐదు టెస్టులు జరుగుతాయి.

జట్టు వివరాలు:

రోహిత్ (కెప్టెన్), బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి, గిల్, రాహుల్, పటిదార్, సర్ఫరాజ్, జురేల్, భరత్, అశ్విన్, జడేజా, అక్షర్, సుందర్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్, ఆకాశ్‌దీప్.

ఆరో ప్రపంచకప్ వేటలో...

- భారత యువ జట్టు సిద్ధం
- నేడు అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్
- ఆస్ట్రేలియాతో భారత్ తుది పోరు
- మ.గం.1.30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్-1'లో ప్రసారం


ట్రోఫీతో కెప్టెన్లు ఉదయ్, వీగన్

బెనోని (దక్షిణాఫ్రికా): డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆరో ప్రపంచకప్ లక్ష్యంగా అంతిమ సమరానికి సన్నద్ధమైంది. ఈ టోర్నీలో పరాజయమెరుగని భారత జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. డిఫెండింగ్ చాంపియన్ ఈ టోర్నీలో అసాధారణ ఫామ్‌లో ఉంది. కుర్రాళ్ల మెగా ఈవెంట్ చరిత్రలో తొమ్మిదోసారి టైటిల్ వేటకు అర్హత సాధించిన భారత్‌కు ఫైనల్ ప్రత్యర్థిపై మంచి రికార్డు ఉంది. ఆసీస్ ఐదుసార్లు ఫైనల్ చేరింది. పాక్ (1988, 2010), దక్షిణాఫ్రికా (2002)లపై గెలిచిన ఆసీస్‌కు 2012, 2018లలో జరిగిన ఫైనల్స్‌లో మాత్రం రెండు సార్లు భారత్ చేతిలో పరాభవం ఎదురైంది. ఇప్పుడు ఇదే రికార్డును ఈ టోర్నీలోనూ అజేయ భారత్ కొనసాగించాలని ఆశిస్తోంది. ప్రస్తుత టోర్నీలో జట్ల బలాబలాల విషయానికి వస్తే యువభారత్ ఆల్‌రౌండ్ షోతో జైత్రయాత్ర చేస్తోంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ ఉదయ్ సహరణ్ (389 పరుగులు), ముషీర్ ఖాన్ (338), సచిన్ దాస్ (294) సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో సామీ పాండే (17 వికెట్లు) స్పిన్ మాయాజాలం ప్రత్యర్థి బ్యాటర్లను కట్టిపడేస్తోంది. మరో వైపు ఆసీస్ తరఫున ఓపెనర్ హ్యారీ డిక్సన్ (267 పరుగులు), కెప్టెన్ హ్యూగ్ వేగన్ (256) రాణించారు. బౌలింగ్‌లో కలమ్ విడ్లర్ (12 వికెట్లు), టామ్ స్ట్రేకర్ (12 వికెట్లు) ప్రత్యర్థి బ్యాటర్లపై ప్రభావం కనబరిచారు. విజయాల పరంగా కూడా ఆసీస్... భారత్ లాగే దీటైన ప్రదర్శన చేసింది. సూపర్ సిక్స్‌లో విండీస్‌తో మ్యాచ్ వర్షంతో రద్దవగా మిగతా ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి అజేయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య ఫైనల్ హోరాహోరీగా జరిగే అవకాశముంది.

పట్టు బిగించిన హైదరాబాద్

- తొలి ఇన్నింగ్స్‌లో నాగాలాండ్ 206 ఆలౌట్
- తనయ్ త్యాగరాజన్‌కు 7 వికెట్లు


తనయ్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ మళ్లీ 'ఎలైట్' డివిజన్‌కు అర్హత సంపాదించేందుకు సిద్ధమైంది. ప్లేట్ డివిజన్‌లో నాగాలాండ్‌తో జరుగుతున్న సెమీ ఫైనల్లో తనయ్ త్యాగరాజన్ (7/63) స్పిన్ జోరుకు హైదరాబాద్ మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది. శనివారం 383/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆటకొనసాగించిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌ను 462/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్ ప్రజ్ఞయ్ రెడ్డి (47) రాణించాడు. అనంతరం నాగాలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే ఆలౌటైంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ తనయ్ వరుస విరామాల్లో ప్రత్యర్థి జట్టును చావుదెబ్బ తీశాడు. జాషువా (50; 6 ఫోర్లు, 1 సిక్స్), జగన్నాథ్ (44), రంగ్‌సెన్ జొనాథన్ (41) రాణించారు. హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 256 భారీ ఆధిక్యం లభించింది. దీంతో ఫాలోఆన్ ఆడిన నాగాలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 20 పరుగులు చేసింది. నాగాలాండ్ మరో 236 పరుగులు వెనుకబడి ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే హైదరాబాద్ ఫైనల్ చేరుతుంది. 'ప్లేట్ డివిజన్'లో తుది పోరుకు అర్హత సాధించే రెండు జట్లు వచ్చే సీజన్ కోసం 'ఎలైట్' డివిజన్‌కు అర్హత సాధిస్తాయి.

ఆంధ్రకు కీలక ఆధిక్యం

తొలి ఇన్నింగ్స్‌లో యూపీ 198 ఆలౌట్


శశికాంత్

విజయనగరం: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఉత్తర ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర ఆటగాడు శశికాంత్ (5/54) రెండో రోజు బౌలింగ్‌లో విజృంభించాడు. దీంతో ఆంధ్రకు తొలి ఇన్నింగ్స్‌లో 63 పరుగుల ఆధిక్యం లభించింది. శనివారం 236/4 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 95.1 ఓవర్లలో 261 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ రికీభుయ్ (94; 10 ఫోర్లు, 1 సిక్స్) తన ఓవర్‌నైట్ స్కోరుకు 4 పరుగులే జతచేసి... సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. కరణ్ షిండే (45), రికీ భుయ్ అవుటయ్యాక ఆంధ్ర ఇన్నింగ్స్ కూలేందుకు ఎంతో సేపు పట్టలేదు. రెండో రోజు 25 పరుగులే చేసిన ఆంధ్ర 6 వికెట్లను కోల్పోయింది. యశ్ దయాళ్, అంకిత్ చెరో 3 వికెట్లు తీశారు. అయితే ఆ తర్వాత యూపీ తొలి ఇన్నింగ్స్‌లో 51.5 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. ఆర్యన్ జుయల్ (60) రాణించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆంధ్ర ఆట నిలిచే సమయానికి 4.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 19 పరుగులు చేసింది. ప్రశాంత్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉండగా, మహీప్ (14) అవుటయ్యాడు. ప్రస్తుతం ఆంధ్ర 82 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఫైనల్లో నిఖత్ జరీన్



సోఫియా: భారత టాప్ బాక్సర్ నిఖత్ జరీన్ స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో తన జోరు కొనసాగిస్తూ తుది పోరుకు అర్హత సాధించింది. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ ఏకపక్ష సమరంలో గెలిచి ఈ టోర్నమెంట్‌లో ఫైనల్లోకి ప్రవేశించింది. 50 కేజీల విభాగంలో శనివారం జరిగిన సెమీస్‌లో నిఖత్ 5-0 స్కోరుతో స్థానిక బాక్సర్ జ్లాటిస్లావ్ చుకనోవాపై విజయం సాధించింది. తొలి రౌండ్‌లో నిఖత్ జాగ్రత్తగా ఆడగా బల్గేరియా బాక్సర్ కూడా పోటీనిచ్చింది. దాంతో స్కోరు 3-2తో ముగిసింది. అయితే తర్వాతి రెండు రౌండ్లలో ఆమెకు ఎదురు లేకుండా పోవడంతో 5-0, 5-0తో రౌండ్లు సొంతమయ్యాయి. ఓవరాల్ స్కోరింగ్‌తో చివరకు 5-0తో నిఖత్‌దే పైచేయి అయింది. నేడు జరిగే ఫైనల్లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన సబీనా బొబొకులోవాతో నిఖత్ తలపడుతుంది. 66 కేజీల విభాగంలో మరో భారత బాక్సర్ అరుంధతి చౌదరి కూడా ఫైనల్‌కు చేరగా... పురుషుల 51 కేజీల విభాగంలో భారత బాక్సర్ అమిత్ పంఘాల్ కూడా ఫైనల్లోకి అడుగుపెట్టాడు.

భారత్ శుభారంభం


హర్మన్‌ప్రీత్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ టోర్నీని భారత జట్టు ఘనంగా మొదలు పెట్టింది. శనివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-1 గోల్స్ తేడాతో స్పెయిన్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (7వ నిమిషం, 20వ ని.) రెండు గోల్స్ సాధించగా...జుగ్‌రాజ్ సింగ్ (24వ ని.), లలిత్ ఉపాధ్యాయ్ (50వ ని.) ఒక్కో గోల్ చేశారు. స్పెయిన్ ఆటగాళ్లలో మిరాలెస్ మార్క్ (34వ ని.) ఏకైక గోల్ కొట్టాడు. మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్‌కు ఇది 350వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. నేడు జరిగే తమ తర్వాతి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది.

మళ్లీ ఓడిన టైటాన్స్

కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమ పేలవ ప్రదర్శనను కొనసాగిస్తూ తెలుగు టైటాన్స్ మరో ఓటమిని మూటగట్టుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 55-35 స్కోరుతో టైటాన్స్‌పై విజయం సాధించింది. తెలుగు జట్టు తరఫున మిలాద్ జబారి 9, ప్రఫుల్ జవారే 8, పవన్ సెహ్రావత్ 6 పాయింట్లు సాధించగా...బెంగాల్ ఆటగాళ్ళలో నితిన్ కుమార్ 13 పాయింట్లతో చెలరేగాడు. టైటాన్స్‌కు ఓవరాల్‌గా 19 మ్యాచ్‌లలో ఇది 17వ పరాజయం. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 44-23 స్కోరుతో యు ముంబాపై గెలుపొందింది.

ఘంటసాల 50వ వర్ధంతి ప్రత్యేకం

మధుర కంఠశాల



జయ జననీ పరమ పావని జయ జయ భారత జననీ... దేశం తాలూకు ప్రేమ స్పష్టంగా వినిపించిన గాత్రం. 'మన దేశం'లోని ఈ పాట ఎవర్‌గ్రీన్. కలవర మాయె మదిలో.. నా మదిలో... కన్నుల లోన గారడి ఆయే... 'పాతాళ భైరవి'లో అదే గాత్రం ప్రేమ కురిపించింది శేషశైలవాస.. శ్రీవెంకటేశా... 'వెంకటేశ్వర మహాత్మ్యం'లో ఆ గాత్రంలోని భక్తిభావం అద్భుతం. ఎట్టాగొ ఉన్నాది ఓ లమ్మీ... ప్రేయసితో గారాలు పోయింది ఆ గాత్రం.. జగమే మాయ బతుకే మాయ.. వేదాలలో సారమింతేనయా.. 'దేవదాసు'లో మత్తు నింపిన గాత్రం అది.. లేచింది నిద్ర లేచింది మహిళాలోకం... 'గుండమ్మ కథ'లో సమాజాన్ని మేల్కొల్పిన గాత్రం అది. దైవ భక్తి, దేశ భక్తి, ప్రేమ, విరహం, ఉత్సాహం... ఇలా అన్నింటినీ మధురంగా పలికించిన కంఠం అది. అందుకే ఘంటసాల దూరం అయినా ఆ స్వరం దూరం కాలేదు.. తెలుగు ప్రజల మనసుల్లో అలా నిలిచిపోయింది. ఆ 'మధుర కంఠశాల' ఘంటసాల 50వ వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ఘంటసాల మాస్టారు జీవితంలోని కొన్ని విశేషాలు ఈ విధంగా...

ఘంటసాల వెంకటేశ్వర రావ్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని చౌటుపల్లిలో 1922 డిసెంబరు 4న సామాన్య కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు సూరయ్య, తల్లి పేరు రత్తమ్మ. ఘంటసాలకు సంగీతమంటే ప్రాణం. స్వతహాగా మంచి గాయకుడైన ఆయన శ్రీ నారాయణతీర్థుల తరంగాలను వినసొంపుగా పాడేవారు. మృదంగ వాయిద్యంలో కూడా ఘంటసాలకి మంచి ప్రవేశం ఉంది. ఆయన పాటలు పాడటంతో పాటు నృత్యం కూడా చేసేవారు. శ్రీ నారాయణ తీర్థుల తరంగాలను పాడటంలో తండ్రికి సహాయంగా ఉండేవారు ఘంటసాల. అలా పాటలు పాడుతూ, నృత్యాన్ని అభినయించే ఘంటసాలను అందరూ 'బాల భరతుడు' అని పిలిచేవారు. ఒకానొక సందర్భంలో ఘంటసాల సంగీత కచేరీ చేస్తున్నప్పుడు కొందరు ఆయన సంగీత పరిజ్ఞానాన్ని హేళన చేశారు. ఆ హేళనను ఆయన ఒక సవాల్‌గా స్వీకరించి, సంగీతంలో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించటానికి విజయనగరం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే అందుకు ఆయన కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో తన బంగారు ఉంగరం విక్రయించి, సంగీతం నేర్చుకోవడానికి విజయనగరం చేరుకున్నారు. అక్కడ ఓ కళాశాలలో ప్రవేశం పొంది, విద్వాన్ పట్టాతో కళాశాల నుంచి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టారు. తన 14వ ఏట వయొలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడు ప్రోత్సాహంతో పట్రాయని సీతారామశాస్త్రి వద్ద శాస్త్రీయ సంగీతం అధ్యయనం చేశారు. హఠాత్తుగా తన తండ్రి సూరయ్య మృతి చెందడంతో మేనమామ శ్రీ ర్యాలి పిచ్చి రామయ్య వద్దకు చేరుకున్నారు ఘంటసాల. ఆ తర్వాత 1944 మార్చి 4న ఆయన కుమార్తె సావిత్రిని పెళ్లాడారు. సమీప బంధువైన సినీరంగ ప్రముఖుడు సముద్రాల రాఘవాచారి ఆశీస్సులతో 1944లో మద్రాసు చేరుకుని, గాయకుడిగా అవకాశాల కోసం ఏడాది పాటు ఎదురు చూశారు ఘంటసాల. 1945లో తొలిసారి 'స్వర్గసీమ' సినిమాలోని 'గాజులపిల్ల..' అనే పాట ద్వారా ఆయన గొంతు తెలుగు వారికి పరిచయమైంది. ఈ పాటకు ఆయన అందుకున్న పారితోషికం రూ. 116. ఆ తర్వాత ఎన్నో గీతాలు పాడారు. అలాగే తెలుగులో దాదాపు ఎనభై చిత్రాలకు, తమిళం, కన్నడంలో కొన్ని చిత్రాలకు సంగీతదర్శకత్వం వహించారు. ఇక ఘంటసాలకు దేశభక్తి కూడా ఎక్కువే. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుపాలయ్యారు. ఘంటసాల చివరిగా పాడిన పాట 'యశోదకృష్ణ' సినిమాలోని 'చక్కనివాడే భలే టక్కరివాడే..'. ఆ తర్వాత ఆయన తన జీవితమంతా పరితపించిన భగవద్గీత ప్రయివేటు రికార్డును పూర్తి చేసి, మరణించారు. జీవిత చరమాంకంలో చేసిన భగవద్గీత ఆయనకు శాశ్వత కీర్తిని సంపాదించి పెట్టింది. 1972లో హైదరాబాద్ రవీంద్రభారతిలో కచేరీ చేస్తుండగా ఆయనకు గుండెలో నొప్పిగా అనిపించడంతో ఆస్పత్రికి వెళ్లారు. దాదాపు నెల రోజులు ఆస్పత్రిలో ఉన్నారు. ఆ తర్వాత కొన్నాళ్లు బాగానే ఉన్నారు. అయితే ఆ తర్వాత అనారోగ్యంపాలు కావడంతో ఒక విలేకరి సూచించిన నాటు మందు వాడారు. అది వికటించడంతో ఆరోగ్యం ఇంకా క్షీణించింది. చివరికి 1974 ఫిబ్రవరి 11న ఘంటసాల తుది శ్వాస విడిచారు. 'శ్రీనివాసా... బాధ లేకుండా పోతే ఫర్వాలేదు' అని చనిపోయే నాడు ఉదయం ఆస్పత్రిలో అన్నారట. ఘంటసాల పలికిన చివరి మాట ఇదేనట. తెలుగు చిత్రసీమ ఉన్నంతవరకూ నిలిచిపోయేలా పాటల రూపంలో మధురాన్ని పంచిన ఘంటసాల 52 ఏళ్ల వయసుకే దూరమయ్యారు. ఘంటసాలకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం.

ఓ నిర్మాత మన సినిమాలోని పాటలన్నీ హిట్ కావాలని సంగీత దర్శకుడు ఇళయారాజాకి చెప్పారట. అయితే ఇది ఒక్క ఘంటసాలగారికే సాధ్యం అన్నారట ఇళయరాజా. ఈయనే కాదు.. అప్పట్లో ఏ సంగీతదర్శకుడికైనా తొలి ప్రాధాన్యం ఘంటసాలకే. పాటలు మాత్రమే కాదు.. పద్యాలు పాడటంలోనూ ఘంటసాల సూపర్. కొంతమంది సంగీత దర్శకులు వారి సినిమాల్లోని పద్యాలను ఘంటసాలతోనే పాడించుకున్నారు. స్వతహాగా ఘంటసాలకు కూడా పద్యాలు పాడటం అంటే చాలా ఇష్టం. 'తెనాలి రామకృష్ణ' సినిమాలో చాలా పద్యాలు ఉంటాయి. తొలుత ఈ పద్యాలను పాడినందుకు ఘంటసాల పారితోషికం తీసుకోలేదట. 'పద్యాలే కదా ఫర్వాలేదులే' అన్నారట. కానీ ఈ చిత్రనిర్మాత జీఏస్ రంగా పద్యానికి వంద రూపాయల చొప్పున లెక్క గట్టి ఘంటసాలకి ఇచ్చారట. అలాగే 'రహస్యం' (1967) సినిమాకు ఎంతో ఇష్టపడి సంగీతం ఇచ్చారట ఘంటసాల. కానీ ఆ సినిమా ఫ్లాప్ కావడంతో ఘంటసాల చాలా నిరాశ చెందారట. అలాగే తిరుమలేశునిపై ఎక్కువ పాటలు స్వరపరిచి, గానం చేసిన గాయకుల్లో ఘంటసాల పేరు ముందు వరుసలో ఉంటుంది.


మకరంద్, అనుష్యా, రాజ్ అర్జున్, కంగన, గూడూరు నారాయణ రెడ్డి, యాటా సత్యనారాయణ

అప్పుడేం జరిగిందో యువతకు తెలియాలి

- గూడూరు నారాయణ రెడ్డి

బాబీ సింహా, వేదిక, మకరంద్ దేశ్‌పాండే, రాజ్ అర్జున్, అనుష్యా త్రిపాఠి ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ ఫిల్మ్ 'రజాకార్'. 'సైలెంట్ జెనొసైడ్ ఆఫ్ హైదరాబాద్' (హైదరాబాద్‌లో జరిగిన నిశ్శబ్ద మారణహోమం) అనేది ట్యాగ్‌లైన్. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా మార్చి 1న విడుదల కానుంది. 1947లో భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిన అనంతరం నిజాం పాలన, సామాన్య ప్రజలపై రజాకార్ల క్రూరమైన చర్యలు, నిజాం పాలన నుంచి ప్రజలు విముక్తి పొందేలా సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన వ్యూహాత్మక ప్రయత్నాలు వంటి అంశాల నేపథ్యంతో 'రజాకార్' సినిమా రూపొందినట్లు తెలుస్తోంది. ఈ సినిమా హిందీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ శనివారం ముంబైలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నటి-దర్శక-నిర్మాత కంగనా రనౌత్ మాట్లాడుతూ- ''రజాకార్' సినిమా పట్ల చిత్ర యూనిట్ చూపిస్తున్న అంకితభావం, తపన నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి'' అన్నారు. ''చరిత్రలో గుర్తుంచుకోవాల్సిన, గౌరవించుకోవాల్సిన ఓ అధ్యాయాన్ని 'రజాకార్' సినిమాగా తీశాం. 15 ఆగస్టు 1947-17 సెప్టెంబరు 1948ల మధ్య నిజాం పాలనలో ఏం జరిగింది? అనే అంశాలు ఈ తరం యువతీ యువకులకు తెలియాల్సిన అవసరం ఉంది'' అన్నారు నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి. ''నిరంకుశత్వం, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన వారి పరాక్రమాన్ని ఈ సినిమాలో వెండితెరపై చూపించే ప్రయత్నం చేశాం'' అన్నారు దర్శకుడు యాటా సత్య నారాయణ.


రకుల్ ప్రీత్ సింగ్

శూర్పణఖ?

రామాయణం ఆధారంగా హిందీలో దర్శకుడు నితీష్ తివారి ఓ భారీ బడ్జెట్ ట్రయాలజీ ఫిల్మ్‌ను తెరకెక్కించనున్నారని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దాదాపు రెండేళ్లుగా జరుగుతున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ తుది దశకు చేరుకున్నాయి. దీంతో నితీష్ తివారి ఈ సినిమాలోని నటీనటుల ఎంపికపై దృష్టి సారించారు. ఈ సినిమాలోని రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, హనుమంతునిగా బాబీ డియోల్, విభీషణుడిగా విజయ్ సేతుపతి, రావణుడిగా యశ్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. తాజాగా శూర్పణఖ పాత్రలో రకుల్‌ప్రీత్ సింగ్ నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. రకుల్‌కు ఆల్రెడీ నితీష్ స్టోరీ చెప్పారని, లుక్ టెస్ట్ కూడా పూర్తయిందని టాక్. కాగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన ఈ వేసవిలో రానుందని, 2025 చివర్లో తొలి భాగం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని బాలీవుడ్ టాక్. మరోవైపు ఈ నెలలో రకుల్‌ప్రీత్ సింగ్ వివాహం జాకీ భగ్నానీతో జరగనుంది.

ట్రైలర్ బాగుంది

- విశ్వక్ సేన్


శివ కందుకూరి, విశ్వక్ సేన్

''భూతద్దం భాస్కర్ నారాయణ' ట్రైలర్ బాగుంది. శివ బాగా చేశాడు. ఈ సినిమా హిట్టవ్వాలి'' అన్నారు హీరో విశ్వక్ సేన్. శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముడుంబై నిర్మించిన ఈ సినిమా మార్చి 1న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో విశ్వక్ సేన్ అతిథిగా పాల్గొన్నారు. ''భూతద్ధం భాస్కర్ నారాయణ' యునిక్ క్రైమ్ థ్రిల్లర్'' అన్నారు శివ కందుకూరి. ''అందరి ఇంటి ముందు ఉండే దిష్టి బొమ్మ గురించి ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు పురుషోత్తం రాజ్.

అందుకే ఈ వేడుకకి వచ్చాను

- నిఖిల్ సిద్ధార్థ్


నిఖిల్, అభినవ్

''మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' సినిమాని విడుదలకు ముందే కొందరికి చూపించారు. ఈ మూవీ చూసినవాళ్లు పాజిటివ్‌గా స్పందించారని తెలిసింది. వాళ్ల మంచి రివ్యూ తెలుసుకుని ఈ ట్రైలర్ లాంచ్ వేడుకకి వచ్చాను. ఈ సినిమా పెద్ద హిట్ కావాలి'' అని హీరో నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. అభినవ్ గోమఠం, వైశాలీ రాజ్ జంటగా తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా'. భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ .వి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను నిఖిల్ సిద్ధార్థ్ విడుదల చేశారు. ''హీరోగా నాకు చాన్స్ ఇచ్చిన తిరుపతి రావు గారికి థ్యాంక్స్. ఈ చిత్రాన్ని ఫ్యామిలీతో చూడాలి'' అన్నారు అభినవ్ గోమఠం. ''కంటెంట్ బాగున్న మా చిత్రాన్ని ఆదరిస్తారని నమ్ముతున్నా'' అన్నారు తిరుపతి రావు. ''ఇది మా తొలి చిత్రం. రామ్ మోహన్ రెడ్డిగారి సహకారంతో నిర్మించాం'' అన్నారు కాసుల భవాని.

త్వరలో చౌర్య పాఠం


త్రినాథరావు, ఇంద్రరామ్

''నక్కిన నరేటివ్స్ బ్యానర్‌ని ప్రారంభించడం సంతోషంగా ఉంది. 'చౌర్య పాఠం' టీజర్ అదిరిపోయింది.. సినిమా కూడా అదిరిపోతుంది'' అని త్రినాథరావు నక్కిన అన్నారు. దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన నక్కిన నరేటివ్స్ బ్యానర్‌ని స్థాపించి, తొలి ప్రయత్నంగా 'చౌర్య పాఠం' సినిమా నిర్మించారు. ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ జంటగా నటించారు. నిఖిల్ గొల్లమారి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ లాంచ్ వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. త్రినాథ రావు నక్కిన మాట్లాడుతూ- ''చౌర్య పాఠం'కి అద్భుతమైన కథ, విజువల్స్ అందించిన కార్తీక్ ఘట్టమనేనికి థ్యాంక్స్. త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు. ''క్రైమ్ కామెడీ డ్రామాగా 'చౌర్య పాఠం' రూపొందింది'' అన్నారు నిఖిల్ గొల్లమారి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ/కట్నం ప్రసక్తి లేదు/M.Tech, IIT/ C.Govt. ఇన్స్‌పెక్టర్/ఇన్‌కమ్ టాక్స్ Dept/ 85000/-PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14207]

SC హిందూ మాదిగ/M.Tech/C.Govt. Sr.Asst./పోస్టల్ Dept/50,000/-PM/ 5'5" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-14207]

వాల్మీకి బోయ/M.Tech/ C.Govt. Asst.ఇంజినీర్/BHEL/80,000/-PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14207]

క్రిస్టియన్ మాల /కట్నం ప్రసక్తి లేదు/29/ 5'11"/M.Tech, NIT/ Govt.స్టీల్ ప్లాంట్ మేనేజర్/1 Lakh. PM/అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14207]

బ్రాహ్మిణ్/Y79/పెన్షనర్, Hyd, చెడు అలవాట్లు లేవు. మంచి ఆరోగ్యం బాదర బందీలు లేవు, శాకాహార వరునికి శాఖాహార వధువు కావలెను. నో బ్రోకర్స్. 9848161339 [HA-14216]

దేవాంగ/(CAST No bar)/40yrs, 5'5"/ Fair/M.Tech/MCA/IRPM వరునకు చదువుకున్న, దైవభక్తి గల వధువు కావలెను. (డైరెక్ట్). సంప్ర : 7036361292 [HA-14216]

రాజులు, యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం, సొంత ఇల్లు. 46 సం., 2వ పెళ్ళి వెలొసిటీట్ వరుడికి కుల ప్రసక్తి లేని సంప్రదాయమైన వధువు కావలెను. డైరెక్ట్ 9573428169. [B-782175]

రెడ్డి: 41 / 6' / B.F.A / 30 Cr / Fair / Late Marriage వరునికి 1వ, 2వ వధువు కావలెను. Please don't Call, Send Profile only. Birth details must. Whatsapp - 8297949999 [W-788997]

Reddy/Groom/30/ 5'8" / B.Tech (Civil)/ 5Cr./ Govt. A.E. Seeks Bride B.Tech/ Any Degree. Contact: Prabhakar Reddy. 9391198332 [H-801667]

Reddy/Groom/ 35 / 5'9" / MCA-LLB Advocate/ 15 Crores Property/1.5 Lak P/M. Seeks Bride . Contact: Prabhakar Reddy. 9391198332 [H-801667]

Reddy/Groom / 28 /5'10"/ MD. (General) / 25Cr/Handsome. Seeks Bride Doctor only. Contact: Prabhakar Reddy. 9391198332 [H-801667]

Reddy/Groom/ II Marriage-33/5'9"/ B.Tech/ IIIT/ C.Govt.Officer/15Lac P/A. Seeks Bride Any Degree. Contact: Prabhakar Reddy. 9391198332 [H-8016673]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech / MS / H1 / USA * 1996/ 5'11"/50Cr *1997/5'9"/60Cr *1995/5'9"/50 Cr *1994/5'8"/30Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS /H1 /USA *1997/6'/ 400Cr *1995/5'10"/70Cr *1995/6'/20Cr *1989/5'8"/200K. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1990/ 5'7"/ 50Cr *1991/5'11"/100Cr *1994/6'/15Cr *1986/5'7"/150K/ * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Canada(PR)/B.Tech / MS/1992/ 6'/300K/30Cr *UK/H1/MS/1994/5'11"/1.5 Cr/yr *Aus-Citizen/1996/6'/25Cr *Cont : K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/MBBS/ MD /1995 /5'10"/400Cr *1996/6'/50Cr *DM/1994/5'10"/75Cr *1993/ 5'10"/ 50Cr *1989/5'9"/30Cr. * Cont: K.C. Reddy- Ph: 9347807015/ 9849321309

Reddy/IIT/SWE/India *1994/5'9"/ 1Cr/ yr/ 30Cr *1994/5'11"/70L/yr/25Cr *1996/ 5'6"/40L/ yr/ 20Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/Business/1994 /5'10"/ Contractor/100Cr *1995/5'9"/500Cr *1990/6'/1000Cr * Cont : K.C.Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/Business/B.Tech/1990/5'10"/ 20L/M. Income/25Cr *1996/6'/100Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/Divorcee /B.Tech /Business/ 1994/5'11"/250Cr *1981/5'8"/500Cr * 1995/ 5'10"/(IIT)USA Job/20Cr. * Cont. K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/ Catholic/V.Hand some Boy/B.Tech/MBA/ 30L/yr/ 5Cr/ 1987/6'/ *Cont: K.C. Reddy - Hyd. Ph: 9347807015/9849321309

వరుడు కావలెను

Reddy / MBBS/MD / DM / 1994/5'6"/ 100Cr *MS/1993/ 5'2"/20Cr(Ent) *MD/ 1998/ 5'7"/50Cr.*Cont. K.C.Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Doctor/ USA * 1995 / 5'7" * 1996/5'2"/20Cr *1996/5'8"/40Cr * 1992/5'7"/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/SWE/India *1994/5'5"/ 15Cr *1996/5'7"/50Cr *1996/5'6"/6Cr *1998/5'4"/20Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1995/ 5'6"/ 6Cr *1996/5'5"/12Cr *1994/ 5'4"/10Cr *1997/5'5"/10Cr *1990/ 5'8"/160K/30Cr * Cont: K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Rich Family/ B.Tech/1995/ 5'5"/ 70Cr *1997/5'4"/150Cr *1994/ 5'6"/100 Cr *1995/5'8"/100Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/Rich Family *B.Tech/ 1993/ 5'3"/500Cr/ *1994/5'3"/200Cr *2000/ 5'5"/100Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/ 9849321309

Reddy/IIT/IIM/B.Tech/MBA *India/ 1998 /5'3 1/2"/70L/yr *1996/5'6" *2001/5'5". *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/ IIT/MS/H1/USA *1994/5'4"/ 10Cr *1999/5'6"/100Cr *1996/5'7" *1997/ 5'4"/200K. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/Divorcee /India *1985/5'5"/ 400 Cr *MBBS/ MD/1986/5'6"/50Cr *1994/ 5'5"/ 100Cr *1993/5'8"/40Cr.* Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Divorcee (USA) *Doctor/ MD/ DM/1992/5'3"/8Cr *MS/H1/1986/5'6"/40Cr *1986/5'6"/15Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

[D-537]

★★

డైరెక్ట్/45/ ప్రభుత్వ ఉద్యోగము చేయు చున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి, ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్-Ph: 83417 12438. [L-606378]

రెడ్డి, 34/5'5"/ కులం పట్టింపు లేదు. B.Tech, Softwaree / HR Manager / Asset Land / Vizag. అందమైన వధువు కావలెను. ఫోన్: 89852 80939 [V-776793]

డైరెక్ట్ కమ్మ 38/5'9"/ M.C.A., 85PM, బిజినెస్ చేయు వరుడికి 1st, 2nd, విడో, డైవోర్స్ వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. పిల్లలు ఉన్నా ok. ఫోన్: 93920 51565 [V-786752]

Rtd. Principal, Communication Skills Trainer (62 / FC / No Property) Seeks Alliance With Educated Women. (Above 54). NoBrokers. Cont: 83320 70712. [N-1189950]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి MS (USA), MBA (ISB), 30, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 32, 5' 11", SWE, 350 K, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6', Engineer, 300 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Sr Analyst 115 K, 50 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MBA, 30, 5' 8", Sr Analyst, 30 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 10", SWE, 140 K, 35 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 31, 6' 1", PG Doctor, Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, M Tech, 33, 6', 16 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MBA, 25, 5' 6", Analyst, 80 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 31, 5' 7", H1, USA, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 25, 5' 5", Doctor, 40 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 25, 5' 6", SWE, 100 K, 2 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 26, 5' 7", Deloitte, 10 L P/A, 5 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt, MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (ISB), 27, 5' 4", 28 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 6", PG Doctor, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

వరుడు కావలెను



వడ్డెర/ M.Sc / C.Govt.స్టెనో గ్రాఫర్ / రైల్వే/45,000/-PM /5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-14207]

బిన్న, అగ్నికుల క్షత్రియ, గంగపుత్ర/ B.Tech/C.Govt.P.O/SBI బ్యాంక్/52000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14207]

రెడ్డి/కుల పట్టింపు లేదు/29Yrs/ 5'6" ఎత్తు/MBBS డాక్టర్/Own Clinic/15 ఎకరాల భూమి/సంపూర్ణ కుటుంబం గల వధువుకు జాబ్/బిజినెస్ ఉన్న వరుడు కావలెను. Ph/Whats App: 9642248792

[HA-14207]

రజక/B.Tech / C.Govt.Asst.మేనేజర్/ కెనరా బ్యాంక్ / 55000/-PM / 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14207]

క్రిస్టియన్ మాల/25/5'4"/ B.Tech/ Govt. A.E/పంచాయతీరాజ్ Dept/ 40,000/-PM అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14207]

బ్రాహ్మణ/ 25/5'3" / ఇంటర్ * 29/5'4"/ B.Sc *33/5'3"/ఇంటర్ *35/5'3"/B.Sc వధువులకు వరులు కావలెను. పురోహితులు కూడా సంప్ర : Ph: 7842635086 [HA-14207]

రెడ్డి/విడో/60y/ రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్ ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8125864267 [H-601526]

పద్మశాలి/విడో/ 51y/ డిగ్రీ/ప్రైవేట్ జాబ్/సొంత ఇల్లు/8 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల, ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9703982351 [H-601526]

రెడ్డి/49y/విడో/5'4"/V.Fair/Govt. Teacher/25 ఎకరాల మాగాణి/సొంత ఇల్లు & రెంట్స్/పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. ఇల్లరికం OK. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7093717220 [H-601526]

రెడ్డి/(కుల పట్టింపు లేదు)/30y/5'3"/పెద్ద ప్రాపర్టీ కలిగి తండ్రి లేని వధువుకు 1వ లేదా 2వ వరుడు కావలెను (ఆస్తి పట్టింపు లేదు) Photos whatsapp send me Ph: 9885492498 [H-601526]

కాపు/35y/కుల పట్టింపు లేదు/2ndమ్యాచ్/ Govt.ఎంప్లాయ్/70K/PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-601526]

కాపు/1st Marriage/28y/M.Tech/1L P/M/ 4 ఎ॥ పొలం&ల్యాండ్ గల సాంప్రదాయ కుటుంబపు వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985746131 [H-787790]

రెడ్డి/విడో/55Y/Fair / Hyd లో Own House (Rents)/Business 1) పాప U.S.A లో సెటిల్డ్/ ఏ బాదర బంధీ లేని Well Settled అందమైన ఏకైక వధువుకు FC/ BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-787790]

రెడ్డి/ లేట్ మ్యారేజ్ / 30Y/MBA/ 70K p/m కోట్ల ప్రాపర్టీ, రెంట్స్ గల ఏకైక వధువుకు వరుడు కావలెను ఫోన్ : 6309344166 [H-787790]

SC మాల/23/5'5"/B.Tech (Civil) NIT, A.E.E/IES Cadre/70,000/- p/m గల అందమైన సాంప్రదాయ కుటుంబపు వధువుకు తగిన వరుడు కావలెను. (Software or Govt) Ph: 7095019114 [H-787790]

కాపు/డైవర్స్ /25Y / B.Tech / SWE/ 90,000/- P/m/Own House & Own Plots గల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను ఫోన్ 9640667754 [H-787790]

రెడ్డి/26y/5'5"/ M.Tech/ G. Employ/ 85K pm/ 15 Cr ప్రాపర్టీ, రెడ్డి/28y/5'4"/ MBBS/ MD/MS, 2 Lakhs pm, 30 Cr ప్రాపర్టీ కలిగిన వధువులకు వరులు కావలెను. Ph: 8019468462, 8897213126 [H-801478]

రెడ్డి/40y/5'4"/ Fair/ G. Employ/ Late Marriage/ 20 Acres Mango తోట, 15 Cr ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Job/ Business Ok. Ph: 7396608019, 8019484384 [H-801478]

కమ్మ/45y/5'5"/ MBA/ బిజినెస్/2 లక్షలు నెలకు, 20 Cr ప్రాపర్టీ కలిగిన వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 8019484384, 7396608019 [H-801478]

వైశ్య/53y/5'4"/ విడో/OwnRestaurant/3 లక్షలు నెలకు, 40 Cr ప్రాపర్టీ కలిగిన వధువుకి వరుడు కావలెను. పిల్లలు ఉన్నా Ok, కుల ప్రసక్తిలేదు. Ph: 7396608019, 8019484384 [H-801478]

2వ వివాహము/Govt.Emp/ 3,00,000 (PM)/ కోట్ల ప్రాపర్టీ కలిగిన అమ్మాయికి అందమైన అబ్బాయి కావలెను. కుల ప్రసక్తి లేదు. పిల్లలున్నా OK. Any Prafection సంప్ర : 9381696641 [HA-14216]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ A:30, H:5'5"/Own Business Well settled గల అందమైన వధువుకి వరుడు కావలెను (illarikam) OK. Ph: 9849337176 [HA-14216]

SC మాల & క్రిస్టియన్/M.Tech/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/65000/-PM/ 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. 9676995093, 9515755529 [HA-14216]

SC మాదిగ & క్రిస్టియన్/ B.Tech/ C.Govt. Asst మేనేజర్/SBI/5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. 9676995093, 9703978131 [HA-14216]

రెడ్డి/విడో/వయస్సు: 28, ఎత్తు : 5'4", ఎరుపు రంగు గల అందమైన వధువుకి వరుడు కావలెను. ఇల్లరికం అయినా పరవాలేదు, సొంత వ్యాపారము కలదు (కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు). Ph: 8143011223 [HA-14216]

FC/60yrs/5'4"/V.Fair/Pvt. టీచర్, పెన్షనర్ /సొంత ఇల్లు, రెంట్స్, 10 ఎకరాల వ్యవసాయ భూమి గల వధువుకి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 7816050204 [HA-14216]

SC (Mala)/ 26yrs, 5'5" LLM, Working in Law Firm Pvt. Only daughter, wheat colour, looking suitable Groom. Cont: 9848333840. Strictly No brokers please. [HA-14216]

Reddy/Bride/ 27/ 5'7"/ B.Tech (BITS) USA, Seeks Groom MS USA, Contact : Prabhakar Reddy, Ph: 9391198332 [H-801667]

వేదికలు



2nd మ్యారేజ్ లకు మాత్రమే! అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయ బడును. నో రిజిస్ట్రేషన్ ఫీ. సంప్ర : 7013226716 [HA-14213]

మైత్రి రెడ్డి మ్యారేజ్‌బ్యూరో Only for Reddys No రిజిస్ట్రేషన్ Fee/ Only Settlement Full Local/ Abroad సంబంధాలు చూడబడును. Fast Settlement GS.REDDY. Ph: 8897213126, 8019468462 [H-801478]

కేవలం యాదవ / కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజా యాదవ్. www.gokulmarriage.com, HYD: 944083 1748, GUNT: 9440759945, VSP: 9441735157. [HA-13041]

కమ్మ, కాపు, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, OC, BC, SC, ST, డాక్టర్, ఇంజినీర్, సాఫ్ట్‌వేర్, Govt. 1వ, 2వ, డైవర్స్, విడోలకు ఫాస్ట్ సెటిల్‌మెంట్ కొరకు సంప్ర : 9247217621 [HA-14216]

పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా! వ్యక్తిగతంగా పెళ్లి సంబంధాలు చూడాలా!! సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్,VIP అన్ని కులాలకు Fast Settelment పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1995]

15లో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 98490 58673, వాట్సప్: 94401 57931, 94407 85888 [B-613]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 7702955854 [H-793580]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS 15 సం॥ Exp. Ph: 9989140444 [HA-31363]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14219]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14219]

Brahmin-Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14219]

Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14219]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14219]

★★

Kalyani Matrimony గౌడ, కాపు మరియు అన్ని కులాలవారి ఉన్నతమైన సాంప్రదాయబద్ధమైన పెండ్లి సంబంధాల కొరకు వెంటనే సంప్ర: Ph: 8500747535, 9533133969 kalyanimatrimony.in [H-801522]

అట్టహాసంగా కొండవీడు ఫెస్ట్-2024 ఆరంభం

ఉత్సవాలను తిలకించేందుకు భారీగా వచ్చిన జనం

యడ్లపాడు: పల్నాడు జిల్లా చారిత్రక, పర్యాటక కేంద్రమైన కొండవీడు ఫెస్ట్-2024 ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వీటిని కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్‌వో రామచంద్ర రావు, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి బెలూన్లు ఎగరేసి ప్రారంభించారు. ఈ ఉత్సవాలు 2 రోజుల పాటు కొనసాగనున్నాయి. తొలిరోజున కొండంతా సందర్శకులతో జనసంద్రంగా మారింది. ఫ్లవర్ షో, కొండవీడు సామ్రాజ్యం నమూనా సైకతశిల్పం, చారిత్రక అంశాలు తెలిపే గ్యాలరీ, కొండవీడులో చూడదగ్గ ప్రదేశాలు వాటి విశిష్టతల బోర్డులు, వెరైటీ వంటకాలు, చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఆర్చ్యరీ, గన్ షూటింగ్, హార్స్‌రైడింగ్ చేయగా, ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, ఫిషరింగ్, పారాగ్లైడింగ్ వంటి అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో యువత ఆసక్తిగా పాల్గొంది. బోటింగ్, హెలీరైడ్‌లకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. కొండవీడు యూపీ స్కూల్ విద్యార్థులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా పలు చారిత్రక అంశాలపై నిర్వాహకులు అవగాహన కల్పించారు.

నైతిక విలువలతోనే న్యాయవాద వృత్తిలో రాణింపు

- సామాజిక స్పృహ కూడా ఉండాలి
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలి
- అంకితభావంతో కృషి చేస్తేనే విజయం
- సుసంపన్న భారత్ నిర్మాణంలో మీదే కీలకపాత్ర
- యువ న్యాయవాదులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఉద్బోధ
- అనంతపురంలో శిక్షణ కార్యక్రమం
- హాజరైన పలువురు ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు



యువ న్యాయవాదుల సదస్సులో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా

అనంతపురం: సామాజిక స్పృహతో పాటు నైతిక విలువలు పెంపొందించుకుంటేనే న్యాయవాద వృత్తిలో రాణిస్తారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వృత్తికి జోడించాలని సూచించారు. కక్షిదారులకు న్యాయం అందించే విషయంలో న్యాయవాదులు, న్యాయమూర్తులకు సమాన పాత్ర ఉంటుందని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు వేర్వేరు కాదని ఇరువురూ కలసి పనిచేయాల్సి ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం యువ న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు.. జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు.. జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ యు.దుర్గాప్రసాద్ రావు, జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి, జస్టిస్ కె.సురేష్ రెడ్డి, డాక్టర్ కె.మన్మథరావు, జస్టిస్ బి.శ్యామసుందర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ సి.ప్రభాకరన్, మెంబర్ ఎ.రామిరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా మాట్లాడుతూ సమాజంలో అత్యంత విలువైన, సమాజ సేవకు దోహదపడే న్యాయవాద వృత్తిలో నైతిక విలువలు పాటించడం ముఖ్యమన్నారు. వృత్తిలో అత్యున్నతంగా ఎదగడానికి ఎలాంటి సత్వర మార్గాలూ లేవన్నారు. సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో కృషి చేస్తేనే విజయం సిద్ధిస్తుందని ఉద్బోధించారు. అంతిమంగా ఉత్తమ న్యాయవాదిగా గుర్తింపు దక్కితేనే వృత్తిలో సఫలీకృతమైనట్లు భావించాలన్నారు. మనకు కక్షిదారుడు ముఖ్యం కావచ్చు కానీ మనం వాదిస్తున్న కేసు కచ్చితమైనదా, కాదా అనే అంశం మనకు మాత్రమే తెలుస్తుందన్నారు.



సదస్సుకు హాజరైన యువ న్యాయవాదులు

రెండు, మూడు దశాబ్దాల కిందట న్యాయవాదులే ప్రజాప్రతినిధులుగా ఉండేవారని గుర్తు చేశారు. కీలకమైన రంగాల్లో రాణించేవారని తెలిపారు. కారణం న్యాయవాద వృత్తి పట్ల ప్రజలకు ఉన్న గౌరవం, నమ్మకం అలాంటిదన్నారు. న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకున్నదని చెప్పారు. కేసు లోతుల్లోని వివరాలు తెలుసుకునేందుకు న్యాయమూర్తులు లాయర్లకు పలు ప్రశ్నలు వేస్తుంటారని, ప్రశ్నలు వేసిన కారణంగా కోర్టు తమకు వ్యతిరేకంగా ఉందని భావించకూడదన్నారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తులు తీర్పులిచ్చే విషయంలో తీవ్ర ఒత్తిడికి గురవుతుంటారని పేర్కొన్నారు. తమ తీర్పుల ద్వారా కక్షిదారులకు అన్యాయం జరగకూడదని భావిస్తుంటారని తెలిపారు. తీర్పు చెప్పడం తేలికైన విషయం కాదన్నారు.

బెరుకు లేకుండా వాదనలు వినిపించాలి

న్యాయవాద వృత్తి స్వతంత్రమైనదని, ఈ వృత్తిలో స్థిరపడినవారు ఒకరి కింద పని చేయాల్సిన అవసరం ఉండదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవచ్చన్నారు. గెలుపోటములను పక్కనపెట్టి యువ న్యాయవాదులు ఎలాంటి బెరుకు, ఆందోళన లేకుండా వాదనలు వినిపించాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్న భావనతో వృత్తిని ఆరంభించాలన్నారు. కేసు గురించి న్యాయమూర్తిని కేవలం 4- 5 నిముషాల్లోనే ఒప్పించగలిగే సామర్థ్యం ఉండాలని సూచించారు. ప్రస్తుత కాలంలో న్యాయవాదులు కట్, కాపీ, పేస్ట్ విధానాన్ని వినియోగిస్తున్నారని.. ఈ తరహా విధానంతో నిష్ణాతులు కాలేరని స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సును వినియోగించకుండా వృత్తి పట్ల అంకితభావంతో ఉండాలన్నారు. ఎంత ఎక్కువ అభ్యసనం చేస్తే అంతే స్థాయిలో వృత్తిలో రాణిస్తారని తెలిపారు. ఓపిక, సహనం ఉంటేనే విజయం సాధించగలరని యువ న్యాయవాదులకు దిశానిర్దేశం చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి మాట్లాడుతూ సుసంపన్నమైన భారత్ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ఉందన్నారు. దేశం సుసంపన్నంగా వర్ధిల్లాలంటే చట్టం అందరికీ సమానమన్న భావన కలిగి ఉండాలని చెప్పారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అదే రోజు పూర్తి చేయాలని.. వాయిదా విధానం మంచిది కాదన్నారు.

అవయవదానం అజ'రాము'రం

- మహిళా వలంటీర్ కుటుంబ సభ్యుల ఔదార్యం
- పుట్టెడు దుఃఖంలోనూ పెద్ద మనసు
- జీవన్‌ధార ట్రస్ట్‌కు అవయవాల అందజేత



అవయవదానం చేస్తూ పత్రాన్ని ఆస్పత్రి సిబ్బందికి అందిస్తున్న భర్త శివ



రాము (ఫైల్)

అగనంపూడి (గాజువాక): మరణించినా తన భార్య చిరంజీవిగా నిలవాలని, ప్రాణాపాయంలో ఉన్న మరికొందరికి పునర్జన్మ ప్రసాదించాలని ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన మహిళా వలంటీర్ రాము భర్త శివ తలచారు. గొప్ప ఔదార్యంతో ఆమె అవయవాలను జీవనధార ట్రస్ట్‌కు దానం చేశారు. జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం వార్డు సచివాలయ వలంటీర్ గొంతిన రాము (42) గత ఆదివారం అగనంపూడి వంతెనపైన వెళ్తున్న ఆటో నుంచి జారిపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో ఆమెను గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. పరిస్థితి విషమించడంతో గురువారం ఆమెను మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం సాయంత్రం బ్రెయిన్ డెడ్ కావడంతో వైద్యులు నిస్సహాయతను వ్యక్తం చేశారు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ సరదాగా గడిపిన రాము ఇక తిరిగి రాదని తెలిసి భర్త శివతోపాటు ఇద్దరు కుమారులు తల్లడిల్లిపోయారు. అంతటి దుఃఖంలోనూ పెద్దమనసు చాటారు. భార్య అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. శనివారం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో అవయవాలను తొలగించి భద్రపరిచి జీవనధార ట్రస్ట్‌కు అందించారు. అవయవదానం పూర్తయిన తరువాత సాయంత్రం బంధువులు, ఆప్తులు కన్నీటి వీడ్కోలు మధ్య లంకెలపాలెం శ్మశాన వాటికలో రాము భౌతిక దేహానికి అంతిమసంస్కారాలు చేశారు.



మృతదేహాన్ని తీసుకువెళ్తుండగా గౌరవ వందనంతో వీడ్కోలు పలుకుతున్న ఆస్పత్రి సిబ్బంది

పొత్తుకు విఘాతం కలిగేలా మాట్లాడవద్దు

- జనసేన నాయకులకు అధినేత పవన్‌కళ్యాణ్ సూచన
- పార్టీ విధానాలకు భిన్నంగా వ్యాఖ్యానాలు వద్దు
- అభ్యంతరాలు ఉంటే నా రాజకీయ కార్యదర్శిని సంప్రదించండి


సాక్షి, అమరావతి: టీడీపీతో పొత్తుకు విఘాతం కలిగించేలా జనసేన నాయకులు ఎలాంటి ప్రకటనలు, ప్రయత్నాలు చేయవద్దని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ విధానాలకు భిన్నమైన అభిప్రాయాలు ప్రచారం చేయొద్దని సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'విస్తృతమైన రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పొత్తుల దిశగా ముందుకు వెళుతున్నాం. పొత్తులకు సంబంధించి చర్చలు కొనసాగుతున్న ఈ దశలో పార్టీ నాయకులు భావోద్వేగాలతో ఎలాంటి వ్యాఖ్యానాలు చేయొద్దు. పార్టీ విధానాలకు భిన్నమైన అభిప్రాయాలు ప్రచారం చేయొద్దు. ఇటువంటి ప్రకటనల వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించినవారవుతారు. ఇందుకు సంబంధించిన అభిప్రాయాలూ, సందేహాలు ఏమైనా ఉంటే నా రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ దృష్టికి తీసుకురావచ్చు. తద్వారా మీ ఆలోచనలు, భావోద్వేగాలు పార్టీకి చేరుతాయి. పొత్తులపై పార్టీ విధానాలకు భిన్నంగా ప్రకటనలు చేసే నాయకుల నుంచి వివరణ తీసుకోవలసిందిగా ఇప్పటికే కేంద్ర కార్యాలయానికి స్పష్టత ఇచ్చాను. పొత్తుకు విఘాతం కలిగించాలని ఎవరు ప్రయత్నించినా వారిని ప్రజలు గమనించకమానరు' అని ప్రకటనలో పేర్కొన్నారు.

14 నుంచి ఉభయగోదావరి జిల్లాలో పవన్ పర్యటన

పవన్ కళ్యాణ్ ఈ నెల 14 నుంచి 17 వరకూ ఉభయ గోదావరి జిల్లాల్లో పర్యటిస్తారని జనసేన శనివారం పేర్కొంది. భీమవరం, అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలలో జరిగే పార్టీ ముఖ్యనాయకుల సమావేశాల్లో పాల్గొంటారని పేర్కొంది.

క్లుప్తంగా...

సౌర ఆధారిత 'సూడో శాటిలైట్' విమాన ప్రయోగం సక్సెస్



సాక్షి, బళ్లారి: సౌరశక్తితో పనిచేసే నూతన తరం మానవ రహిత విమానం తొలి ప్రయోగం విజయవంతమైంది. అత్యంత ఎక్కువ ఎత్తులో ప్రయాణించగలదు కాబట్టి దీనిని హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ వెహికల్(హెచ్ఏపీఎస్)గానూ పిలుస్తారు. బెంగళూరులోని నేషనల్ ఏరో స్పేస్ ల్యాబొరేటరీస్(ఎన్ఏఎల్) కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చళ్లకెరె టెస్టింగ్ రేంజ్ పరిధిలో దీనిని విజయవంతంగా పరీక్షించింది. సుమారు 12 మీటర్ల పొడవైన రెక్కలున్న ఈ అధునాతన డ్రోన్ బరువు 23 కేజీలు. ఇది సౌరశక్తితో పనిచేస్తూ ఏకధాటిగా నెలల తరబడి గగనతలంలో చక్కర్లు కొట్టగలిగేలా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల పరీక్ష సందర్భంగా సుమారు మూడు కిలోమీటర్ల ఎత్తులో దీనిని పరీక్షించారు. పరీక్షలో భాగంగా ఇది ఎనిమిదిన్నర గంటలపాటు ఏకధాటిగా గగనతలంలోనే చక్కర్లు కొట్టింది. ఇటువంటి డ్రోన్లు సరిహద్దు ప్రాంతాల్లో నిఘాకు ఎంతగానో దోహదపడతాయి. వాణిజ్య విమానాలు ప్రయాణించే ఎత్తు కన్నా రెండు రెట్లు ఎక్కువ ఎత్తులో ఈ డ్రోన్ ఎగరగలదు. సుమారు 18–20 కిలోమీటర్ల ఎత్తులో విహరిస్తూ నిఘా, పర్యవేక్షణా సామర్థ్యాలను మరింత పటిష్టవంతం చేయగలదని సంబంధిత అధికారులు తెలిపారు. హెచ్ఏపీఎస్ అభివృద్ధిపై ఎన్ఏఎల్ డైరెక్టర్ అభయ్ అనంత్ పశీల్కర్ మాట్లాడారు. '' వాణిజ్యపరంగా ఉత్పత్తి మొదలెట్టడానికి ముందు ఇది ఎన్నో అవరోధాలను దాటాల్సి ఉంది. పగలంతా సోలార్ బ్యాటరీలు చార్జ్ అయ్యేలా ఆ శక్తిని రాత్రిళ్లు వినియోగించుకునేలా మార్పులు చేయాల్సి ఉంది. వచ్చే నెలలో దీనిని మళ్లీ ప్రయోగిస్తాం. ఈసారి ఏకధాటిగా 24 గంటలపాటు గగనతలంలోనే ఉండేలా చేసి పరీక్షిస్తాం. 2027 సంవత్సరంకల్లా దీనిని సంసిద్ధంచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మారుమూల ప్రాంతాల్లో మొబైల్ కమ్యూనికేషన్స్ అవసరాలకూ దీనిని వినియోగించవచ్చు.'' అని ఆయన అన్నారు. వచ్చే మూడేళ్లలో ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ తరహా టెక్నాలజీ ఉన్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరనుంది.

ఏఎన్‌యూ డిగ్రీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) పరిధిలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఎం, బీఏవోఎల్, బీహెచ్ఎం కోర్సుల మూడో సెమిస్టర్ కోర్సుల పరీక్ష ఫలితాలను శనివారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ విడుదల చేశారు. ఫలితాలను www.anu.ac.in ద్వారా పొందవచ్చు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 26 ఆఖరు తేదీగా నిర్ణయించారు. ఫలితాల విడుదలలో రెక్టార్ ఆచార్య వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య కరుణ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఈడీ షాక్

సాక్షి, బళ్లారి: బళ్లారి నగర కాంగ్రెస్ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి, చిన్నాన్న ప్రతాప్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ ఆకస్మిక దాడులు చేసింది. శనివారం ఉదయం బెంగళూరు నుంచి వచ్చిన ఈడీ అధికారులు నాలుగు బృందాలుగా విడిపోయి ఏకకాలంలో వారి నివాసాలు, ఆఫీసుల్లో సోదాలు చేపట్టారు. ఎమ్మెల్యే పీఏలు రత్నబాబు, సతీష్‌రెడ్డి ఇళ్లలోనూ తనిఖీలు చేశారు. ఎమ్మెల్యే, ఆయన కుటుంబం ఆదాయానికి మించిన ఆస్తులను సంపాదించారనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ దాడులు జరిగినట్లు సమాచారం. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న తరుణంలో జిల్లాలో నారా సూర్యనారాయణరెడ్డి గ్రానైట్, ఇతరత్రా వ్యాపారాలకు సంబంధించి బళ్లారితో పాటు చెన్నైలోని కార్యాలయాల్లో సోదాలు చేసి రికార్డులను పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు కల్పించారు. గత ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో భరత్‌రెడ్డి తొలిసారి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

సీఎం జగన్‌కు సీపీఎం లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలను కూడా భర్తీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే ప్రభుత్వం మాత్రం 2024 డీఎస్సీ కేవలం 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అందులోనూ వ్యాయామ ఉపాధ్యాయులకు స్థానం కల్పించలేదని తెలిపారు. సీఎం జగన్ ప్రత్యేకంగా చొరవచూపి డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ప్రకటించి, భర్తీ చేయాలని శ్రీనివాసరావు కోరారు.

ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై సుప్రీంకు

తెలంగాణ సహాయ నిరాకరణ చేస్తే సుప్రీం కోర్టుకు నివేదించాలని కేంద్రం నిర్ణయం

2021లో శ్రీశైలంలో తెలంగాణ జల చౌర్యంపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

- కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జులై 15న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్
- ఇప్పటికీ అమల్లోకి రాని గెజిట్ నోటిఫికేషన్
- గతేడాది మళ్లీ శ్రీశైలంలో తెలంగాణ జలచౌర్యం
- హక్కుల పరిరక్షణకు నడుం బిగించిన సీఎం జగన్
- సాగర్ స్పిల్ వేలో సగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రాజెక్టుల అప్పగింతకు గత నెల 17న రెండు రాష్ట్రాలు అంగీకారం
- ఆ తర్వాత అడ్డం తిరిగిన తెలంగాణ అధికారులు
- ఈ నెల 16న ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మరోసారి భేటీ



సాక్షి, అమరావతి: శ్రీశైలం, నాగార్జున సాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించకుండా తెలంగాణ సహాయ నిరాకరణ చేస్తే సుప్రీంకోర్టుకు నివేదించాలని కేంద్రం నిర్ణయించింది. గత నెల 17న కేంద్ర జల్ శక్తి శాఖ నిర్వహించిన సమావేశంలో నెలలోగా ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాల అధికారులు అంగీకరించారు. కానీ, ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకోగానే తెలంగాణ అధికారులు మాటమార్చారు. ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింత విధి విధానాల ఖరారుకు ఈనెల 1న హైదరాబాద్‌లో జరిగిన కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలోనూ ఉమ్మడి ప్రాజెక్టులకు రెండు రాష్ట్రాల అధికారులు అంగీకరించినట్లు ప్రకటించినా, ఆ తర్వాత తెలంగాణ అధికారులు మరోసారి మాట మార్చారు. ఈ నేపథ్యంలో గత నెల 17న తీసుకున్న నిర్ణయాల అమలుపై ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ రెండు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టుల అప్పగింతకు తెలంగాణ అధికారులు అంగీకరించకపోయినా లేదా గైర్హాజరైనా అదే అంశాన్ని సుప్రీంకోర్టుకు నివేదించి, కోర్టు మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్ణయించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు 2021లో ఎగువ నుంచి వరద రాకుండానే తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి ప్రారంభించింది. ఇక్కడి నుంచి నీటిని సాగర్‌కు తరలించింది. ఇలా శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేస్తూ రాష్ట్ర హక్కులను హరిస్తుండటంతో సీఎం వైఎస్ జగన్ న్యాయ పోరాటానికి దిగారు. కృష్ణాబోర్డు పరిధిని నోటిఫై చేసి, అక్రమంగా విద్యుదుత్పత్తి చేయకుండా తెలంగాణను కట్టడి చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దాంతో కృష్ణాబోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జులై 15న కేంద్ర జల్ శక్తి శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి ప్రాజెక్టులను ఏడాదిలోగా బోర్డుకు అప్పగించాలని కేంద్రం ఆదేశించింది. శ్రీశైలం, సాగర్‌లో రాష్ట్ర భూభాగం పరిధిలోని ఆరు అవుట్‌లెట్లను బోర్డుకు అప్పగించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. తెలంగాణ సర్కారు మాత్రం తమ భూభాగంలోని తొమ్మిది అవుట్‌లెట్లను అప్పగించేందుకు నిరాకరించింది.

యథేచ్ఛగా తెలంగాణ జలచౌర్యం

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గతేడాది అక్టోబర్ 6న కృష్ణా బోర్డు రాష్ట్రానికి కేటాయించిన 30 టీఎంసీల్లో 17 టీఎంసీలను ఎడమ గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్‌కు తెలంగాణ సర్కార్ తరలించింది. ఆ 17 టీఎంసీలను గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేయాలని రాష్ట్ర అధికారులు చేసిన విజ్ఞప్తులను తెలంగాణ పట్టించుకోలేదు. ఇదే విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు వివరించారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత కేంద్రం రాష్ట్రానికి అప్పగిస్తే.. తెలంగాణ భూభాగంలో ఉందంటూ ఎడమ గట్టు విద్యుత్కేంద్రాన్ని తెలంగాణ సర్కారు అధీనంలోకి తీసుకుందని, అదే తరహాలో రాష్ట్ర భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్ స్పిల్ వే 13 గేట్లతోసహా కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను అధీనంలోకి తీసుకుని, నీటిని విడుదల చేయాలని అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. దాంతో నవంబర్ 30 తెల్లవారుజామున సీఈ మురళీనాథ్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర పోలీసులు, జలవనరుల అధికారులు సాగర్ స్పిల్ వేలో సగాన్ని, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాగునీటి అవసరాల కోసం కుడి కాలువకు 2,300 క్యూసెక్కులు విడుదల చేశారు. దీనిపై తెలంగాణ సర్కారు కేంద్రానికి ఫిర్యాదు చేసింది. దాంతో డిసెంబర్ 1న రెండు రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ బల్లా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంయమనం పాటించాలని ఆదేశించారు. సాగర్‌పై నవంబర్ 30 నాటి యథాస్థితిని కొనసాగిస్తూ నిర్వహణ బాధ్యతను బోర్డుకు అప్పగించారు. ఈ వివాదాన్ని పరిష్కరించాలని కేంద్ర జల్ శక్తి శాఖను ఆదేశించారు.

ఏపీఈపీడీసీఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

ప్రకటించిన ఇప్పయ్



ఎంఎన్ఆర్ఈ సెక్రటరీ భూపిందర్ సింగ్ భల్లా, నుంచి ఇప్పయ్ పవర్ అవార్డు స్వీకరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ డి చంద్రం

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ సరఫరాలో మెరుగైన సేవలందిస్తున్న ఏపీఈపీడీసీఎల్‌ను రెండు ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి అవార్డులు వరించాయి. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఇప్పయ్) ఈ అవార్డులు ప్రకటించింది. ఇంధన రంగంలో విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించిన సరికొత్త కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ తదితర అంశాలపై చర్చించేందుకు బెల్గాంలో 'ఇప్పయ్' ఆధ్వర్యంలో '24వ రెగ్యులేటరీ–పాలసీమేకర్స్ రిట్రీట్' పేరిట ఈనెల 8న సదస్సు ప్రారంభమైంది. 11వతేదీ వరకు జరగనున్నది. దీన్లోభాగంగా శనివారం జరిగిన ఇప్పయ్ పవర్ అవార్డ్స్–2024 ప్రదానోత్సవ కార్యక్రమంలో ఇంధన రంగంలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు, వినియోగదారుల్లో అవగాహన పెంచే అంశంలో ప్రోత్సహిస్తున్నందుకు ఏపీఈపీడీసీఎల్ రెండు విభాగాల్లో అవార్డులు సొంతం చేసుకుంది. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తరఫున సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డీ చంద్రం ఈ అవార్డులను శనివారం రాత్రి అందుకున్నారు. సంస్థకు రెండు జాతీయ అవార్డులు లభించడంపై సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో వినియోగదారులకి మరిన్ని నాణ్యమైన సేవలందిస్తూ, వినియోగదారులకు మరింత అవగాహన కల్పిస్తూ, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి సైతం విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి సీఎండీ అభినందనలు తెలిపారు.

'పునరుత్పాదక విద్యుత్'.. రెండో స్థానంలో ఏపీ

- నెడ్‌క్యాప్ వైస్ చైర్మన్, ఎండీ రమణారెడ్డి వెల్లడి
- విశాఖలో కర్బన ఉద్గారాల నియంత్రణలో పరిశ్రమల పాత్రపై జాతీయ సదస్సు

సాక్షి, విశాఖపట్నం: భారత్‌లో పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు లక్ష్యం (రెన్యువబుల్ పవర్ ఆబ్లిగేషన్ (ఆర్‌పీవో))లో 2021–22 నాటికి దేశంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని నెడ్‌క్యాప్ వైస్ చైర్మన్, ఎండీ రమణారెడ్డి తెలిపారు. కర్ణాటక 41.3 శాతంతో మొదటి స్థానంలో ఉండగా.. 28.5 శాతంతో ఏపీ రెండో స్థానంలో ఉందన్నారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ 2021–22 నాటికి ఆర్‌పీవో లక్ష్యాన్ని 21.18 శాతంగా నిర్దేశించగా ఏపీ దాన్ని అధిగమించిందని వివరించారు. ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), నెడ్‌క్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో క్లీన్ గ్రోత్ డ్రైవింగ్ పోర్ట్, ఎనర్జీ ఇంటెన్సివ్‌లో క్లీన్ ఇన్వెస్ట్‌మెంట్, కర్బన ఉద్గారాల నియంత్రణలో పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధన పరిశ్రమల పాత్ర' అనే అంశంపై శనివారం విశాఖలో సదస్సు జరిగింది. ఇందులో రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 9,008.78 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఈ రంగంలో దేశంలో ఐదో స్థానంలో నిలిచామని వివరించారు. ఇందులో సోలార్ పవర్ 38.50 గిగావాట్లు కాగా విండ్ పవర్ 44 గిగావాట్లు ఉందని తెలిపారు. దీంతోపాటు వేస్ట్ టు ఎనర్జీ కింద 36.15 మెగావాట్లు, పారిశ్రామిక వ్యర్థాల నుంచి 40.97 మెగావాట్లు, చిన్న హైడ్రో ప్రాజెక్టుల నుంచి 106.80 మెగావాట్లు ఉత్పత్తి అవుతోందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పాలసీ దేశానికే ఆదర్శం..

2020లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పునరుత్పాదక విద్యుత్ ఎగుమతుల పాలసీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రమణారెడ్డి తెలిపారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల విషయంలోనూ రాష్ట్రం 37 శాతంతో దేశంలో అగ్రగామిగా ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం 4,745.60 మెగావాట్ల సామర్థ్యంతో 8 ప్రాజెక్టులు నడుస్తున్నాయని చెప్పారు. మరో 3,260 మెగావాట్ల సామర్థ్యంతో 4 ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అలాగే 2,350 మెగావాట్లతో 2 ప్రాజెక్టులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) దశలో, 59,357 మెగావాట్లతో 47 ప్రాజెక్టులు సర్వే దశలో ఉన్నాయని వివరించారు. ఈ మొత్తం 61 ప్రాజెక్టుల్లో 26,050 మెగావాట్ల సామర్థ్యంతో 23 ప్రాజెక్టులు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని తెలిపారు. పంప్డ్ హైడ్రో ఎలక్ట్రికల్ స్టోరేజ్ ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. 21 ప్రాంతాల్లో 16.18 గిగావాట్ల ఉత్పత్తికి, 37 ప్రాంతాల్లో 42.02 గిగావాట్ల ఉత్పత్తికి పీఎస్‌పీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రం పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టులకు పూర్తి అనుకూలంగా ఉందన్నారు.

కర్బన ఉద్గారాల నియంత్రణకు భారత్ నడుం బిగించింది..

ఈ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి డా.యువరాజ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రారంభించిన మిషన్ లైఫ్ కార్యక్రమం ద్వారా విద్యుత్ రంగంలో 51.3 శాతం, రవాణా రంగంలో 13.2 శాతం కర్బన ఉద్గారాల నియంత్రణకు భారత్ నడుంబిగించిందన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ద్వారా ఈ లక్ష్యాన్ని వీలైనంత త్వరగా చేరుకోగలమని ఆకాంక్షించారు. 2030 నాటికి 1 బిలియన్ టన్నుల కర్బన ఉద్గారాల నియంత్రణ దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. అదే ఏడాది నాటికి భారత్‌లో హైడ్రోజన్ డిమాండ్ 13 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకుంటుందన్నారు. ఇది 2050 నాటికి 28 ఎంఎంటీ దాటుతుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. దానికనుగుణంగా కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్ ప్రదీప్ జె తారకన్, సీఐఐ చైర్మన్ డా.లక్ష్మీప్రసాద్, పలువురు పారిశ్రామికవేత్తలు, విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

'వనరుల' పరిరక్షణలో ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శం

- కర్బన ఉద్గారాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం అభినందనీయం
- 'సాక్షి'తో ఏడీబీ ఎనర్జీ డైరెక్టర్ ప్రదీప్ జె.తారకన్



సాక్షి, విశాఖపట్నం: పర్యావరణ పరిరక్షణలో ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ)ముఖ్య భూమిక పోషిస్తోందని సంస్థ ఎనర్జీ ట్రాన్సిషన్ డైరెక్టర్ ప్రదీప్ జె.తారకన్ చెప్పారు. విశాఖలో నెడ్‌క్యాప్, ఏడీబీ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో క్లీన్ గ్రోత్ డ్రైవ్, పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు–కర్బన ఉద్గారాల నియంత్రణ' సదస్సుకు ఆయన హాజరై 'సాక్షి'తో మాట్లాడారు. రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఏపీ ఎంతో అనుకూలంగా ఉందన్నారు. ఇంధన వనరుల పరిరక్షణ, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో భారత్ ప్రపంచానికి ఆదర్శమైతే, ఏపీ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శమవుతోందని చెప్పారు. ఏపీలో రెన్యువబుల్ ఎనర్జీకి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ఏపీలో సౌర విద్యుత్, విండ్ పవర్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తుండటం అభినందనీయమన్నారు. క్లీన్ టెక్నాలజీ కోసం ఉత్పాదక సంస్థలకు ప్రోత్సాహకాలు కల్పిస్తుండటం, ప్రపంచస్థాయి ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి పరిణామాలు రాష్ట్రాలకు ఆదర్శమన్నారు. ఏపీ మాదిరిగా ఇతర రాష్ట్రాలు ఆలోచన చేస్తే.. ఇండియా నిర్దేశించుకున్న సున్నా కర్బన ఉద్గారాల నియంత్రణ లక్ష్యాన్ని త్వరితగతిన చేరుకోవచ్చని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి సంబంధించిన ప్రాజెక్ట్‌లలో సహకరించేందుకు భారత్‌తో జతకట్టినట్లు చెప్పారు. 2014–21 మధ్యలో భారత్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 250 శాతం పెరిగిందని, ఇది ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందన్నారు. రెన్యువబుల్ ఎనర్జీలో ప్రపంచానికి ఆదర్శంగా భారత్ నిలిచిందన్నారు. 2030కి 45% ఉద్గారాల తీవ్రత తగ్గించాలని భారత్ నిర్దేశించుకుందని, 2070కి సున్నా కర్బన ఉద్గారాలే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. పునరుత్పాదక ఇంధనవనరుల వినియోగం ద్వారా త్వరగా లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అయితే భారత్‌కు ఆర్థిక పరంగా ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏడీబీ సహకారం అందిస్తుందన్నారు.

స్టార్టప్స్‌కు డెస్టినేషన్‌గా ఏపీ

- రాష్ట్రంలో ఉన్న స్టార్టప్స్‌లో మూడో వంతు విశాఖలోనే ఉన్నాయి
- ఏఐ అండ్ క్లౌడ్ సమ్మిట్–2024లో ఎస్‌టీపీఐ ఏడీ సురేష్ బాత్రా



విశాఖలో జరిగిన ఏఐ క్లౌడ్ సమ్మిట్–2024లో మాట్లాడుతున్న సురేష్ బాత్ర

సాక్షి, విశాఖపట్నం: స్టార్టప్స్ డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతోందని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) అడిషనల్ డైరెక్టర్(ఏడీ) సురేష్ బాత్రా అన్నారు. డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ (డీటీఎన్ఎఫ్) అధ్వర్యంలో విశాఖలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం నిర్వహించిన ఏఐ క్లౌడ్ సమ్మిట్–2024ను సురేష్‌బాత్ర, విశాఖ నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ ప్రారంభించారు. సురేష్ మాట్లాడుతూ ఏపీలో స్టార్టప్‌లకు ఎకోసిస్టమ్ అద్భుతంగా ఉందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుకూల వాతావరణం ఏపీలో ఉండటంతో కొత్త ఐటీ, ఐటీ అనుబంధ పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. ఐటీ, అనుబంధ పరిశ్రమలకు విశాఖ కీలకంగా మారుతోందన్నారు. రాష్ట్రంలో ఉన్న స్టార్టప్స్‌లో మూడోవంతు విశాఖలోనే ఉన్నట్లు తెలిపారు. సీపీ రవిశంకర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది నేరస్తులను గుర్తించేందుకే కాకుండా నేర నియంత్రణకు, పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఏపీ ఇన్నోవేటివ్ సొసైటీ సీఈవో అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 44 ఇంక్యుబేషన్ సెంటర్లలో స్టార్టప్ సంస్థల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ భారత్‌లో ఉన్న ఎంఎన్‌సీ, హైటెక్ కంపెనీలకు చెందిన నిపుణులను ఒకేచోట చేర్చి రాబోయే రోజుల్లో అందుబాటులోకి రానున్న సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా డీటీఎన్ఎఫ్, ఏపీఐఎస్ మధ్య కృత్రిమ మేధకు సంబంధించిన ఎంవోయూ జరిగింది. సదస్సులో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణులు ఆయా రంగాల్లో ఉన్న అవకాశాల గురించి వివరించారు.

యువకుడి ప్రాణాలను కాపాడిన వలంటీర్

- తల్లి మందలించిందని ఆత్మహత్యాయత్నం చేసిన కుమారుడు
- ప్రాథమిక చికిత్స చేసి సకాలంలో ఆస్పత్రికి తరలించిన వలంటీర్



గోపీచంద్‌ను ఆస్పత్రికి తీసుకొచ్చిన వలంటీర్

బల్లికురవ: ఆత్మహత్యాయ్నతం చేసిన ఓ యువకుడి ప్రాణాలను వలంటీర్ కాపాడాడు. ప్రాథమిక చికిత్స చేసి సకాలంలో ఆస్పత్రికి తరలించాడు. ఈ ఘటన బాపట్ల జిల్లా బల్లికురవ మండలం రామాంజనేయపురంలో శనివారం జరిగింది. కుంచాల సుభాషిణి, కనకారావు దంపతుల కుమారుడు గోపీచంద్ (17) ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నాడు. కనకారావు ఐదేళ్లుగా గ్రామంలో లేడు. సుభాషిణి తన తండ్రి వెంకటేశ్వర్లు వద్ద ఉంటూ తనకున్న పొలంతోపాటు కుమారుని సాయంతో గొర్రెలను మేపుతోంది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు అనారోగ్యం బారిన పడ్డాడు. గోపీచంద్ గొర్రెల కాపలాకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో అతడిని సుభాషిణి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గోపీచంద్ ఇంట్లోనే పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడిని గమనించిన తల్లి వెంటనే ఇరుగుపొరుగు వారిని పిలిచింది. అక్కడే ఉన్న సీ వన్ క్లస్టర్ వలంటీర్ బత్తుల రమేశ్‌బాబు..గోపీచంద్ పురుగుమందు తాగినట్లు గుర్తించాడు. బీఎస్సీ నర్సింగ్ చదివిన వలంటీర్.. గోపీచంద్‌కు ప్రాథమిక చికిత్స చేసి తాగిన పురుగు మందును కక్కించాడు. మెరుగైన చికిత్స కోసం 35 కి.మీ దూరంలో ఉన్న నరసరావుపేట వైద్యశాలకు తీసుకెళ్లేందుకు అంబులెన్స్ రావడం ఆలస్యమవుతుందని భావించి మరొకరి సహాయంతో బైక్‌పైనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. సకాలంలో వైద్యం అందడంతో గోపీచంద్ ప్రాణాపాయస్థితి నుంచి బయటపడి ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. యువకుడి ప్రాణాలను కాపాడిన వలంటీర్‌ను గ్రామ సచివాలయ కార్యదర్శి షేక్.బాజీ, ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోఆర్డీ దాసరి సుమతి అభినందించారు.

'దత్తత స్వీకారంలో నిబంధనలు తప్పనిసరి'



మాట్లాడుతున్న జగన్నాథపతి

సీతమ్మధార (విశాఖ ఉత్తర): దత్తత స్వీకారం సమయంలో ప్రభుత్వ నిబంధనలు తుచ తప్పకుండా పాటించాలని కేంద్ర ప్రభుత్వ దత్తత వనరుల సంస్థ (కారా) న్యూఢిల్లీ ప్రోగ్రాం డైరెక్టర్ జగన్నాథపతి సూచించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో కారా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల దత్తత వనరుల సంస్థ (సారా), స్త్రీ, శిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ విభాగాలు సంయుక్తంగా చట్టబద్ధ దత్తతలపై రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దత్తత తీసుకోవాలనుకున్న దంపతులకు తప్పనిసరిగా రెండేళ్ల స్థిరమైన వివాహ బంధం ఉండాలన్నారు. చట్టబద్ధ దత్తతలపై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా శాఖల సమన్వయంతో ప్రచారం చేయాలని సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.